
www.jagritiweekly.com
సంపుటి : 76 సంచిక : 14 పుటలు : 52

# జాగృతి

కలి 5125 - శ్రీ శోభకృత్ మాఘ శుద్ధ తదియ
12-18 ఫిబ్రవరి 2024
వెల : ₹20/-



# అనితరసాధ్యుడికి భారత రత్న

దేశ చరిత్రను మలుపుతిప్పిన అత్యవసర పరిస్థితి, అయోధ్య ఉద్యమాలలో అద్వాణీ స్థానం ఘనమైనది

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

76 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

# సంగీతమే సాధనంగా భగవదారాధన






తన కీర్తనలనే పుష్పాలను చేసి ఆ భగవంతుడిని ఆరాధించిన రుషి, గొప్ప సంగీతకారుడు త్యాగయ్య. కర్ణాటక సంగీతంలో త్యాగయ్య, శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితార్‌లను త్రిమూర్తులుగా భావిస్తారు. ఆయన కూర్చిన వేలాది భక్తి కృతులు (దాదాపు 24వేలు)లో 700 మాత్రమే ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. ప్రధానంగా శ్రీరాముడిని ఆరాధిస్తూ తెలుగులో రాసిన కీర్తనలు ఇప్పటికీ ప్రాచుర్యంలో ఉన్నాయి. ఆయన ప్రతి ఆరాధనోత్సవం సందర్భంగా, ఆయన రచించిన కీర్తనలలో రత్నాలవంటివని నాటి సంగీతకారులు భావించిన 'పంచ రత్న కీర్తనల'నే ఐదింటిని తప్పనిసరిగా గానం చేస్తారు. ఈ పంచరత్న కీర్తనలలో 'నగుమోము కనలేని' అన్న కృతిని ఆలయ ఉత్సవాలలో తప్పనిసరిగా వాయిస్తారు. ప్రతి ఏడాదీ తిరువాయూరులో జరిగే ఆరాధనోత్సవాలకు ప్రముఖ సంగీత విద్వాంసులు హాజరై పంచరత్న కీర్తనలను ఆలపిస్తారు. అలాగే దేశవ్యాప్తంగా ప్రముఖ నగరాలలో ఈ ఆరాధనోత్సవాలను సంగీత ప్రియులు ఘనంగా జరుపుతారు. ఈ ఏడాది జనవరి 30న త్యాగరాజ ఆరాధనోత్సవాలు మొదలయ్యాయి.



# జాగృతి.. ఒక మేలుకొలుపు.. ఒక వేకువ పిలుపు..




జాగృతిని చదువుదాం.. చదివిద్దాం..
జాతీయ భావనను బలోపేతం చేద్దాం..
సాంస్కృతిక వారసత్వాన్ని నిలుపుకుందాం..




జాగృతి చందాను ఆన్‌లైన్‌లో
మీ మొబైల్ నుంచి చెల్లించడానికి
ఇక్కడ ఉన్న క్యు.ఆర్. కోడ్‌లను
గూగుల్ సెర్చ్‌బార్‌లో ఉండే గూగుల్ లెన్స్‌తో స్కాన్ చేయండి.
లేదా క్రిందనున్న లింక్‌లను ఉపయోగించండి.

సంవత్సర చందా రూ.850/-
http://payit.cc/S18970

విడి ప్రతి
రూ.20/-

ఐదు సంవత్సరాల చందా రూ.4000/-
http://payit.cc/S18973

## రిజిస్టర్డ్ పార్సిల్ సదుపాయం కోసం...

తక్కువ ఖర్చుతో జాగృతి సంచికను రిజిస్టర్డ్ పార్సిల్ (మ్యాగజైన్ పోస్టు) ద్వారా అందుకోవడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను ఉపయోగించాలి.
(సంవత్సర చందా రూ.850/- + మ్యాగజైన్ పోస్టు సం॥నికి రూ. 624/- )

వెల : రూ.1474/-
https://payit.cc/S32796

**సూచనలు :**

- మీ చందాని చెల్లించేటప్పుడు పూర్తి చిరునామాని పిన్‌కోడ్, ఫోన్ నెం.తో సహా వ్రాయాలి.
- తాత్కాలిక రసీదు చేరిన 15 రోజుల తర్వాత చందా నెం., ప్రారంభ తేది వివరాలు మీ ఫోన్ కి CP-JAGRIT అనే ఐ.డి.తో ఎస్.ఎమ్.ఎస్. వస్తుంది. ఆ వెంటనే పత్రిక అందుతుంది.
- పత్రిక అందకపోయినా, మీ చిరునామాలో తేడాలున్నా మీ చందా నెం. లేదా ఫోన్ నెం. వివరాలతో మా కార్యాలయానికి ఉ॥11 గంటల నుండి సా॥6 గంటల మధ్య ఫోన్ చేయగలరు.

Bank A/c details :
Jagriti Prakashan Trust,
A/c No.920010061405325,
Axis Bank, Kothapet Branch,
Hyderabad
IFSC : UTIB0002157,
PAN : AAATJ3829L

ఇతర వివరాలకు సంప్రదించండి
సర్క్యులేషన్ మేనేజర్ : 040-27561453 / 9959997013

jagritiweekly.com | facebook.com Jagriti Telugu Weekly | youtube.com/@Jagrititv | 3-4-228/4/1, Kachiguda, Hyderabad-027.

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.

**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య ) సంప్రదించండి.**


**జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

**కె. దుర్గారెడ్డి** — **అసోసియేట్ ఎడిటర్**

**సబ్ ఎడిటర్** — **9959991304**

**డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ**

ముఖపత్ర కథనం

**అనితరసాధ్యుడికి భారత రత్న**

6లో

కాంగ్రెస్‌కు గడ్డురోజులు తెచ్చిన పరిణామాలలో కీలకమైనవి రెండు. అది చేసిన రెండు మహా తప్పిదాలే ఆ రెండు. ఒకటి అత్యవసర పరిస్థితి. రెండు అయోధ్య సమస్య పట్ల వ్యవహరించిన తీరు. ఈ రెండింటిలోను అద్వాణీ కీలకంగానే ఉన్నారు. అది ఆయన రాజకీయ ప్రాముఖ్యానికి నిదర్శనం. అద్వాణీ గొప్ప వక్త. అయితే క్లుప్తంగా విషయం వివరించే తత్త్వం ఆయనది. ప్రజా జీవితంలో విలువలు ప్రవేశపెట్టడానికి, వాటిని ఆచరించడానికి తపన పడిన ఇటీవలి కాలపు రాజనీతిజ్ఞుడు లాల్ కృష్ణ అద్వాణీ. 1984లో లోక్‌సభలో కేవలం రెండు స్థానాలు ఉన్న పార్టీ ఇవాళ 303 స్థానాలకు చేరుకునేటట్టు చేయడంలో అద్వాణీ నిర్వహించిన పాత్ర ఎనలేనిది. చిరస్మరణీయమైనది. పార్టీలోనే అటు సాటి సీనియర్లకు, ఇటు ఇతర నేతల స్థానానికి ఎలాంటి భంగం లేకుండా తాను ఎదుగుతూ, పార్టీని నిర్మించిన మార్గదర్శకుడు అద్వాణీ.


పౌరులను అవమానించే దేశ నాయకత్వం ఉంటుందా? ఎందుకు లేదు! ఉంది. ఈ పరిణామాన్ని భారతదేశమే చూసింది కూడా. మన దేశాన్ని చిరకాలం పరిపాలించిన ఇద్దరు ప్రధానమంత్రులకు ఈ దేశ ప్రజలంటే గౌరవం లేదు. చిరకాలం అధికారంలో ఉండడమే చరిత్ర సృష్టించడమని ప్రగాఢంగా నమ్మి, దానిని ఆచరణలో పెట్టిన ఆ ఇద్దరు నేతలకీ దేశమంటే ప్రజలేనన్న కనీస సూత్రం పట్టుబడలేదంటే ఆశ్చర్యం కలుగుతుంది. పౌరులను కించపరిచిన నాయకులూ, వారి ప్రభుత్వాలూ దేశాలను ఎలా ప్రగతిపథంలో నడిపించగలవు?

ఈ పార్లమెంటుకు తుది సమావేశాలుగా చెబుతున్న బడ్జెట్ సమావేశాలలో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రసంగం దేశ ప్రజలను ఆకర్షించింది. దీనిని మీడియా అత్యంత వేడి వాడి ఉపన్యాసంగా అభివర్ణించింది కూడా. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలియచేసే తీర్మానం మీద చర్చకు ఫిబ్రవరి 5న ప్రధాని మోదీ సమాధానం ఇచ్చారు. ఆయన ప్రతిపక్ష కాంగ్రెస్‌ను తూర్పార పట్టారు. ఆ ఉపన్యాసంలో మీడియా చాలా అంశాలను ప్రత్యేకంగా ఎంచుకుని విశ్లేషించినా, గమనంలోకి తీసుకోవలసినవి రెండు. ఒకటి– ప్రథమ ప్రధాని నెహ్రూ, ఆయన కుమార్తె, మరొక ప్రధాని ఇందిర ఈ ఇద్దరు భారత ప్రజలను ఆగస్ట్ 15న ఎర్రకోట వేదికగా కించపరిచారన్నది ప్రధాని నరేంద్ర మోదీ అభియోగం. రెండవది కాంగ్రెస్ ఇప్పుడు ప్రతిపక్షంగా కూడా విఫలం కావడం. తాను విఫలం కావడమే కాకుండా మరొక విపక్షానికి ఆ అవకాశం ఇవ్వకుండా ప్రజాస్వామిక వ్యవస్థ స్వరూపాన్ని వికృతం చేసిందన్నది మోదీ విమర్శ.

కొందరి దృష్టిలో నెహ్రూ సర్వోన్నతుడు. అలా వారు భావిస్తే తప్పేమీ లేదు. కానీ నెహ్రూ కంటే చరిత్ర, వాస్తవాలు ఇంకా సర్వోన్నతమైనవన్న వాస్తవాన్ని అలాంటి వారంతా తృణీకరించడమే విషాదం. దాని గుర్తు చేయడమే మోదీ ఉద్దేశం కావచ్చు. ఆయన నెహ్రూను దుమ్మెత్తి పోశారనుకునే కంటే, చరిత్రను గుర్తు చేస్తున్నారని అనుకోవడం అవసరం. ఎవరైనా పాఠాలు

**శాలివాహన 1945 శ్రీ శోభకృత్ మాఘ శుద్ధ తదియ**

## లోపలి పేజీలలో...



తీర్పు

**నంది ఎదురుచూపులు ఫలించాయి**

14లో



ఆర్థికం

**సమగ్రాభివృద్ధికి దిక్సూచి**

22లో



ప్రత్యేక వ్యాసం

**శుభంకరుడు ప్రభాకరుడు**

26లో

# జాగృతి

## సంపాదకీయం

నేర్చుకోవలసినది చరిత్ర నుంచే. భారతీయులు సోమరులనీ, తెలివితక్కువ వారనీ, బొత్తిగా కష్టపడే తత్త్వం వాళ్లలో లేనేలేదని నెహ్రూ ఓ ఆగస్ట్ 15 సందర్భంగా ఎర్రకోట మీదే నోరు పారేసుకున్నారని మోదీ గుర్తు చేశారు. భారతదేశం మీద గౌరవం లేని వ్యక్తి నెహ్రూ. అది ఆయన ప్రఖ్యాత గ్రంథం 'భారతదర్శనం' లోనే స్పష్టంగా కనిపిస్తుంది. భారత దర్శనం లేదా డిస్కవరీ ఆఫ్ ఇండియా రాసినా ఆయనకు భారతీయత అంటే ఏమిటో అర్థంకాలేదని చాలామంది అభిప్రాయం. ఇలా అభిప్రాయపడడం నెహ్రూ పట్ల అపచారమే అయినా పరవాలేదు. ఈ దేశం పట్ల, వేల సంవత్సరాల ఈ దేశ నాగరికత పట్ల గౌరవం

# ఆ ఇద్దరు కాంగ్రెస్ ప్రధానులు

లేని వ్యక్తి ఈ దేశానికి తొలి ప్రధాని కావడం మీద కూడా విమర్శలు తక్కువేమీ కాదు. ఆయన ధోరణి చాలాసార్లు రుజువైంది. తన వైఖరిని ఆయన దాచుకోలేదు. అందుకు తిరుగులేని ఉదాహరణ, సోమనాథ్ ఆలయ జీర్ణోద్ధరణ తరువాత ప్రతిష్ఠకు వెళ్లకుండా ప్రథమ రాష్ట్రపతి డాక్టర్ బాబురాజేంద్ర ప్రసాద్‌ను ఆపడానికి నెహ్రూ చేసిన ప్రయత్నమే. కానీ డాక్టర్ ప్రసాద్ లొంగలేదు. ఆయన కుహనా లౌకికవాది కాదు. రాజనీతిజ్ఞుడు. స్వతంత్ర భారతదేశంలో హిందూ పునరుజ్జీవనోద్యమం సాధ్యమవుతుందని భావించిన వారికి 1950ల నాటి నెహ్రూ వైఖరి బాధించింది. అలాంటి వ్యక్తి భారతీయులను గౌరవించే తత్త్వం కలిగి ఉంటారని చెప్పడం అసంబద్ధమే. ఆయన అంతర్జాతీయవాది భావన కశ్మీర్‌ను ఏడు దశాబ్దాల పాటు వేధించింది. ఈ విషయం కూడా ప్రధాని మోదీ ప్రస్తావించారు. ఆయన కుమార్తె ఇందిర తండ్రికి ఏమీ తీసిపోరని కూడా మోదీ విమర్శనాస్త్రాలు సంధించారు. తనకు పదవీగండంగా మారిన కోర్టు తీర్పు నుంచి బయటపడడానికి ఆమె ఈ దేశంలో అత్యవసర పరిస్థితిని విధించారు. పాకిస్తాన్‌తో మూడు యుద్ధాలు చేసిన దేశానికి ఇది ఇందిర ఇచ్చిన అదనపు కానుక. ఈ కుటుంబం చరిత్ర నుంచి పాఠాలు నేర్వడానికి ఏమాత్రం ఇష్టపడడం లేదు. ఇప్పటికీ తమ ఆధిపత్యం గురించే కలలు కంటున్నది. తమ కుటుంబీకులే అధికారంలో ఉంటే అయోధ్యలో కట్టడం కూలి ఉండేది కాదని రాహుల్ గాంధీ బాహాటంగానే ప్రకటించడం ఇందుకు నిదర్శనం. అసలు ప్రధాని కుర్చీలో మరొకరు కూర్చోవడమే వారికి మనస్కరించదు.

కాంగ్రెస్ ఈ పదేళ్లలో ప్రతిపక్ష పాత్రను సరిగా నిర్వహించలేదు. ఈ విమర్శ ఎవరైనా ఆమోదించక తప్పదు. ఈ పార్లమెంట్‌లో ఎన్నో పర్యాయాలు ఉభయ సభలు వాయిదా పడ్డాయి. అందుకు కారణమైన ఆరోపణలు ఏవీ కోర్టులలో నిలబడలేదు. తాజాగా ఇండీ కూటమి కొలువు తీరినా, 21 పార్టీల ఆ వేదిక రాహుల్ అపరిపక్వ వైఖరితో అత్యంత విషాదంగా చతికిలపడింది. ఆ పరిణామం ఊహించినదే. ఆ కూటమిని విచ్ఛిన్నం చేయడానికి బీజేపీ చేసినదేమీ లేదు. ఆ అవకాశం కాంగ్రెస్ బీజేపీకి ఇస్తే కదా! అయితే తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి ప్రతి అంశాన్ని బీజేపీ మీదకు నెట్టివేయడం కాంగ్రెస్‌కు రివాజు. కాంగ్రెస్ కూటమి అంతిమ లక్ష్యం మళ్లీ ప్రధాని పదవి నెహ్రూ–గాంధీ కుటుంబానికి రావడమే. ఇవన్నీ ఎలా ఉన్నా ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం అత్యవసరం. సరిగ్గా ఇక్కడే కాంగ్రెస్ విఫలమయింది. ఇంకా చిత్రం, ఆ అంశాన్ని గుర్తించడం దగ్గర ఇంకా విఫలమవుతూనే ఉన్నది. విపక్షాల ఐక్యతకు అదే పెద్ద ప్రతిబంధకమని తేలిపోయింది.

ఈ దేశానికి ప్రతిపక్షం అవసరమని పార్లమెంట్ సాక్షిగా ప్రధాని మోదీ చెప్పడం స్వాగతించవలసిన అంశమే. ఆ ఇద్దరు కాంగ్రెస్ ప్రధానులకూ, బీజేపీ ప్రధాని మోదీకీ మధ్య ఎంత తేడా! ఈ దేశ సాంస్కృతిక వైవిధ్యం, సమైక్యత, పురోగతి ప్రజాస్వామ్యం మీదనే ఆధారపడి ఉన్నాయి. ఆ వాస్తవం కాంగ్రెస్ గుర్తిస్తుందా? ★

12 ఫిబ్రవరి 2024, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్




38లో

కథ


**చిరంజీవి - 'గంగాలహరి'**

– విహారి





| | | |
|---|---|---|
| మంజుల కోయిల! (మహిళ) | – | 12 |
| తమిళనాట హిందూ ధర్మ పునర్వైభవానికి నాంది | – | 16 |
| జ్ఞాన ప్రదాయినీ! నమోస్తుతే...! (ప్రత్యేక వ్యాసం) | – | 26 |
| తెలంగాణలో నీటి పంచాయతీ (తెలంగాణ) | – | 30 |
| వైకాపా విధానాలతో నిరుద్యోగుల్లో తీవ్ర నిరాశ (ఆంధ్రప్రదేశ్) | – | 32 |
| పాకిస్తాన్ భయంతో వణికిపోయిన క్షణాలు (అంతర్జాతీయం) | – | 37 |
| విశ్వ చదరంగ 'మహాశక్తి' భారత్! (క్రీడ) | – | 43 |
| సీక్వెల్స్ సందడి మొదలవుతోంది! (సినిమా) | – | 50 |



లాల్ కృష్ణ అద్వాణీ

ఐదువందల సంవత్సరాల అయోధ్య ఉద్యమం అంతిమ విజయం దిశగా సాగడానికీ, మందిర నిర్మాణ స్వప్నం సాకారం కావడానికీ కీలకమైనవి చివరి మూడు దశాబ్దాలు. భారత రాజకీయాల స్వరూప స్వభావాలనే కాదు, తాత్త్వికతను కూడా మార్చినవి కూడా ఈ ముప్పయ్ ఏళ్లే. అయోధ్య ఉద్యమానికి ముందు, తరువాతి భారతదేశం అన్నంతగా ఆ పరిణామం భారత సామాజిక, రాజకీయ వ్యవస్థను కదిపింది. ఈ మధ్యలో మరే పెద్ద పరిణామం జరగలేదని కాదు. కానీ, అత్యవసర పరిస్థితి, ఆ తరువాత అయోధ్య. ఈ రెండే భారతదేశం మీద ప్రబలమైన ముద్రను మిగిల్చాయి. భారతీయత ఒక మహాశక్తిగా వ్యవస్థలో ప్రవేశించడానికి నాందీ వాచకమే మందిర నిర్మాణ ఆలోచన. రామాలయం అంటే ఇటుకలూ, విగ్రహాలూ కాదు, నాగరికతకు మేలుకొలుపు, కుహనా సెక్యులరిజానికి వీడ్కోలు, నాగరికత పట్ల స్పృహ అని నినదించిన ఘడియలవి. అత్యధిక సంఖ్యాకుల మనోభావాలకు విలువేది అని నిలదీసిన క్షణాలవి. 20వ శతాబ్దం చివరి అంకంలోని చింతనాధోరణిలో జాతీయవాదాన్ని ప్రబలంగా నిక్షిప్తం చేసినది కూడా రామమందిర నిర్మాణోద్యమమే. భారతీయ సమాజాన్ని, నిజం చెప్పాలంటే హిందూ సమాజాన్ని చీల్చడానికి మండల్ సిఫారసులు బుజ్జగింపు రాజకీయ పిశాచాల చేతి ఆయుధం కాకుండా ఆదిలోనే ఆపినది కూడా అయోధ్య రథమే. ఆధునిక భారతదేశ చరిత్రలో ఇంతటి కదలికకు, మలుపునకు కారణమైన ఆ కొద్దిమంది అసాధారణ వ్యక్తులలో ఒకరే లాల్ కృష్ణ అడ్వాణీ. ఆయనను 2024 సంవత్సరం 'భారత రత్న' పురస్కారానికి ఎంపిక చేయడం జాతికి ఆనందమయ క్షణమే.

యాదృచ్ఛికం కావచ్చు. లేదా సంకల్పం కూడా కావచ్చు. ఏమైనా, అయోధ్యలో బాలక్‌రామ్ ప్రాణప్రతిష్ఠ జరిగిన పదిరోజులకి అద్వాణీకి దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న ప్రకటించడం స్వాగతించదగినదే. ఎవరో అన్నట్టు ఆ పురస్కారం ప్రకటన విని ఆయన సంతోషించడం కాదు, పురస్కారం కూడా పులకించి ఉంటుంది. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయికి ప్రకటించిన తొమ్మిదేళ్ల తరువాత అద్వాణీకి కేంద్ర ప్రభుత్వం ఈ పురస్కారాన్ని ప్రకటించి మరొకసారి తనను తాను గౌరవించుకుంది. సంఘ్ పరివార్ నుంచి వచ్చిన నానాజీ దేశ్‌ముఖ్‌ను గతంలోనే (మరణానంతరం) ఈ పురస్కారం వరించింది. భారత రాజకీయాలలో, సమాజసేవలో, సాంస్కృతిక పరిరక్షణలో, పునరుజ్జీవన నిర్మాణోద్యమంలో ఈ ముగ్గురి సేవ చరిత్ర ప్రసిద్ధం.

స్వాతంత్య్రోద్యమం తరువాత హిందువులంతా ఆకాంక్షించిన సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమం కదిలినట్టే కదిలి ఆగిపోయింది. పదిహేడు పర్యాయాలు దాడులకు గురైన సోమనాథ్ మందిర జీర్ణోద్ధరణ దగ్గరే పునరుజ్జీవనోద్యమాన్ని బుజ్జగింపు రాజకీయాలు, కుహనా సెక్యులరిజం భగ్నం చేశాయి. భారతీయ పునరుజ్జీవనోద్యమం ఎక్కడ ఆగిపోయిందో అక్కడ నుంచి పునః ప్రారంభించిన ఘనత లాల్ కృష్ణ అద్వాణీకి చెందుతుంది. అయోధ్యను హిందువులకు అప్పగించాలనీ, లేదా రామమందిర నిర్మాణానికి అవకాశం కల్పించాలని కోరుతూ అద్వాణీ సోమనాథ్ ఆలయం (గుజరాత్) నుంచే శంఖం పూరించారు. అయోధ్య రథయాత్ర అక్కడే మొదలయింది. నిజానికి అంతకు ముందే ప్రారంభమైన అయోధ్య ఉద్యమాన్ని అద్వాణీ వేగవంతం చేశారు. విస్తృత పరిచారు. నిజమే, రథం గమ్యం చేరలేదు. కానీ మందిర నిర్మాణ ఆశయం, దృఢ సంకల్పం అయోధ్యకు దిగ్విజయంగా చేరాయి. దీనికంతటికీ చోదకశక్తి అద్వాణీ ఇచ్చిన హిందూ ఆత్మగౌరవ నినాదమే. కుహనా సెక్యులరిజంతో భారతీయతకు, జాతి సమైక్యతకు జరుగుతున్న అన్యాయాన్ని ఆయన వివరించిన తీరు కూడా




అందుకు దోహదం చేసింది.

అయోధ్య ఉద్యమానిదీ, అందులో అద్వాణీ పాత్రదీ విడదీయలేని బంధం. ఆ ఉద్యమాన్ని ముందుకు సాగించడంలో ఆయన మడమ తిప్పని వైఖరిని అనుసరించారు. మందిర నిర్మాణంలో భాగస్వాములం కావాలని భారతీయ జనతా పార్టీ

# అనితరసాధ్యుడికి భారత రత్న


మోదీ అభినందనలు

నిర్ణయించిన సమయంలో (పాలంపూర్ సమావేశాలు, 1989) సంస్థ అధ్యక్షుడు అద్వాణీయే. అద్వాణీ లేని అయోధ్య ఉద్యమాన్ని ఊహించడం కష్టమని ఎందరో భావిస్తారు. అందులో సత్యమే ఉంది. పాలంపూర్ నిర్ణయం తరువాత సెప్టెంబర్ 25, 1990న అద్వాణీ రథం ఎక్కారు. ఆ రోజు ఆయన వెంట ప్రయాణించినవారిలో నేటి ప్రధాని, బీజేపీ గుజరాత్ రాష్ట్ర శాఖ నాటి కార్యదర్శి నరేంద్ర మోదీ కూడా ఉన్నారు. తనకు పురస్కారం ప్రకటించిన సమయంలో అద్వాణీ ఇవన్నీ గుర్తు చేసుకున్నారు. మోదీ ఆనాటికి మరీ అంత ప్రసిద్ధులు కాదనీ, కానీ ఆలయ నిర్మాణానికి రాముడు మోదీనే ఎంచుకున్నాడని అద్వాణీ వ్యాఖ్యానించడం గమనార్హం. తమ వరకు అయోధ్య ఉద్యమం ఎప్పటికీ జాతీయ చైతన్యానికి ప్రతీకేనని ఆయన నిర్ద్వంద్వంగా చెప్పారు. ఈ ఉద్యమంతో అద్వాణీ గొప్ప మానసిక సంఘర్షణ అనుభవించారనే చెప్పాలి. డిసెంబర్ 6, 1992న మసీదును కరసేవకులు కూల్చిన తరువాత జాతీయ అంతర్జాతీయ స్థాయిలో వచ్చిన వత్తిడి,



50 దశకంలో అద్వాణీ, అటల్‌జీ, షెకావత్



పాత సహచరుడు బల్‌రాజ్ మధోక్‌తో..



జీవన సహచరి కమలతో..



లతామంగేష్కర్‌కు జ్ఞాపికను అందిస్తూ..

వ్యతిరేకత తక్కువేమీ కాదు. 28 ఏళ్ల తరువాత కూల్చివేత ఆరోపణల నుంచి సీబీఐ ప్రత్యేక కోర్టు అద్వాణీకి విముక్తి కల్పించింది. ఆయన ఆత్మకథ 'నా దేశం నా జీవితం'లోని కొన్ని వాక్యాలు ఈ విషయాన్ని నిరూపిస్తాయి. దాదాపు ఐదు దశాబ్దాలు కలసి పనిచేసిన అటల్ బిహారీ వాజపేయితో అయోధ్య ఉద్యమం గురించి చిన్న చిన్న అభిప్రాయ భేదాలు వచ్చినా, అద్వాణీ ఉద్యమం వైపే మొగ్గారు. ఆయన దారి నిర్దుష్టమైనదని చరిత్ర రుజువు చేసింది. అలాగే గోధ్రా అల్లర్ల తరువాత నాటి గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర మోదీ వెనుక గట్టిగా నిలిచినవారు అద్వాణీయేనన్న సంగతి దాచనక్కర లేదు. అద్వాణీ తీసుకున్న ఆ నిర్ణయమే ఈ దేశానికి చరిత్రలో కనీవినీ ఎరుగని ఒక ప్రధాని ఆవిర్భవించ డానికి కారణమైందని ఇప్పుడు ఎవరైనా చెబుతారు. ఆ రెండూ అయోధ్యతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ముడిపడి ఉన్నవే. కాబట్టి అయోధ్యలో బాలక్‌రామ్ ప్రాణప్రతిష్ఠ జరిగిన నేపథ్యంలో అద్వాణీని భారత రత్నతో సత్కరించుకోవడం నిశ్చయంగా సబబే. నిజానికి అద్వాణీకి ఎప్పుడు ఆ అత్యున్నత పౌర పురస్కారం ఇచ్చినా విమర్శలు సిద్ధంగానే ఉంటాయి కూడా. కానీ ఇప్పుడు ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది. కర్పూరి ఠాకూర్‌కు మొదట ఈ సంవత్సరానికి ఈ పురస్కారం కోసం ప్రకటించారు. ఆయన సామాజిక న్యాయ దృష్టికి ఆద్యుడని చరిత్ర చెబుతుంది. హిందూత్వ రాజకీయాలకు ఆద్యుడని పేర్గాంచిన అద్వాణీకి కొన్ని రోజుల తరువాత అదే పురస్కారం (ఒక సంవత్సరం ముగ్గురికి ఇవ్వవచ్చు) ప్రకటించారు. ఇదొక సమన్వయ సాధనా యోజన. సామాజిక న్యాయాన్నీ, హిందూత్వ దృష్టిని రెండు కళ్లుగా చూడవలసిన యుగంలోకి మనం ప్రవేశించాం.

అయోధ్య రథానికి ఎందుకంత ప్రత్యేకత? ఎందుకంత ఆదరణ? అద్వాణీ వినిపించిన వాదన అందులో ప్రధానమైనది. హిందూత్వ బలోపేతం కావడానికీ, జాతీయవాదంతో కూడిన హిందూ చింతనకూ ఆయన ఉపన్యాసాలు ఉపకరించాయి. నిజానికి హిందూత్వకు గళం ఇవ్వాలన్న సూత్రం భారతీయ జనతా పార్టీ తన మూల సంస్థ జనసంఘ్ నుంచి అందుకున్నదే. అప్పటి పరిస్థితిని బట్టి అద్వాణీ దానికి పదును పెట్టారు. వీపీ సింగ్, దేవీలాల్‌ల ఆధిపత్య రాజకీయాలతో దేశం ముక్కలు చెక్కలు కాకుండా కాపాడిన ఘనత అయోధ్య రథయాత్రకు దక్కుతుందని ఎవరైనా అంటే దానిని నిరాకరించడం అంత సులభం కాదు. అంతటి ఒక సామాజిక ఉత్పాతం నుంచి భారతీయ సమాజాన్ని రక్షించిన ఆ రథయాత్రకు ఇంకొక కోణం దొంగ సెక్యుల రిజాన్ని పాతరేయడం. రాముడిని ఈ దేశ సాంస్కృతిక ఐక్యతా చిహ్నంగా భావించాలన్న అద్వాణీ వాదనకే భారతీయులు బ్రహ్మరథం పట్టారు. దేశంలో స్వైరవిహారం చేస్తున్న దొంగ సెక్యులరిజం కంటే రాముడు ఈ దేశ చైతన్య కేంద్రమన్న వాదనకే బలం ఉందని ఆయన రుజువు చేశారు. భర్త తలాక్ చెప్పిన షాబానో అనే ముస్లిం మహిళకు మనోవర్తి ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పినా, దానిని బేఖాతరు చేసే ఉద్దేశంతో అత్యున్నత న్యాయస్థానం తీర్పుకు కాలదోషం పట్టించడానికి రాజీవ్‌గాంధీ ప్రయత్నించడం అద్వాణీ వాదనకు సరైన భూమికను కూడా కల్పించి పెట్టింది. ఇందిర హత్యానంతర వాతావరణం, ఆపరేషన్ బ్లూస్టార్ అలజడి, మండల్ సిఫారసుల కల్లోలం ఇవన్నీ భారతీయ సమాజం మూలాలను కదిలించే శక్తి కలిగి ఉన్నా, అద్వాణీ రథయాత్రతో చతికిలపడ్డాయి. స్వతంత్ర భారత దేశంలో హిందువుల స్థితిని అద్వాణీ గమనించిన తీరు ప్రత్యేకమైనది. రోజుకు ఐదుసార్లు క్రమం తప్పకుండా ప్రార్థన చేసే మతవర్గంతో, మత భావన పట్ల తక్కువ స్పందన కలిగిన వర్గం చేయవలసి వచ్చిన అస్తిత్వ పోరాటంగానే చూశారు అద్వాణీ. హిందూ సమాజ దుస్థితికి ఉన్న కారణాలకు ప్రత్యక్ష సాక్షి అద్వాణీ. ఆ అనుభవాల సారమే ఆయన వాదన. ఆయన సింధ్ ప్రాంతానికి చెందినవారు. 1946-47 నాటి రక్తపాతానికీ, దేశ విభజనకు వెనుక ఉన్నది మత మౌఢ్యమే. హిందువుల అనైక్యతకీ, దూరదృష్టి లేమికీ స్వతంత్ర భారతదేశం మూల్యం చెల్లించక తప్పదన్న దృష్టితో, దాని నుంచి కాపాడే ప్రయత్నంలో భాగంగానే 1925లో డాక్టర్‌జీ ఆర్‌ఎస్‌ఎస్‌ను స్థాపించారు. కానీ డాక్టర్‌జీ వేసిన అంచనా నిజమైంది. ఆ క్షణాలను చూసిన వారు అద్వాణీ. డాక్టర్‌జీ ఊహించినట్టుగానే హిందువులు ద్వితీయ శ్రేణి పౌరులుగా మారిపోయే క్రమం మొదలయింది. కాంగ్రెస్ అప్రతిహతంగా సాగించింది. అయితే ఆర్‌ఎస్‌ఎస్ దాని నుంచి హిందూ సమాజాన్ని రక్షించగలిగింది. ఆ క్రమాన్ని కూడా అద్వాణీ చూశారు. అది ఆయన జీవితంలోని మరో గొప్ప కోణం.

అద్వాణీని కేవలం రామభక్తుడిగా, అయోధ్య ఉద్యమ నిర్మాతగా చెబితే ఆయన చరిత్రకు పూర్తి న్యాయం చేసినట్టు కాదు. నిబద్ధ రాజకీయాలకీ, సూత్రబద్ధ వైఖరికీ ఆయన చిరునామా. నవంబర్ 8, 1927న కరాచీలో పుట్టారు (ప్రస్తుతం పాకిస్తాన్‌లో ప్రముఖ నగరం) అద్వాణీ. తండ్రి కిషన్‌చంద్, తల్లి జ్ఞానీదేవి. కరాచీలోనే సెయింట్ పాట్రిక్స్ ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు. 1941లో అంటే, తన 14వ ఏట ఆయన ఆర్‌ఎస్ ఎస్‌కు దగ్గరయ్యారు. తరువాత పాకిస్తాన్‌లోని హైదరాబాద్‌లో డీజీ నేషనల్ కళాశాలలో న్యాయశాస్త్రం అభ్యసించారు. స్వాతంత్ర్యం రావడం, ఆనాటి హింస, తరువాత గాంధీజీ హత్య

సమయంలో అద్వానీ రాజస్థాన్‌లో ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖ బాధ్యతలు నిర్వహించారు. నిజానికి ఆయన చూసిన దానిలో బయటికి చెప్పినది తక్కువే అయి ఉండాలి. దేశ విభజన తరువాత పాకిస్తాన్ నుంచి భారతదేశానికి వచ్చిన అనేక లక్షల కుటుంబాలలో వారిది కూడా ఒకటి. విభజన తరువాత బొంబాయిలో స్థిరపడింది ఆ కుటుంబం. తరువాత రాజస్తాన్ ప్రాంత సంఘ బాధ్యతలు చేపట్టారు. 1951లో జనసంఘ్ ఏర్పడిన తరువాత దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, అటల్ బిహారీ వాజపేయి, అద్వానీ ఆ పార్టీ విస్తరణ బాధ్యత స్వీకరించారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ వారికి నాయకుడు. అంటే దేశంలో హిందూత్వ భావనకు రాజకీయ స్పృహనూ, చైతన్యాన్నీ అద్దిన మొదటి తరంలోనే అద్వానీ ఉన్నారు. 1957లో అద్వానీ ఢిల్లీ చేరుకుని జనసంఘ్ నగర శాఖ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. 1966లో ఢిల్లీ మెట్రోపాలిటన్ కౌన్సిల్ మధ్యంతర ఎన్నికలలో విజయం సాధించారు. మరుసటి సంవత్సరమే కౌన్సిల్ చైర్మన్‌గా గెలిచారు. ఇలా అద్వానీ ప్రత్యక్ష రాజకీయ యాత్ర మొదలయింది. 1970-72 సమయంలో జనసంఘ్ ఢిల్లీ విభాగానికి అధ్యక్షుడిగా పనిచేశారు. జనసంఘ్ అధ్యక్షునిగా ఉండగానే 1970లో ఆయన మొదటిసారి రాజ్యసభలో అడుగుపెట్టారు. ఆ విధంగా జాతీయ రాజకీయాలలోకి ప్రవేశించారు. ఢిల్లీ నుంచే ఆయన పెద్దల సభకు వెళ్లారు. 1976లో గుజరాత్ నుంచి మరొకసారి రాజ్యసభ సభ్యుడయ్యారు. స్వాతంత్ర్యం వచ్చిన 26 సంవత్సరాల తరువాత దేశంలో విధించిన అత్యవసర పరిస్థితి ఎంత చేటు చేయగలదో అంచనా వేసిన వారిలో అద్వానీ ఒకరు. అత్యవసర పరిస్థితికి ఆయన సాక్షి. బాధితుడు కూడా.

సుదూర చరిత్రే కాదు, సమీప గతం కూడా భారతీయులకు, ప్రధానంగా రాజకీయ నాయకులకు పరగడుపేనన్న వాస్తవం ఆయన గొప్పగా గ్రహించారు. అత్యవసర పరిస్థితి తరువాత పరిస్థితిని బట్టి, కాంగ్రెస్ కుటుంబ రాజకీయాలను ఆపాలన్న గట్టి లక్ష్యంతో ఆనాటి నాయకత్వం భారతీయ జనసంఘ్‌ను రద్దు చేసి, జనతాపార్టీలో విలీనం చేసింది. మొరార్జీ దేశాయ్ నాయకత్వంలో జనతా ప్రభుత్వం ఏర్పడింది. అధికారంలో ఉన్నది దాదాపు రెండేళ్లు. అయినా అటల్ బిహారీ వాజపేయి విదేశాంగ మంత్రిగా, అద్వానీ సమాచార ప్రసార మంత్రిగా గొప్ప సేవలు చేశారు. జనతా ప్రభుత్వంలో మాజీ జనసంఘీయుల సేవలు చెరగని ముద్ర వేశాయి. విదేశాంగ విధానాన్ని అటల్‌జీ మలుపు తిప్పారు. ఎన్నికల సమయంలో విపక్షాలకు ప్రభుత్వ మాధ్యమాలలో మాట్లాడే అవకాశం కల్పించిన వారు అద్వానీ. ఇంతకాలం ఏ విపక్ష అనైక్యత ఇందిరను, ఆమె నియంత పాలనను దీర్ఘకాలం దేశం మీద సాగడానికి ఉపకరించాయో, జనతా పార్టీతోనూ అదే అనైక్యత పునరావృతమైంది. ఫలితం ఒక గొప్ప సంకీర్ణ ప్రయోగం దారుణంగా విఫలమైంది.

సంఘ్ అనుకూల ఆంగ్ల వారపత్రిక 'ఆర్గనైజర్'తో అద్వానీ అనుబంధం చిరకాలం కొనసాగింది. స్వయంగా రచయిత అయిన అద్వానీ ఆ పత్రికలో కాలమ్ రాశారు. ఇక రచయితగా ఆయన ప్రతిభను చాటేదే 'ఏ ప్రిజనర్స్ స్క్రాప్ బుక్'. జూన్ 25, 1975న అత్యవసర పరిస్థితిని విధించిన ఇందిరా గాంధీ అద్వానీ, వాజపేయి, మధు దండావతే ప్రభృతులను బెంగళూరులో అరెస్టు చేయించారు. ఆ సమయంలో ఆయనను పరామర్శించడానికి ఆ రాష్ట్ర ప్రముఖ నాయకుడు రామకృష్ణ హెగ్డే, ఆయన భార్య శకుంతల వచ్చారు. కాలక్షేపం కోసమని, శకుంతల తను ఉపయోగించుకునే చిన్న ట్రాన్సిస్టర్ రేడియోను అద్వానీకి ఇచ్చారు. ఆ రేడియో ఆధారంగా అద్వానీ రచించిన పుస్తకమే 'ఏ ప్రిజనర్స్ స్క్రాప్ బుక్'. ఆనాడు భారతదేశంలో సెన్సార్‌షిప్‌ను విచక్షణా రహితంగా అమలు చేశారు. కానీ ప్రభుత్వ వార్తలన్నీ విదేశీ రేడియో కేంద్రాలు ప్రసారం చేసేవి. అవన్నీ విని అద్వానీ ఆ పుస్తకం అద్భుతంగా రాశారు. అత్యవసర పరిస్థితిలో భారతదేశంలో ప్రతికాస్వేచ్ఛ ఏ స్థాయిలో అడుగంటిందో ఆ పుస్తకం సాక్ష్యం చెబుతుంది. ఎమర్జెన్సీ చరిత్ర మీద వచ్చిన ది జడ్జ్‌మెంట్ (కుల్దీప్ నయ్యర్), ఎండ్ ఆఫ్ ఏన్ ఇరా (సీఎస్ పండిట్), డెమాక్రసీ రీ డీమ్డ్ (వీకే నరసింహన్) వంటి పుస్తకాలతో సమానంగా అద్వానీ పుస్తకం చరిత్రలో స్థానం సంపాదించుకుంది. అత్యవసర పరిస్థితి కాలంలో పత్రికా రచయిత దిగజారుడు ఎంతటిదో కూడా అద్వానీ అంత స్పష్టంగా చెప్పిన రాజకీయ నేత మరొకరు లేరు కూడా. 'వారు (ప్రభుత్వం) మిమ్మల్ని (జర్నలిస్టులను) వినయంగా ఉండమన్నారు. మీరు నేల మీద పాకారు' అన్నారాయన. ఈ వ్యాఖ్యను ఇప్పటిదాకా అంతా ఆమోదిస్తూనే ఉన్నారు. చెప్పుకుంటూనే ఉన్నారు.


జనతా ప్రభుత్వ పతనం ఆధునిక రాజకీయ ప్రస్థానంలో పెద్ద విషాదమే. అందుకు దారి తీసిన పరిస్థితులలో ద్వంద్వ సభ్యత్వం సమస్య ఒకటి. అంటే ఆర్‌ఎస్‌ఎస్, జనతా రెండింటిలోను సభ్యత్వం కుదరదన్నదే దాని సారాంశం. ఇదే మాజీ జనసంఘీయులు జనతా నుంచి బయటకు రావడానికి కారణమైంది. అయితే అప్పటికే జనతా ప్రభుత్వం పతనమైంది. ఏప్రిల్6, 1980లో భారతీయ జనతా పార్టీ ఆవిర్భవించింది. అటల్‌జీ తొలి అధ్యక్షుడయ్యారు. పార్టీ అధ్యక్షునిగా అద్వానీ కూడా చిరకాలం (1986-1990, 1993-1998, 2004-2005) పనిచేశారు. 1996 నాటి హవాలా కేసులో తన పేరు (జైన్ డైరీల వ్యవహారం) ఉందని ఆరోపణలు రాగానే అద్వానీ ఎంపీ పదవికి



90వ దశకంలో అద్వానీ, అటల్‌జీ, షెకావత్



రామబాణంతో..



కొత్తతరం నాయకుడు రిజిజుతో..

రాజీనామా చేసి సంచలనం సృష్టించారు. అది సంచలనమే అయినా, ఒక విలువ కోసమే ఆయన ఆ నిర్ణయం తీసుకున్నారు. తన పేరు అందులో లేదని తెలిసిన తరువాతనే ఆయన 1998 మళ్లీ పోటీ చేసి గెలిచారు. 2004లో బీజేపీ ప్రతిపక్షానికి పరిమితమైనప్పుడు విపక్ష నేతగా పనిచేశారు. వాజపేయి ప్రభుత్వంలో ఉపప్రధానిగా, హోం మంత్రిగా అద్వాణీ వేసిన ముద్ర చెరగనిది. హోంశాఖ కరాకండీగా వ్యవహరించడం మళ్లీ అద్వాణీతోనే మొదలయింది. ప్రజా జీవితంలో ఉండవలసిన స్వచ్ఛతకి ఇలాంటి చర్యలు అవసరమవుతాయని భావిస్తున్నట్టు ఆయన చెప్పారు. 2014లో ఆయన గాంధీనగర్ నుంచి లోక్‌సభకు గెలిచారు. 2019 నుంచి ఆయన ప్రత్యక్ష రాజకీయాలకు స్వస్తి పలికారు. అద్వాణీ ఓపెన్ మైండెడ్‌గా ఉంటూ, విమర్శలను స్వీకరిస్తారని మేధావులు చెబుతారు.

అద్వాణీ 1985 నుంచి బీజేపీకి సర్వం తానే అయ్యారు. ఆయన ప్రభావం పడని కార్యకర్త దాదాపు లేడు. ఉత్తర భారతదేశ పార్టీగా, బనియాల పార్టీగా, హిందువుల, హిందీ భాషా ప్రాంత పార్టీగా – ఒక్క మాటలో చెప్పాలంటే అంటరాని పార్టీగా (మిగిలిన రాజకీయ పార్టీల వరకు) ఉండిపోయిన బీజేపీని ఒక సర్వజనామోద పక్షంగా అద్వాణీ, వాజపేయి తీర్చిదిద్దారు. ఔత్తరాహుల పార్టీ అన్న ముద్రను చెరిపివేశారు. 1989 నుంచి పాతిక సంవత్సరాల పాటు రాజకీయ సుస్థిరత లేకుండా బాధపడుతున్న దేశంలో ఒక బలమైన అధికార పక్షాంగా ఆవిర్భవించే దిశగా బీజేపీని నడిపించారాయన.



కాంగ్రెస్‌కు గడ్డురోజులు తెచ్చిన పరిణామాలలో కీలకమైనవి రెండు. అది చేసిన రెండు మహా తప్పిదాలే ఆ రెండు. ఒకటి అత్యవసర పరిస్థితి. రెండు అయోధ్య సమస్య పట్ల వ్యవహరించిన తీరు. ఈ రెండింటిలోను అద్వాణీ కీలకంగానే ఉన్నారు. అది ఆయన రాజకీయ ప్రాముఖ్యానికి నిదర్శనం. అద్వాణీ గొప్ప వక్త. అయితే క్లుప్తంగా విషయం వివరించే తత్త్వం ఆయనది. ప్రజా జీవితంలో విలువలు ప్రవేశపెట్టడానికి, వాటిని ఆచరించడానికి తపన పడిన ఇటీవలి కాలపు రాజనీతిజ్ఞుడు లాల్ కృష్ణ అద్వాణీ. 1984లో లోక్‌సభలో కేవలం రెండు స్థానాలు ఉన్న పార్టీ ఇవాళ 303 స్థానాలకు చేరుకునేటట్టు చేయడంలో అద్వాణీ నిర్వహించిన పాత్ర ఎనలేనిది. చిరస్మరణీయమైనది. పార్టీలోనే అటు సాటి సీనియర్లకు, ఇటు ఇతర నేతల స్థానానికి ఎలాంటి భంగం లేకుండా తాను ఎదుగుతూ, పార్టీని నిర్మించిన మార్గదర్శకుడు అద్వాణీ. ఆయన నమ్మిన సిద్ధాంతాలను ఎంత నిశితంగా విమర్శించినా అద్వాణీని వ్యక్తిగతంగా విమర్శించే సాహసం భారత రాజకీయాలలో ఇంతవరకు ఎవరూ చేయలేదు. ఐదు దశాబ్దాల ఆయన నిష్కళంక ప్రజా జీవితానికి గుర్తింపు భారత రత్న పురస్కారం.

భారత రత్న పురస్కారానికి ఎంపికైన సందర్భంలో అద్వాణీకి జాగృతి అభినందనలు. ఆయనకు శ్రీరామచంద్రుడి ఆశీస్సులు ఉండాలని ఆశిద్దాం.

– జాగృతి డెస్క్

# స్థితప్రజ్ఞుడు

ఎల్.కె.అద్వాణీని దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారత రత్న'కు ఎంపిక చేయడం ఎంతో ఆనందాన్ని కలిగించింది. ఇది భారత ప్రభుత్వం వారికి ఇచ్చిన గొప్ప గుర్తింపు.

అద్వాణీ దేశ సమైక్యత, సార్వభౌమత్వం కోసం సాంస్కృతిక జాతీయవాదం కోసం అహరహం శ్రమించారు. అలాగే సంతుష్టీకరణ విధానాన్ని పటాపంచలు చేస్తూ ఘంటాపథంగా దేశ ప్రజానీకానికి చెప్పారు. అయోధ్య రథయాత్ర ద్వారా ప్రజా జాగరణను నిర్మాణం చేసి రాజకీయాలను ఒక మలుపు తిప్పారు. ఆయన చేసిన కృషి, త్యాగం, పడిన శ్రమ చాల గొప్పవి. నిరంతరం పరిశ్రమించేవారు.

వారు మాట్లాడేది చాలా తక్కువ. కాని ప్రతి నిర్ణయాన్ని అమలు చేయగలిగే కుశాగ్రబుద్ధి కలిగిన నాయకుడు. 1980 నుండి నేను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సంఘటనా మంత్రిగా ఉన్నప్పటి నుండి వారితో మాట్లాడటం, చర్చించడం, పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నాను. తద్వారా అనేక విషయాలు వారి నుండి నేర్చుకొన్నాను. పార్టీ అధ్యక్షులుగా, హోం మంత్రిగా, ఉప ప్రధానిగా ఏ బాధ్యతలో ఉన్నా ఫోన్ చేయగానే మాట్లాడేవారు. నేను ఆంధ్రప్రదేశ్ బీజేపీ సంఘటనా మంత్రిగా ఉన్నప్పుడు ఒకసారి వారితోపాటు రైల్లో విజయవాడకు ప్రయాణించాను. కొద్దిసేపు సంస్థాగత విషయాలు మాట్లాడినా, తర్వాత పుస్తక పఠనంలో మునిగి పోయారు. విజయవాడ చేరేవరకు చదువుతూనే ఉన్నారు.

వారి జ్ఞాపక శక్తి చాలా గొప్పది. పార్లమెంట్‌లో మాట్లాడుతున్నపుడు ఆయా అంశాలకు సంబంధించి తేదీలు, స్థలాల వివరాలు చూడకుండా అలవోకగా చెప్పేవారు. అంతటి లోతైన అధ్యయనం, అవగాహన కలిగి ఉండేవారు. నేను పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్నప్పుడు వారు హోంమంత్రిగా ఉంటూ ఢిల్లీ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ బాధ్యతలు కూడా నిర్వహిస్తుండేవారు. ఆ సమయంలో ఢిల్లీకి సంబంధించి ఏ సలహా ఇచ్చినా స్వీకరించి అమలు పరిచేవారు. నిరాడంబర జీవనం వారిది. రథయాత్రలో నేను అద్వాణీ వెంట ఉన్నాను. ఆయన వెంట రెండు లేదా మూడు చొక్కాలు, ధోవతులు ఉండేవి. వాటిని ఉతికిన తర్వాత ఇస్త్రీ చేయించుకోకుండా, స్వయంగా మడచి తలక్రింద పెట్టుకొనేవారు. సాధారణ భోజనమే అలవాటు. అదైనా అతి స్వల్పంగా స్వీకరించేవారు. ఒకసారి చంద్రబాబునాయుడు విందుకు ఆహ్వానించారు. నన్ను కూడా వెంట తీసుకెళ్లారు. ఎన్నో వంటకాలు తయారుచేశారు. కాని అద్వాణీ ఒకే ఒక చపాతీతో సరిపెట్టుకొన్నారు. చంద్రబాబు వడ్డించబోయినా అంతకుమించి స్వీకరించలేదు. ఆ విధంగా 'సింపుల్ లివింగ్ హై థింకింగ్' అన్నట్లు వారి జీవనం సాగేది.


నిజాయతీ, ప్రామాణికతలకు పెట్టింది పేరు అద్వాణీజీ. వారు పార్లమెంటు సభ్యుడుగా ఉన్నపుడు ఒకసారి హవాలా కేసులో వీరి పేరు జైన్ డైరీలో ఉన్నదని, వీరిని అరెస్టు చేయడానికి పోలీసులు ఇంటికి వచ్చారు. అది తెలిసి మేము కొందరం వెళ్లాం. ఈ మచ్చ తొలిగేవరకు నేను పార్లమెంటులో అడుగుపెట్టనని చెప్పారు. వారితో కలసి పనిచేస్తున్నప్పుడు ఎక్కడా, ఏ సందర్భంలోను వారిలో కోపాన్ని, ఆక్రోశాన్ని చూసి ఎరుగం. ఎన్నికలలో ఫలితాలు అనుకూలంగా వచ్చినా, వ్యతిరేకంగా వచ్చినా నిరాశపడేవారు కాదు.

1998లో నేను పార్లమెంటు సభ్యుడుగా గెలిచాక వారు స్వయంగా ఫోన్ చేసి మీరు వాజపేయ్ మంత్రివర్గంలో చేరుతున్నారు, రేపే ప్రమాణ స్వీకారోత్సవానికి రావాలని ఆహ్వానించినపుడు వారి ప్రేమజనితమైన భావనకు నా హృదయం పులకించింది. మంత్రి అయిన తరువాత పార్లమెంటు సభ్యుడిగా ఆచరించాల్సిన నీతి, నియమాలు గురించి తెలియజేశారు. ఆ విధంగా వారి ద్వారా ఒక కార్యకర్తగా, నాయకుడిగా ఎలా మెలగాలనేది నేర్చుకొనే గొప్ప అవకాశం నాకు కలిగింది. అలాంటి గొప్ప వ్యక్తిని దేశ అత్యున్నత పురస్కారంతో గౌరవించిన భారత ప్రభుత్వానికి, ప్రధాని మోదీకి ధన్యవాదాలు.

– బండారు దత్తాత్రేయ, గవర్నర్, హరియాణా

లాల్‌కృష్ణ అద్వాణీ నెల్లూరు పర్యటనకు వచ్చినప్పుడు నన్ను వారికి సహాయకుడిగా నియమించారు. అలా ఆయనను దగ్గరగా గమనించే అవకాశం చిరకాలం కిందటే కలిగింది. అప్పటి నుంచి ఆయన వ్యక్తిత్వం నన్ను చాలా ఆకర్షించింది. గౌరవభావం పెంచింది. తర్వాత రాష్ట్ర పర్యటనకు వస్తే తరచు కలుస్తూ ఉండేవాడిని. నేను శాసనసభ్యుడిని అయిన తర్వాత మరింత సాన్నిహిత్యం వచ్చింది. ఆయన ఉపన్యాసాలు తర్జుమా చేయడం, వారితో పర్యటనలో పాల్గొనే అవకాశం వచ్చాయి.

అటల్‌జీ, అద్వాణీజీ ఇద్దరికీ మొదట సహాయకుడిగా ఉండే అవకాశం రావడమే నా జీవితంలో పెద్ద మలుపు. అద్వాణీ నన్నెంతో అభిమానంగా చూసేవారు. నేను శాసనసభలో మాట్లాడిన వాటి గురించి, పత్రికల్లో వచ్చిన విషయాలు పార్టీ సహచరులు చెప్పడంతో, ఆయనను కలిసినప్పుడల్లా చాలా సూచనలు చేసేవారు.



# సమున్నత వ్యక్తిత్వం

### జనసామాన్యంలో ఉండాలనేవారు

నన్ను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా చేసినప్పుడు, ఆంధ్రప్రదేశ్ ప్రథమ రాష్ట్ర మహాసభలకు అద్వాణీ హాజరయ్యారు. అటల్జీ నాయకుడేకాదు, ప్రజాకర్షణ ఉన్నవారు. అద్వాణీలో నాయకత్వ లక్షణంతో పాటు కార్యకర్తలకు మార్గదర్శనం చేయడంలోను ప్రముఖ పాత్ర వహించేవారు. సిద్ధాంతంపైన సమగ్ర అవగాహన కల్పించడం కోసం శిక్షణ తరగతుల్లో, కార్యకర్తల సమావేశాల్లో ఆయన విస్తృతంగా మాట్లాడేవారు. కార్యకర్తలపట్ల ప్రేమ, అప్యాయతతో కూడిన అనురాగాన్ని చూపేవారు. ఆయన చెప్పిన మాటలు ఇంకా గుర్తున్నాయి, 'బీజేపీ సఫేద్ కపడా పార్టీ హై' అనేవారు. స్వచ్ఛమైన పార్టీగా మనకి పేరు. చిన్న సిరామరక అంటినా జనం గుర్తిస్తారు. కాంగ్రెస్ గురించి, డ్రైనేజీలో పడి బయటకు వస్తే 'ఏక్ నయారంగ్ ఆయా' అనేవారు. కాబట్టి మనం మరింత జాగ్రత్తగా ఉండాలని సదా హెచ్చరించే వారు. మరొక్క విషయం చెప్పేవారు. ప్రతి ఒక్కరూ, మమేకం అయ్యే విధంగా మనం పర్యటనలు రూపొందించుకోవాలి. తద్వారా మనం జనానికి మరింత దగ్గర కావచ్చు. పర్యటనలకు వెళ్లినప్పుడు సాయంత్రం అయ్యేసరికి మనం కేంద్రానికి వెళ్లిపోదాం అని కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో పర్యటనలో ఉన్నప్పుడు పార్టీ కార్యకర్తల ఇళ్లల్లో నివాసముండాలి, తద్వారా కార్యకర్తలకు పార్టీతో, పార్టీకి కార్యకర్తలతో అనుబంధం పెరుగుతుందని చెప్తుండేవారు. ఆయన నిరంతరం పర్యటించే వారు. దేశవ్యాప్త పర్యటనలతో పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్లే ప్రయత్నమది. ఈ విషయాలే నేను జీవితంలో పైకి రావడానికి ప్రధాన కారణ మయ్యాయి. దానిని ఆచరించాను. ప్రవర్తన విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలి. మన ప్రవర్తన ఇతరులకు భిన్నంగా, ప్రత్యేకంగా ఉందనే సంకేతాలు ఇతరులకు ఇవ్వాలి. మాటల్లో కాదు చేతల్లో. 'డీడ్స్ ఆర్ మోర్ ఇంపార్టెంట్ దాన్ వర్డ్స్' అని చెప్తుండేవారు.

### పార్టీని జనం దగ్గరకు తీసుకువెళ్లాలి

ఆయన కేంద్ర సమాచార, ప్రసారశాఖ మంత్రిగా ఉన్నప్పుడు కూడా ప్రచార, ప్రసార సాధనాలు ఎలా పనిచేయాలి, పార్టీని విస్తృతంగా జనంలోకి తీసుకువెళ్లడం కోసం ఏమిచెయ్యాలని చాలా చక్కగా చెప్పారు. ఆదర్శాల కన్నా ఆదర్శ ఆచరణ ముఖ్యమని చెప్పేవారు. మనం ఎలాంటి పార్టీ వాళ్లమో, మన ఆచరణ చూసి ప్రజలు అంచనా వేసుకుంటారని ఆయన నమ్మకం. ఆయన ఉప ప్రధానమంత్రి అయిన తర్వాత నేను పార్టీ అధ్యక్షుడు కావడం, ఆ తర్వాత బీజేపీ ఎన్నికల్లో ఓడిపోతే, నేను రాజీనామా ఇవ్వడం జరిగిపోయాయి. ఇప్పటి పరిస్థితులలో మీ నాయకత్వం తప్ప మరో మార్గం లేదని మేమందరం చెప్తే, అద్వాణీ అధ్యక్షుడయ్యారు. పార్టీకి 1984లో 2 సీట్లే వచ్చాయి. అందుకని ఆయనను రెండవసారి అధ్యక్ష పదవి స్వీకరించమంటే, వెంకయ్యజీ నా టీంలో ఉండేటట్టు అయితే సరే అన్నారు. అలా నేను అధ్యక్షుడిగా పని చేసిన తర్వాత కూడా ఉపాధ్యక్షుడిగా పని చేయడానికి సిద్ధమయ్యాను. అక్కడ ఉన్నది అద్వాణీ కాబట్టి.

### వాజపేయి పేరు ప్రతిపాదించారు

మేమందరం ఆ రోజుల్లో అద్వాణీ నాయకుడవు తారని భావిస్తుండేవాళ్లం. కానీ ఆయన అటల్‌జీ పేరు ప్రతిపాదించారు. ముంబై సమావేశాల్లో, శివాజీ మైదాన్‌లో జరిగిన బహిరంగ సభలో మొదటిసారిగా, రాబోయే ఎన్నికలు మేం వాజ్‌పేయి నాయకత్వంలో పోటీ చేస్తాం, ఆయనే మా ప్రధానమంత్రి అభ్యర్థి అని అద్వాణీ ప్రకటించారు. తర్వాత, నేను, సుష్మా స్వరాజ్, ప్రమోద్ మహాజన్, జైట్లీ లాంటి వాళ్లందరం దీని గురించి వారితో ప్రస్తావించాం. ఆయన చెపుతూ 'పార్టీలో నాకు ఎంత పాపులారిటీ ఉన్నా ప్రజల్లో వాజ్‌పేయి అంటే ఆకర్షణ ఉంది. ఆయన్ని నాయకుడిగా పెట్టుకుంటే, పార్టీ విజయం సాధించడం సులభం' అన్నారు.

### రామరాజ్యం నుంచి ఉదాహరణలు

పార్టీకి ఆయన అధ్యక్షుడిగా ఉన్నప్పుడు నేను మహామంత్రి, అంటే ప్రధాన కార్యదర్శిగా పని చేసే అవకాశం లభించింది. ఏ విషయం చెప్పినా తరచుగా శ్రీరామచంద్రుడు, రామరాజ్యం... అంటూ అక్కడి ఉదాహరణలు చెప్తుండేవారు. జాతీయ కార్యవర్గ సమావేశాల ముగింపు ఉపన్యాసం, తీర్మానాల్లో జోక్యం చేసుకున్నప్పుడు కూడా అరటిపండు వలిచి పెట్టినట్టుగా వివరించేవారు. ఆయన తీర్మానాలు రూపొందించేవారు. వేరెవరైనా– సుష్మా స్వరాజ్, అరుణ్ జైట్లీ లేదా నేను, పాతరోజుల్లో కైలాస్ జోషీ, మధ్యప్రదేశ్ రైతులకు సంబంధించిన

కామత్ వంటివారు తయారుచేస్తే, తుదిమెరుగులు దిద్దేవారు.

**అయోధ్య రథయాత్ర, ఇతర యాత్రలు**

అయోధ్య రామమందిర నిర్మాణం కోసం అద్వాణీ చరిత్రాత్మక రథయాత్ర జరిపి ప్రజాభిప్రాయాన్ని కూడగట్టారు. ఆ సందర్భంలో నేను ఆంధ్రప్రదేశ్ పర్యటన ఇన్‌ఛార్జిగా ఉన్నాను. ఆ రథయాత్ర కారణంగా రామజన్మభూమి ఉద్యమం మరింత ఊపందుకొని, మందిర నిర్మాణ స్వప్నం సఫలీకృతమయింది. ఆ తర్వాత స్వర్ణ జయంతి యాత్ర. మైసూరు నుంచి ఇంకో యాత్రను ప్రారంభించినప్పుడు ఆయనతో యాత్ర మొత్తం ఉండే అవకాశం నాకు ఇచ్చారు. దానితో ఆయన్ని మరింత నిశితంగా గమనించడానికీ, మరింత మార్గదర్శనం పొందడానికీ అవకాశం లభించింది. రాజకీయాల్లో విలువలు, సత్సాంప్రదాయాలను పాటించాలనే విషయం ఆయన ఎప్పుడూ నొక్కి చెప్తుండేవాళ్లు, అది కూడా మా అందరి మనసులో గట్టిగా నాటుకుపోయి ఉంది. పార్లమెంటులో కూడా ఎలా వ్యవహరించాలి? రాజకీయ ప్రత్యర్థులను ప్రత్యర్థులుగానే చూడాలి తప్పితే శత్రువులుగా చూడకూడదు, పరుషమైన పదాలు వాడకూడదు అనే విషయాన్ని కూడా నేను వారి దగ్గర నుంచే నేర్చుకున్నాను. మొత్తం మీద వ్యక్తిత్వం, వక్తృత్వం, కర్తృత్వం, మిత్రత్వం, నేతృత్వం ఇవన్నీ ఎలా ఉండాలనే విషయం ఎక్కువగా అద్వాణీగారి దగ్గరి నుంచే నేర్చుకున్నాం. వారికి వీలు చిక్కినప్పుడు నేను ఆయన ఇంటికి వెళ్లి, అనేక విషయాలు తెలుసుకునే అవకాశం లభించింది. నన్ను కానీ, మంచిగా పని చేస్తున్న ఇతరులను కానీ ఇష్టపడితే మరింత దగ్గరకు తీసుకునేవాడు. కుటుంబ వ్యవహారాలలో కూడా కుటుంబ సభ్యులతో కూడా చాలా సన్నిహితంగా ఉండేవారు. తద్వారా కుటుంబ వ్యవస్థలో మనం ఎలా ఉండాలనే విషయం తెలుసుకునేందుకు అవకాశం లభించింది. వారు మార్గదర్శకుడని చెప్పుకోడానికి నేను గర్వపడుతున్నాను.

**మితాహారమే ఆరోగ్య రహస్యం**

అద్వాణీ అన్నిటా క్రమశిక్షణ పాటించేవారు. భోజన విషయంలో చాలా జాగ్రత్త. అటల్‌జీ అందరితో పాటు సరదాగా అన్నీ తిందామనుకున్నా, అద్వాణీ సిద్ధపడేవారు కాదు. ఒకసారి ఎన్టీరామారావు అద్వాణీని ఉపాహారానికి పిలిచి, రకరకాలు పెట్టినప్పటికీ కూడా అద్వాణీ అన్నీ ముట్టలేదు. రామారావుగారిని మామూలుగా డిక్టేటర్ హోస్ట్ అంటారు. ఆయన ఏం చెప్తే అది అందరం తినాలి, బలవంతంగా అయినా తినాలి. ఎన్టీఆర్‌కు డయాబెటీస్. అయినా మంచిగా తినేవారు. కానీ అద్వాణీ తన నియమాన్ని కాస్త కూడా అతిక్రమించలేదు. అసలు ఆయన ఆరోగ్య రహస్యమే అది అనుకుంటాను. చిన్న ఉదాహరణ, నవ్వు తెప్పించే ఉదాహరణ చెప్పారాయన. ప్రతి ఒక్కరికీ జీవితంలో ఎంత తినాలి అనే కోటా దేవుడు నిర్ణయిస్తాడు. కానీ ఎన్ని సంవత్సరాల్లో తినాలి అనే విషయాన్ని మనకు వదిలేశాడు భగవంతుడు. అది నువ్వు 30 ఏళ్లలో తింటావా, 70 ఏళ్లల్లో తింటావా అది నీ ఇష్టం అని నవ్వుతూ చెప్తుండేవారు.

**సమున్నత వ్యక్తిత్వం**

ఏ కోణం నుంచి చూసినా కూడా ఆయనది ఆదర్శవంతమైన వ్యక్తిత్వం. ఆ వ్యక్తిత్వంతోనే ఆయన దేశంలో పేరెన్నికగన్న నాయకుడిగా మిగిలి ఉన్నారు. భా వ్యక్తీకరణలో, ఆలోచనలను ఇతరులతో పంచుకోవడంలో, పత్రికల్లో వ్యాసాలు రాయడంలో ఆయన ధోరణి విశిష్టంగా ఉంటుంది. రచనల ద్వారా ప్రజలను, వారి ఆలోచనలను ప్రభావితం చేయవచ్చునని ఆయన విశ్వాసం కూడా.

కమ్యూనిస్టు పార్టీ – అంటే సిద్ధాంతపరంగా మాకెవరికీ పడేదికాదు. కానీ అటల్‌జీ, అద్వానీజీ ప్రభుత్వంలో ఉన్నప్పుడు ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు నంబూద్రిపాద్ కేరళలో కన్నుమూశారు. బీజేపీ తరఫున ఎవరైనా వెడితే మంచిదనే ఆలోచన వచ్చింది. నంబూద్రి ప్రతిపక్ష ప్రముఖుడు. మాజీ ముఖ్యమంత్రి. చివరికి అద్వాణీ నేను వెడతానని చెప్పి, స్వయంగా హాజరై నివాళి ఘటించారు. దాంతో అద్వాణీ పట్ల ఇతర పార్టీలలో గౌరవభావం పెరిగింది. ఇలా ఎన్నో సందర్భాలు.

**– ఎం. వెంకయ్యనాయుడు, మాజీ ఉపరాష్ట్రపతి**





అప్పటికే ఆమె కవయిత్రి. కవితలెన్నో రాశారు. ఒకసారి ఆయనతో సమావేశమయ్యారు.

'నా రచనలు మీరు చూస్తున్నారు కదా' అడిగారు. చూడటమే కాదు... చదువుతున్నా' బదులిచ్చారాయన.

'మరి – సాహిత్యపరంగా మీ సలహా?'

'ఇవ్వాల్సిన పనుంది. ఇంకా ఇంకా రాయండి. భావాలు ఎలాగూ ఉంటాయి. పదబంధాలమీద చూపు నిలపండి'

'అంటే?'

'అదే చెప్తున్నా. ఏ భావమైనా భాషతోనే అందగిస్తుంది. మీ మాటలు పూలు ఎలా ఉంటాయో అలా ఉండాలి. అవి సుతారంగా చదువరి మనసును తాకాలి. బలంగా కాదు... సుతిమెత్తగా'

---

'మీ మౌనం వెనుక ఏముందో నాకు తెలుసు. అదను చూసి పదునుగా రాయండి. పాఠకుల మనసు గెలుచుకోండి.'

'ఆ తర్వాత'

'భరతమాత' బంధనాలు పటాపంచలవుతాయి. మన దేశం విముక్తమవుతుంది. కలాన్ని ఖడ్గంగా కాదు – సమహారంగా మలచండి. స్వాతంత్ర్య పిపాసను అంతటా పెంచండి. రచయిత్రిగా ఇదే మీ మొదటి, ముఖ్య బాధ్యత'

ఆమె కళ్ళు మిలమిలా మెరిశాయి. అటు తర్వాత కాలక్రమంలో కవితల విరివానలెన్నో కురిశాయి. తన రచనలకు అర్థపరమార్థాలు కలిగాయి. ఆయన గోపాలకృష్ణ గోఖలే. ఆమె సరోజినీ నాయుడు!

'స్ఫటికంలా స్వచ్ఛం ఆ మనసు. ఎంత సౌమ్యుడో అంత ధీరుడు. అక్షరాన్నే నమ్మిన పరిపూర్ణుడు' అని జాతిపిత ప్రశంస అందుకున్న మాననీయుడు గోఖలే. అప్పట్లో తనను సంప్రదించిన కలల యోధురాలికి మార్గనిర్దేశం చేసిన మహనీయుడు. ఆ వనితా యోధ– అనంతర 'భారత కోకిల' అయ్యారు.

సరోజినీనాయుడు పుట్టింది హైదరాబాద్‌లో. చిన్నవయసులోనే మెట్రిక్ చదువుకుంది మద్రాసులో. తండ్రి అనేక భాషల్లో పండితుడు. భాగ్యనగర కళాశాల ప్రధాన అధ్యాపకుడిగా అనుభవం గడించిన దీక్షాదక్షుడు. తల్లి బెంగాలీ భాష సాహిత్యవేత్త. మనందరికీ తెలిసిన 'గోల్డెన్ త్రెషోల్డ్' సరోజిని నివాసస్థలం. విద్య, వారసత్వ, సాంస్కృతికపరంగా ఎందరెందరికో చిరపరిచిత భవన ప్రాంగణం. ఇప్పుడైతే హైదరాబాద్ విశ్వవిద్యాలయ నిర్వాహకత్వం.

# మంజుల కోయిల!

కవి కోకిలకు బంగారు వాకిలి! అప్పటికీ, ఇప్పటికీ కళలూ, సంస్కృతుల నెలవు. అదే గోల్డెన్ థ్రెషోల్డ్. పేరిట వందలాది పంక్తుల సుదీర్ఘ కవితాఖండికను రాసినపుడు, సరోజినికి కేవలం పదమూడేళ్లు! పుస్తక ఆవిష్కరణ మాత్రం విదేశీ నగరమైన లండన్‌లో, కానీ స్వదేశీ కీలకమైన హైదరాబాద్‌లో అది ఏర్పాటైంది. భవంతి జాతీయ, అంతర్జాతీయ విఖ్యాతిని అందుకుని నిలువెత్తు నిదర్శనంగా భాసిస్తోంది. వివిధ భాషలవల్ల, కళారూపాల కూడలిగా వర్ధిల్లుతోంది.

బాల్యం నుంచే భాష, భావ నిపుణత నిండిన ఆమె తన కావ్యానికి పెట్టిన మొదటిపేరు 'సరోవర రాణి'. ఆ అక్షర ప్రతిభ సుప్రసిద్ధుల దృష్టికెళ్లింది. విదేశీ యానానికి దారితీసింది. లండన్ కళాశాల, కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయ సంస్థల్లో సరోజిని విద్యాభ్యాసం కొనసాగింది. కావ్యరచనల పరంపర వేగం అందుకుంది.

బంగారు వాకిలిని 'స్వర్ణద్వారం'గా కీర్తించారు విమర్శకులు. కాలవిహంగం, విరిగిన రెక్కలు వంటి ఆంగ్ల గ్రంథాలనూ ఎంతగానో కొనియాడారు. పరకాయ ప్రవేశం తరహాలో... అక్కడ ఉండి ఇక్కడి జీవితాలను ఆ కవయిత్రి చిత్రీకరించిన రీతిని పలు విధాలా మెచ్చుకున్నారు. కవన కదన వైఖరికి జేజేలు పలికారందరూ.

విదేశాల్లో విద్య కాగానే, స్వదేశానికి తిరిగొచ్చారామె. ఇక్కడే గోవిందరాజులు నాయుడితో పరిణయం.

విముక్త ఉద్యమం సాగుతున్న రోజులవి. స్వేచ్ఛాయుత వాతావరణమే ఆమె కోరుకుంది కూడా. సారస్వత మూర్తిగా రంగప్రవేశం చేశారు. గోపాలకృష్ణ గోఖలే నేతృత్వాన కదిలారు.

దాస్య జీవితం ఎప్పుడూ బాధాకరమే. తూటాలకు బెదిరితే, లాఠీలకు అదిరితే, కారాగార శిక్షలకు జంకితే ఎలా.... అంటూ ప్రజను ఉత్తేజపరిచారు. తాను కదిలి, తన వారిని ముందుకు నడిపించారు.

దేశంలోనివారిని, విదేశంలో ఉన్న భారత సంతతివారినీ చైతన్యవంతం చేశారు సరోజినీ నాయుడు తన రాతలూ, పర్యటనలతో!

**నువ్వు వేరే వ్యక్తివి కాదు**
**ఆ ఆలోచనే చేయకు ఒక్కగా**
**'ఎక్కడో ఉన్నాను కదా' అనుకోకు.**
**నీ మూలం ఇక్కడేనని మరవకు.**
**నువ్వూ, నీ దేశం, నీ జాతి**
**అంతా ఒక్కటే. మనదంతా ఐక్యతే!**
**నీ కదలికతోనే ఏకత**
**స్వతంత్ర సాధనతోనే తీరుతుంది వెత.**
**సంకెళ్లకు అలవాటుపడితే నిరాశ**
**తెంచుకునే నీ యత్నంతోనే సత్వర సఫలత**

వంటి కవితా పంక్తులతో చైతన్య జ్యోతిని వెలిగించి పరీక్షించారామె.

దేశ విదేశాల్లోని స్థితిగతులకు చలించారు. 1926లో దక్షిణాఫ్రికా వెళ్లారు. అక్కడి భారతీయ హక్కుల కోసం ఉద్యమాన్ని విస్తరించారు. 1928లో అమెరికా, కెనడాలకు చేరుకున్నారు. విముక్త సాధన ప్రాధాన్యాన్ని అక్కడా విపులీకరించారు. మరో ఏడాదికే తూర్పు ఆఫ్రికాను సందర్శించారు. అలుపూ సొలుపూ లేని పర్యటనలే అవన్నీ. ఆంగ్ల పాలకుల గుండెలదిరాయి. దమనకాండకు దిగారు. కారాగారంలో బంధించారు. నెలల తరబడి బాధించారు.

ఆ చీకటి కొట్లలో ఆమె ఆరోగ్యం క్షీణించసాగింది.

అయినా తన సంకల్ప శక్తిని ఆపలేకపోయారు ఎవరూ!

1947కు ముందు రెండు సంవత్సరాలవరకు ఆమెకు నిర్బంధవాసమే.. భరించారు, సహించారు.

ఉద్యమ తీవ్రత మహాగ్నిని తలపించింది. ఫలితంగా భారతదేశం దాస్య విముక్తమైంది. స్వేచ్ఛాపతాక వినువీధిన ఎగసింది.


స్వాతంత్ర్య అనంతర తరుణంలో –

ఉత్తరప్రదేశ్‌కు మొట్టమొదటి మహిళా గవర్నర్ సరోజినీ నాయుడే.

సామాజిక, సాంస్కృతిక, కళా, సాహిత్య రంగాలకూ విస్తరించాయి. ఆ మహిళామణి నేతలు. అవి అపురూపం, అనంతం. రచనలపరంగా ఎంతైనా నాణ్యత. జాతీయతకీ సమధిక ప్రాధాన్యత.

**నవరసాలనూ పండించిన విదుషీమణి**
**భారతీయ కోకిల.**
**'భారతీయుల కళాప్రాభవమ్మొలికించి**
**తీయగా పాడిన కోయిలమ్మ!**
**స్వారాజ్య వీర విహార రంగములోన**
**కోరి దూకిన వెలుగు కోడలమ్మ!**
**భరతనారీ ప్రతాప ప్రభావ గరిమ**
**ఖండఖండాలు జల్లి. విఖ్యాతిగన్న**
**దివ్యమూర్తి!'** అంటూ కవుల కళలు శ్లాఘించాయి.

**'ఆ దేవి దివ్యసుగుణ పుష్పముల**
**ఏరి విరిదండ పూర్తిచేసి**
**పుణ్యభారతమాతను పూజచేసి**
**ఘనతకెక్కుడీ భారత వనితలారా!'**
**అని ప్రబోధించింది ఘంటసాల గళమాధురి.**
**సరోజినీ నాయుడి దృష్టికోణంలో –**




1. **మానవ జీవితం అనంత కవితాత్మకం.**
2. **తనలోనే, తనతోనే దాని ఆవిష్కరణం.**
3. **ఆదేశం, ఈ దేశం అనుకుంటేనే భిన్నత్వం.**
4. **తేరిపారచూస్తే మాత్రం అంతా ఐక్యసూత్రం.**

మనలోని సున్నితత్వం, సునిశితత్వం పదిలంగా ఉండాలెప్పుడూ. వాటిమీద ఎటువంటి ముద్రలూ పడకూడదు. ఎన్నడూ చెక్కు చెదరరాదు. మనల్ని మనం తెలుసుకుంటే, తెలిసింది ఆచరణకు తెస్తే – అప్పుడే, ఆనాడే స్వేచ్ఛ, సమత్వం, స్వతంత్రం, పరిరక్షణం.

ఇంతటి ప్రత్యేకత, విలక్షణత వెల్లివిరిసిన తేజోమూర్తి కాబట్టే; ఇదే ఫిబ్రవరి నెలలో సరోజినీ నాయుడు జయంతి... జాతీయ వనితా దినోత్సవ సుసందర్భం. ఆ కోకిలమ్మను స్మరిద్దాం. సంభావిద్దాం. పాండితీ, స్వరప్రభను మనమూ అవలోకిద్దాం. ఆస్వాదిద్దాం.

'అమ్మా! సరోజినీ దేవీ! పరిపూర్ణ సువర్ణ కళామయ జీవీ!' ★




**జంధ్యాల శరత్‌బాబు**
సీనియర్ జర్నలిస్ట్

# నంది ఎదురుచూపులు

**కాశీ విశ్వనాథుని ఆలయంలో నంది ఎదురుచూపులు ఫలించాయి. ఎన్నో సంవత్సరాలుగా ఎదురుగా కనిపించే మసీదునే చూస్తూ ముస్లింల ప్రార్థనలను వింటున్న నందికి విశ్వేశ్వరుని పూజలను నిత్యం తిలకించే మహద్భాగ్యం మళ్లీ దక్కింది. ప్రస్తుతం మసీదు ఉన్న ప్రాంతంలో ఒక భారీ హిందూ ఆలయం ఉండేదని పురావస్తుశాఖ సర్వేలో వెల్లడికావటం, దీని ప్రకారం జిల్లా కోర్టు సూచనలు ఇవ్వటంతో పరిస్థితులన్నీ సానుకూలంగా మారాయి. అయోధ్యలో రామలల్లా తన స్వస్థలానికి చేరిన రెండు రోజుల్లోనే ఈ శుభపరిణామం చోటుచేసుకోవటం విశేషంగా హిందూ పక్షం భావిస్తోంది."జ్ఞాన్‌వాపిలో నంది ఉద్భవించాడు. త్వరలో శంకరుడు కూడా ఉద్భవించి తీరతాడు" అన్నారు హిందూ ఆధ్యాత్మిక గురువు, భాగేశ్వర్ ధామ్ బాబా ధీరేంద్ర శాస్త్రి.**

జ్ఞాన్‌వాపిమసీదులో దక్షిణం వైపున ఉన్న సెల్లార్ తెరిచి హిందువులు పూజలు ప్రారంభించు కోవచ్చని వారణాసి జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పు సరికొత్త అధ్యాయానికి తెరలేపింది. ఈ సెల్లార్‌ను వేదవ్యాస్ పీఠ్ అని పిలుస్తారు. 1992 వరకూ వ్యాస వంశీకులు ఇక్కడ పూజలు నిర్వహించేవారు. ఇన్ని సంవత్సరాల తర్వాత మళ్లీ ఇప్పుడు పూజలు ప్రారంభమయ్యాయి. వారణాసి జిల్లా కోర్టు తీర్పుపైన జ్ఞాన్‌వాపి మసీదు నిర్వహిస్తున్న అంజుమన్ ఇంతెజామియా మసీదు కమిటీ నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. హైకోర్టులో ముందు పిటీషన్ వేయాలని ప్రధాన న్యాయమూర్తి చెప్పటంతో కొద్ది గంటల వ్యవధిలోనే అలహాబాద్ హైకోర్టులో అప్పీలు చేసింది. ఈ ఉత్తర్వులపై 'స్టే' ఇవ్వటానికి జస్టిస్ రోహిత్ రంజన్ అగర్వాల్ నిరాకరించారు. మసీదు కమిటీ తరపున న్యాయవాది ఎస్.ఎఫ్. ఎ.నఖ్వీ తన వాదనలు వినిపించారు. "జిల్లా కోర్టు హడావుడిగా నిర్ణయాన్ని వెలువరించింది. వారణాసి జిల్లా జడ్జిగా ఉన్న అజయకృష్ణ విశ్వేష తన పదవీ విరమణ చేసే రోజున హడావుడిగా ఈ తీర్పును ప్రకటించారు. మేం సమర్పించిన ఆయా పత్రాలను సరిగా పరిశీలించలేదు" అని ఆయన తన వాదనలో పేర్కొన్నారు.



హిందూపక్షం తరపున విష్ణుశంకర్ జైన్ వాదించారు. నిజానికి ఆ ఆస్తిని స్వాధీనం చేసుకోవటానికి జిల్లా కలెక్టర్‌ను రిసీవర్‌గా నియమిస్తూ జనవరి 17 నే జిల్లా కోర్టు ఆదేశాలు ఇచ్చిందని, ఆ మేరకు జనవరి 24న దానిని స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. 17వ తేదీన ఇచ్చిన ఉత్తర్వులకు కొనసాగింపుగానే తప్ప ఇది కొత్తగా ఇచ్చిన ఉత్తర్వు కానే కాదని వాదించారు. ప్రస్తుతం చేసిన అప్పీలుకు విచారణ అర్హత లేదని పేర్కొన్నారు.

వారణాసి జిల్లా కోర్టు తీర్పుపైన రాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జోక్యం చేసుకోవాలని ఆల్ ఇండియా ముస్లిం లా బోర్డు కోరింది. "మసీదు బేస్ మెంటులో ఎప్పుడూ పూజలు జరిగిన దాఖలాలు లేవు. అసంబద్ధమైన, నిరాధారమైన క్లెయింలను ఆధారంగా చేసుకుని జిల్లా జడ్జి తీర్పు ఇవ్వటం ప్రశ్నార్థకం" అని అభిప్రాయపడింది.

**హిందూ ఆలయాన్ని కూలగొట్టారు**

వారణాసి జ్ఞాన్‌వాపిలో ప్రస్తుతం ఉన్న నిర్మాణప్రాంతంలో అంతకు ముందు ఒక భారీ హిందూ దేవాలయం ఉండేదని, దాన్ని కూలగొట్టి శిధిలాల మీద మసీదు నిర్మించారని ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) స్పష్టం చేసింది. 2023 జులైలో జిల్లా కోర్టు ఆదేశాల మేరకు పురావస్తు శాఖ ఆగస్టు4న కట్టుదిట్టమైన భద్రత నడుమ సర్వే ప్రారంభించింది. నాలుగు నెలల పాటు శాస్త్రీయంగా అధ్యయనం చేసి ఈ నివేదికను వెలువరించింది. గత నిర్మాణపు ప్రధాన ద్వారం, ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న సెంట్రల్ ఛాంబర్, పశ్చిమాన ఉన్న గదులు, పునాదిలో ఉన్న కళాకృతుల శిధిలాలు, రికవరీ చేసిన దిమ్మలలో సర్వే చేసింది. అక్కడ పెద్ద హిందూ దేవాలయం ఉండేదనటానికి అనేక సాక్ష్యాలను పురావస్తు శాఖ వెల్లడించింది. గోడలపై వాస్తు శిల్పాల అవశేషాలు, గోడల మీద అలంకరించిన అచ్చులు, కేంద్రీయ స్థానంలో ఉన్న కర్ణరథం, ప్రతిరథం, పడమర వైపు గోడలపై ఉన్న తోరణంతో పాటు పెద్ద ప్రవేశ ద్వారం, ముందు వైపు చిత్రంతో కూడిన చిన్న ద్వారం, పక్షులు, జంతువుల శిల్పాలు, లోపలా, బయట అలంకరణలు,పశ్చిమగోడ హిందూదేవాలయ అవశేషాలని సూచిస్తున్నాయని పేర్కొంది. మసీదు నిర్మాణంలో ఆలయ స్తంభాలను, రాళ్లను ఉపయోగించారని, ఆలయ గోడలను యథాతథంగా కలిపేశారని పేర్కొంది. పలు ఆధారాలతో 839 పేజీల నివేదికను వెలువరించింది. ఈ కేసులో రెండు పక్షాలకు చెందిన 11మందికి నివేదిక ప్రతులను అందచేసింది.

పురావస్తుశాఖకు సర్వేలో మసీదు లోపల 34 శాసనాలు లభ్యమయ్యాయి. అందులో 32 శాసనాల డ్రాఫ్ట్‌ను నివేదికలో పొందుపరిచారు. ఔరంగజేబు తన 20వ ఏట మసీదు నిర్మించినట్టు అరబిక్ పర్షియన్ భాషలో ఒక శాసనాన్ని కనుగొన్నారు. ఔరంగజేబు ఆలయ ధ్వంసానికి సంబంధించిన ఉత్తర్వులు ఉన్నాయని, దానిని చెరిపివేయటానికి ప్రయత్నం సాగినట్టు చెబుతున్నారు. కమలం గుర్తులను తొలగించినట్టు గుర్తించారు. దేవనాగర లిపితో పాటు తెలుగు, కన్నడ భాషల్లో అవి ఉన్నాయి. జనార్దనుడు, రుద్రుడు, ఉమేశ్వరుడు అన్న పేర్లు కనిపించాయి.

పురావస్తు తవ్వకాల్లో బయటపడిన తెలుగు లిపితో ఉండే ఒక శాసనాన్ని తిరుపతికి చెందిన ఏఎస్ఐ డైరక్టర్ మునిరత్నం రెడ్డి డీకోడ్ చేశారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం.. శిలాశాసనంపై నారాయణ భట్టు, మల్లన్నభట్టుపేర్లు ఉన్నాయి. వీరు తెలుగు బ్రాహ్మణులు. మొగల్ సామ్రాజ్య చక్రవర్తి అక్బర్ పాదుషా ఆదేశాలతో ఆయన నవరత్నాల్లో ఒకరయిన రాజా తోడర్ మల్లు 1585లో కాశీవిశ్వనాథ ఆలయాన్ని పునర్నిర్మించారు. ఆ సమయంలో కాశీవిశ్వనాథుని ఆలయ నిర్మాణ పనులను నారాయణ భట్టు పర్యవేక్షించారు. వారి కుమారుడే మల్లన్నభట్టు. దక్షిణ భారత దేశంలో ఆలయ నిర్మాణంలో నిపుణులు కావటంతో వారిద్దరికీ ఈ బాధ్యతలు అప్పచెప్పినట్టుగా భావిస్తున్నారు. 17వ శతాబ్దంలో అక్బర్ మునిమనవడయిన ఔరంగజేబు కాశీవిశ్వనాథ దేవాలయాన్ని ధ్వంసం చేసి అక్కడ మసీదు నిర్మించినట్టు ఎన్నో కథనాలు ప్రచారంలో ఉన్నాయి.

'వజూఖానా'లో సీల్ చేసిన వాటర్ ట్యాంకులో

ఏఎస్ఐ సర్వే చేయలేదు. ఇక్కడ ఒక శివలింగం కనిపించిందని హిందువుల తరపున ప్రతినిధులు, జిల్లా అధికారులు చెబితే, అది ఫౌంటైన్ అని ముస్లింలు అభిప్రాయపడ్డారు. తర్వాత ఆ ప్రాంతాన్ని సీజ్ చేయాలని స్థానిక కోర్టు ఆదేశాలను జారీ చేసింది. మరోవైపు మసీదు మేనేజ్‌మెంటు కమిటీ అప్పీలుపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. స్థానిక కోర్టు ఆదేశాలపై స్టే ఇచ్చేందుకు నిరాక రించింది. "ఈ విషయం లో యథాతథస్థితిని కొనసా గించాలని, శివలింగం కనిపించినట్టుగా చెబుతున్న ప్రాంతాన్ని సీల్ చేసి ఉంచాలి. మసీదులో మిగతా ప్రాంతాల్లో ప్రార్థనలు చేసుకోవచ్చు" అని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఇప్పుడు వజూఖానాలో కూడా పురావస్తుశాఖ సర్వే చేసి, వాస్తవాలను ప్రపంచం ముందు ఉంచాలని హిందూ పక్షం కోరుతుంది.

"ఇక్కడ దేవాలయాన్ని ధ్వంసం చేసి మసీదును కట్టలేదు. అక్బర్ కాలంలోనే ఆ మసీదును కూడా నిర్మించారు. అక్బర్ తన కొత్తమతం దీన్‌-ఎ-ఇలాహి ప్రారంభించినప్పుడే ఈ మసీదు నిర్మించారు. ఇక్కడ ఉండే కొలనులో శివలింగం ఉందని చెప్పటం

# ఫలించాయి

సరికాదు. 2010లో మేం మొత్తం మసీదును శుభ్రం చేశాం. అక్కడ మాకు ఎలాంటి శివలింగం కనిపించ లేదు" అని జ్ఞాన్‌వాపి మసీదును పర్యవేక్షించే అంజుమాన్ ఇంతేజామియా కమిటీ జాయింట్ సెక్రటరీ సయ్యద్ మొహమ్మద్ యాసీన్ అభిప్రాయపడ్డారు.

"జ్ఞాన్‌వాపిలో పురావస్తుశాఖ గానీ మరే సర్వే గానీ అవసరం లేదు. కంటి చూపుతోనే అది హిందూ దేవాలయం అని సులువుగా అర్థం అవుతుందని అభిప్రాయపడ్డారు చరిత్రకారుడు రచయిత డాక్టర్ విక్రమ్ సంపత్. ఆలయ శిథిలాలపైన మూడు డోమ్‌లు నిర్మించారు తప్ప అక్కడ మసీదుకు సంబంధించిన ఆనవాళ్లేమీ ఉండవని తేల్చి చెప్పారు. పైగా గోడలపై త్రిశూలం, ఢమరుకం, కమలం వంటివి కనిపిస్తాయి అని పేర్కొన్నారు "వెయిటింగ్ ఫర్ శివ, అన్ ఎర్తింగ్ ట్రూత్ ఆఫ్ కాశీస్ జ్ఞాన్‌వాపి" పేరుతో ఆయన రాసిన పరిశోధన గ్రంథం ఈ నెలాఖరులో విడుదలవుతోంది.



డాక్టర్ పార్థసారథి చిరువోలు
సీనియర్ జర్నలిస్ట్


జ్ఞాన్‌వాపిమసీదు

**నేపథ్యం ఇదీ..**

స్వాతంత్ర్యానికి ముందు నుంచీ ఇక్కడ మసీదు-మందిరంపై వివాదం ఉంది. ఇక్కడ 1809లో మత ఘర్షణలు కూడా చెలరేగాయి. అయోధ్య మినహా (అప్పటికే కోర్టులో వ్యాజ్యం నడుస్తూండటం వల్ల) దేశంలో మిగిలిన అన్ని మసీదు-మందిరం వివాదాలకు ఫుల్ స్టాప్ పెట్టాలని అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు భావించారు. అందుకోసం ప్రార్థనాస్థలాల చట్టం (ప్లేసెస్ ఆఫ్ వర్షిప్) తెచ్చారు. 1991 సెప్టెంబరు 18న ఆమోదితమైన ఈ చట్టం ప్రకారం, 15 ఆగస్టు 1947కి ముందు సదరు ప్రార్థనా స్థలాలు ఏ మతాన్ని అనుసరిస్తున్నాయో ఆ తర్వాత కూడా అదే మతాన్ని పాటించాలి. జ్ఞాన్‌వాపి కూడా ప్రార్థనాస్థలాల చట్టం వర్తిస్తుందని ముస్లిం పక్షాలు వాదిస్తున్నాయి. 'వ్యాస్ కా తిఖానా' ప్రాంతంలో హిందువుల ప్రార్థనలకు అనుమతి ఇస్తూ వారణాసి జిల్లా కోర్టు తీర్పు ఇవ్వటం ప్రార్థనాస్థలాల చట్టాన్ని ఉల్లంఘించటమేనని, దీనిపై తాము న్యాయ పోరాటం చేస్తామని ఎమ్ఐఎమ్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు.

1991 చట్టం తర్వాత జ్ఞాన్‌వాపిలో మసీదు, దేవాలయం మధ్య ఇనుప చట్రంతో గోడ ఏర్పాటు చేశారు. ఈ సమయంలో అక్కడ ఎలాంటి ఘర్షణలు చోటుచేసుకోలేదు. "1991లో కేవలం మసీదు చుట్టూ ఇనుప చట్రంతో గోడ కట్టారు. అంతకు ముందు ముందు ఎంత విస్తీర్ణంలో మసీదు ఉందో, ఇప్పుడు అంతే ఉంది. నాకు తెలిసినంత వరకు ఈ విషయంలో ఎలాంటి వివాదం లేదు. కొన్నిసార్లు శుక్రవారం ప్రార్థనలతో శివరాత్రి కూడా కలిసి వస్తుంది. అప్పుడు కూడా శాంతియుతంగానే రెండు వైపులా ప్రార్థనలు జరిగేవి"అని ఇంతేజామియా కమిటీ జాయింట్ సెక్రటరీ సయ్యద్ మొహమ్మద్ యాసిన్ చెప్పారు.

వారణాసి జిల్లా కోర్టు 1991 నుంచి ఈ విషయంలో దాఖలైన పిటిషన్లను విచారించటం మొదలుపెట్టింది. 1991లో సర్వే కోసం కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన హరిహర్ పాండే మాట్లాడుతూ "1991లో నేను, సోమనాథ్ వ్యాస్, రామరంగ్ శర్మ కలిసి పిటిషన్ వేశాం. అయితే, ఆ ఇద్దరు ప్రాణాలతో లేరు"అని ఆయన చెప్పారు.

స్థానిక కోర్టుల్లో ఈ పిటిషన్ దాఖలైన కొన్ని రోజులకే, దీనికి వ్యతిరేకంగా మసీదు మేనేజ్‌మెంట్ కమిటీ హైకోర్టుకు వెళ్లింది. అయితే, 1993లో యథాస్థితిని కొనసాగించాలని అలహాబాద్ హైకోర్టు సూచించింది. మళ్లీ 2019లో వారణాసి కోర్టులో ఈ కేసుకు సంబంధించిన పిటిషన్ల విచారణ మొదలుపెట్టారు. ఆ తర్వాత మసీదు ప్రాంగణంలో సర్వేకు అంగీకారం తెలిపారు.

**కోర్టు సూచనల మేరకే ముందుకు...**

అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ ముగిసిన రెండు రోజులకే జ్ఞాన్‌వాపికి సంబంధించిన కీలక నిర్ణయం వెలువడినా అధికారపార్టీ దీనిపై పెద్దగా స్పందించ లేదు. ప్రత్యేకంగా ఎలాంటి విజయోత్సవాలు నిర్వహించలేదు. ప్రతిపక్షాలు మౌనాన్ని ఆశ్రయించాయి. "1980లో అయోధ్య రామజన్మ భూమి అంశాన్ని సంఘ్ చేపట్టినప్పుడు ప్రజల్లో ఇంత చైతన్యం లేదు. ఇప్పుడు ప్రజలంతా సాంస్కృతిక అంశాలపై సామూహికంగా స్పందిస్తున్నారు. వాళ్లే స్వయంగా కేసులు ఫైల్ చేస్తున్నారు.

ఆయా అంశాలను బహిరంగంగా చర్చించుకుంటున్నారు" అని కొందరు ఆర్ఎస్ఎస్ నేతలు అంతర్గత సమావేశాల్లో వ్యాఖ్యానించారు. "కోర్టు పురావస్తు శాఖను నివేదికను సమర్పించమని కోరింది. వాళ్లు ఆ పని పూర్తి చేశారు. కోర్టులే ఈ అంశాన్ని పరిశీలించి ముందుకు వెళ్లేందుకు అవసరమైన సూచనలు చేస్తాయి. రామజన్మభూమి అంశంలో మాదిరిగా.." అని అభిప్రాయ పడ్డారు. ఏది ఏమైనా రాబోయే రోజుల్లో జ్ఞాన్‌వాపి మసీదుకు సంబంధించి మరిన్ని కీలక నిర్ణయాలు వెలువడే అవకాశం ఉంది. ★

# తమిళనాట హిందూ ధర్మ

**హిందూ చేతన ఇప్పుడు నిద్రాణ స్థితిని వీడి జాగృతమైన నేపథ్యంలో సనాతన ధర్మాన్ని, ఆలయాలను నిర్మూలించడం అంత తేలికకాదనే విషయం మరొక్కసారి రుజువైంది. అయోధ్య రామాలయంలో ప్రాణ ప్రతిష్ఠ ప్రత్యేక ప్రసారాలపై నిషేధం నుంచి మతాంతరీకరణకు పరోక్ష ప్రోత్సాహం వరకూ ప్రభుత్వ మద్దతుతో యధేచ్ఛగా సాగిపోతున్న తమిళనాడు రాష్ట్రంలో తొలిసారి మద్రాసు హైకోర్టు హిందువులకు అనుకూలంగా తీర్పు చెప్తూ బ్రేకులు వేసింది. హిందువులకు కూడా తమ ధర్మాన్ని స్వేచ్ఛగా అనుసరించే ప్రాథమిక హక్కు ఉందని స్పష్టంగా చెప్పింది.**

ద్రవిడ, ఆర్య సిద్ధాంతం తప్పని జన్యు పరీక్షలలో శాస్త్రీయంగా తేలినప్పటికీ, పెరియార్ రామస్వామి వంటి హిందూ వ్యతిరేక వ్యక్తులను, శక్తులను అనుసరించే ద్రవిడ మున్నేట్ర కజగం (డిఎంకె) లాంటి రాజకీయ పార్టీలకు మద్రాసు హైకోర్టులోని మధురై బెంచి న్యాయమూర్తి జస్టిస్ ఎస్ శ్రీమతి కీలెరిగి వాతపెట్టారు. పళనికి చెందిన సెంథిల్ కుమార్, ఇతరులు దాఖలు చేసిన పిటిషన్‌పై జనవరి 30వ తేదీన తీర్పు ఇస్తూ, సామాజిక సమరసత, శాంతి కోసం హిందూ ఆలయాలలోకి హిందూవేతరులను ధ్వజస్తంభం దాటి వెళ్లనివ్వరాదని, ఆ మేరకు ఆలయాలలో పలుచోట్ల బోర్డులు ఏర్పాట్లు చేయాలని తమిళనాడు రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖకు ఉత్తర్వులు జారీచేసింది. ఎవరు పడితే వారు తమ కార్యకలాపాల కోసం వెళ్లడానికి అవి పిక్నిక్‌స్పాట్లు కాదని న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. అంతేకాదు, పళనిలోని ఒక ఆలయం విషయంపై కోర్టుకు వెళ్లిన పిటిషనర్లకు అనుకూలంగా తీర్పునిస్తూ, కేవలం ఆ ఆలయానికే కాక రాష్ట్రంలోని అన్ని ఆలయాలకూ ఈ తీర్పు వర్తిస్తుందని కూడా స్పష్టంగా చెప్పింది. ఈ ఆంక్షలే భిన్న మతాల మధ్య మతసామరస్యానికి హామీ ఇచ్చి, సమాజంలో శాంతిని కొనసాగేందుకు తోడ్పడతాయని కూడా కోర్టు అభిప్రాయపడింది.

**పెరియార్‌వాదులకు చెంపపెట్టు**

ఈ క్రమంలోనే, ఆలయ నిర్వాహకులు ఆలయ సంప్రదాయాలను, ఆచారాలను, ఆగమాలను కచ్చితంగా నిర్వహించేలా చూడాలని నొక్కి చెప్పింది. ప్రతివాదులు ఈ తీర్పును ఒక్క ఆలయానికే వర్తింపచేయాలని కోరినప్పటికీ, న్యాయస్థానం మాత్రం పిటిషనర్లు లేవనెత్తినది విస్తృతమైన సమస్య అని, కనుక ఇది అన్ని ఆలయాలకూ వర్తింపచేయాల్సిందేనంటూ కటువుగానే చెప్పింది. దీనితోపాటుగా హిందూవేతరులు ఆలయాలలోకి మతేతర ప్రయోజనాల కోసం ప్రవేశించడం అన్నది హిందువుల 'ప్రాథమిక హక్కుల'లో జోక్యం చేసుకోవడమేనంటూ స్పష్టం చేసింది. హిందువులు తమ ధర్మాన్ని స్వేచ్ఛగా అనుసరించే రాజ్యాంగపరమైన హక్కును నిలబెడుతూ, ఆలయాలను పరిరక్షించవలసిన బాధ్యత ధర్మాదాయ శాఖదేనంటూ స్పష్టంగా చెప్పింది. ఎవరైనా హిందువేతరులు ఆలయంలోని నిర్దిష్ట దేవతను దర్శించదలచుకుంటే, వారు తమకు హిందూధర్మంపట్ల విశ్వాసం ఉందని ధృవీకరించేందుకు వాగ్దానం చేస్తూ, ఆలయ ఆచారవ్యవహారాలకు కట్టుబడి ఉండేందుకు అంగీకారాన్ని తెలపాలని, ఆ ప్రక్రియ పూర్తి అయిన తర్వాత మాత్రమే హిందువేతరులను ఆలయంలోకి అనుమతించాలని కోర్టు ఆదేశించింది. "బృహదీశ్వరాలయంలోకి ఇతర మతస్తులు ప్రవేశించి, మాంసాహారాన్ని ఆలయ ఆవరణలో తిన్న విషయాన్ని, అలాగే అన్యమతానికి చెందిన కొందరు వ్యక్తుల బృందం మధురైలోని మీనాక్షీ సుందరేశ్వర ఆలయంలోకి ప్రవేశించి, తమ 'పవిత్ర గ్రంథం'తో గర్భగుడి వద్ద ప్రార్థనలు చేసే ప్రయత్నం చేయడం" గురించీ 11 జనవరి 2024న పత్రికలలో వచ్చిన వార్తలను న్యాయమూర్తి పట్టి చూపారు. ఈ ఘటనలు రాజ్యాంగం హిందువులకు హామీ ఇచ్చిన ప్రాథమిక హక్కులతో జోక్యం చేసుకుంటున్న విషయాన్ని చూపుతున్నాయని న్యాయమూర్తి పేర్కొన్నారు.

**పెరియార్ పై నెహ్రూ మండిపాటు**

కొన్ని దశాబ్దాలుగా మద్రాసు రాష్ట్రంలో పెరియవార్ వాదం పేరుతో హిందూ వ్యతిరేక పార్టీ అయిన డిఎంకె రాజకీయ పేలాలు వేయిస్తూ, లబ్ధి పొందుతోంది. అగ్రవర్ణాలను అవమానించడం, ఆలయాలకు వచ్చే నిధులను స్వాహా చేయడం, ఆలయ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం, మతాంతరీకరణ సహా అనేక అనైతిక కార్యకలాపా లకు నిస్సంకోచంగా పాల్పడుతున్న విషయం తెలిసిందే. వీరి దాడులను తట్టుకోలేకే అగ్రవర్ణ హిందువులు అనేకులు రాష్ట్రాన్ని విడిచిపెట్టి వెళ్లిపోయిన చరిత్ర తమిళనాడుది. అగ్రవర్ణాలపై దాడులు చేయాలని, వారిని హననం చేయాలంటూ పెరియార్ 1957లోనే చేసిన ప్రకటనపై నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మండిపడుతూ, ముఖ్యమంత్రి కామరాజ్ నాడార్‌కు లేఖ రాశారు.

"పెరియార్ బ్రాహ్మణ వ్యతిరేక వ్యాఖ్యలనే కాక, వారిని హననం చేయాలని ప్రజలను పదే పదే రెచ్చగొడుతున్నారనే విషయం నా దృష్టికి వచ్చింది, 'ఇది నేరపూరిత మనస్తత్వం లేదా ఉన్మాదం', ఇలాంటి మాటలు సమాజంపైనే కాక యావత్ దేశంపై దుష్ప్రభావాన్ని చూపుతాయి" అని ఆ లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. ఇటు సంఘవ్యతిరేక, నేరపూరిత శక్తులు తమ ఇష్టం వచ్చినట్టు మాట్లాడవచ్చు, ప్రవర్తించవచ్చని భావిస్తుంటాయని, కనుక సమాజంలో దుర్ఘటనలు చోటు చేసుకోక ముందే పెరియార్ వంటి ఉన్మాదులను పిచ్చాసుపత్రిలో వేసి, అక్కడ వారి వక్రబుద్ధికి చికిత్స చేయించాలంటూ" ఆయన ఆ లేఖలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఒక్క లేఖ చాలు పెరియార్ రామస్వామి ఎటువంటి




వ్యక్తో అర్థం చేసుకోవడానికి. అయినప్పటికీ, అతడు ఆగలేదు. 1971లో రాముల వారి చిత్రపటాలకు చెప్పుల దండవేసి ఊరేగించడమే కాదు, దేవుడి విగ్రహాలను ధ్వంసం చేయాలంటూ ప్రోత్సహించిన ఉన్మాది, అసురప్రవృత్తి కలిగినవాడు. వెనుకబడిన తరగతులకు చెందిన వారు అధికంగా ఉన్న రాష్ట్రంలో పెరియార్ తన నీచ ప్రచారాలతో కులాల మధ్య చీలిక తీసుకువచ్చాడు. అంతే అప్పటి నుంచి ద్రవిడ రాజకీయాలకు తిరుగులేకుండా పోయింది.

ఆ వారసత్వంతోనే ఇటీవల భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ పేరుతో సనాతన ధర్మాన్ని డెంగ్యూ, మలేరియా వ్యాధులతో పోలుస్తూ, కుల వ్యవస్థను ప్రోత్సహించే దానిని నిర్మూలించాలని ముఖ్యమంత్రి స్టాలిన్ కుమారుడు ఉదయనిధి ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, ఇప్పుడు దేశంలోనే కాదు తమ

డి. అరుణ

# పునర్వైభవానికి నాంది

రాష్ట్రంలో కూడా పరిస్థితులలో మార్పు వచ్చిందనే విషయాన్ని ఆయన గ్రహించలేకపోవడంతో, ప్రజలు దానిని ఒకప్పటిలా స్వీకరించలేదు. వారు వెంటనే, ఇటువంటి వ్యాఖ్యలు చేసే వ్యక్తి శాసనసభ్యుడిగా ఎలా కొనసాగుతాడంటూ మద్రాసు హైకోర్టులో కేసువేశారు. ఈ కేసు విచారణ సందర్భంగా, ఏ ఆధారంతో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారంటూ కోర్టు ప్రశ్నించింది. ఏ సాహిత్యంలో ఈ విషయాలు ఉన్నాయి, ఏ గ్రంథాల పరిశోధన ఆధారంగా ఈ ప్రకటనలు చేస్తున్నావంటూ ఉదయనిధిని హైకోర్టు న్యాయమూర్తి ప్రశ్నించి, మండిపడ్డప్పటికీ, ఉదయనిధి మాత్రం తానేమీ తప్పు మాట్లాడలేదని




సమర్థించుకోవడాన్ని చూశాం.

**హిందూ వ్యతిరేక, మతాంతరీకరణ విత్తులు చల్లిన డచ్, బ్రిటిష్ పాలకులు**

ఒకనాడు చోళుల కాలంలో ఒక ధార్మిక ప్రాంతంగా విలసిల్లిన తమిళనాట ఉన్నన్ని గొప్ప ఆలయాలు దేశంలో మరెక్కడా కనిపించవు. అంతటి, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కేంద్రంగా విలసిల్లిన తమిళనాడులో బ్రిటిష్ వారు అడుగుపెట్టడమే దాని పతనానికి తొలిమెట్టు అని భావించవచ్చు. ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారి ఫ్రాన్సిస్ డే 1636లో బంగాళాఖాతం బీచ్ పక్కగా మూడు చదరపు కిలోమీటర్ల భూమిని పొందేందుకు నాయక్ వంశ రాజుతో ఒప్పందంపై సంతకం చేసినప్పుడే 'మద్రాసు' పుట్టిందని చరిత్ర చెబుతోంది. వారికి ముందే వచ్చిన బుడతకీచులు మైలాపూర్ సముద్ర తీరంలో 16వ శతాబ్దంలో నిర్మించిన కపిలేశ్వర ఆలయాన్ని ధ్వంసం చేసి శాంథోమ్ కేథలిక్ చర్చిని నిర్మించారు. సెయింట్ థామస్ క్రీ.శ.73లో భారత్‌కు వచ్చి ఇక్కడే మరణించడంవల్లే ఆ చర్చిని నిర్మిస్తున్నామంటూ మతాంతరీకరణ కోసం అబద్ధపు ప్రచారాన్ని చేశారు. కాగా, సెయింట్ థామస్ దక్షిణ భారతాన్నే సందర్శించలేదని 2006లో పోప్ బెనడిక్ట్ -16 స్పష్టం చేసినప్పటికీ, ఏ ఒక్క ప్రభుత్వమూ దీనిపై చర్చివారిని ప్రశ్నించే సాహసం చేయలేదు. ఇక బ్రిటిష్‌వారు కూడా తమ పాలనాకాలంలో తమ స్వార్థ ప్రయోజనాల కోసం పెరియార్ వంటివారిని ప్రోత్సహించడమే నేటి దుస్థితికి కారణమైంది.

**ప్రభుత్వ గుప్పిట నుంచి ఆలయాలను విడిపించేందుకు పోరాటం**

భారతదేశంలో మైనార్టీ మతానికి సంబంధించిన ప్రదేశాలు తమ ఆదాయాన్ని ప్రభుత్వానికి లెక్క చెప్పడం కానీ, వాటి నిర్వహణను ప్రభుత్వం చేతికివ్వడం కానీ కనిపించదు. కానీ హైందవ ఆలయాల మీద ప్రభుత్వ పెత్తనం ప్రతి రాష్ట్రంలోనూ మనకు కనిపిస్తుంది. వామపక్షవాదుల నుంచి పెరియార్‌వాదుల వరకూ, భగవంతుడిపై విశ్వాసం లేదని చెప్పే పార్టీల గుప్పిట్లో హిందువుల ఆలయాలు ఉండటం, అక్కడి అర్చకుల దుస్థితి, మన కళ్లెదుట కనిపించే సత్యం.

తమిళనాడులో కొన్ని జైనమందిరాలు, పలు మతాలు సహా దాదాపు 44,121 ఆలయాలు ఉన్నాయి. వీటన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వ హిందూ దేవాదాయ, ధర్మాదాయ చట్టం కింద నిర్వహిస్తోంది. ఈ హిందూఆలయాలు, మతాలలో హిందువులు పవిత్రంగా భావించి, పోటెత్తే ఆలయాలు, మతాలు అనేకం ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఆలయాలకు వచ్చే వందల,వేల కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వాలు మింగివేయడమే కాకుండా, ఆ ఆలయాలకు ఉన్న ఆస్తులను కొంతమేరకు అమ్మే శారు. కొన్నింటిలో ప్రతిఘటన ఎదురవుతున్నది. అందుకే ఆలయాల నిర్వహణను ప్రభుత్వ గుప్పిట్లోంచి బయటపడేయాలని పలువురు ప్రముఖులు ప్రయత్నం చేస్తున్నారు. రాజకీయ నాయకుడు సుబ్రహ్మణ్య స్వామి, ఆధ్యాత్మిక గురువు జగ్గి వాసుదేవ్ వంటివారు చేస్తున్న ప్రచారం ఈ కోవలోకి వచ్చేదే.

**చిదంబరం రగడ**

తమిళనాడు రాష్ట్రం, చిదంబరం పట్టణంలోని ప్రసిద్ధ శివాలయాలలో ఒకటైన తిల్లై నటరాజ ఆలయాన్ని 10వ శతాబ్దంలో చోళరాజులు నిర్మించారు. అప్పటి నుంచి ఆలయానికి ధర్మ కర్తలుగా పోడు దీక్షితార్లు వ్యవహరిస్తూ వస్తున్నారు. బ్రాహ్మణులలో ఒక వర్గమైన దీక్షితార్లకు ఈ ఆలయపగ్గాలను నాటి రాజులు, తర్వాత బ్రిటిష్ వారు ఇచ్చారు. ఈ ఆలయానికి ప్రపంచం నలుమూలల నుంచి శివభక్తులు వస్తుంటారు. అయితే, 1982లో తమిళనాడు ప్రభుత్వం ఆలయ నిర్వహణ కోసం ఒక కార్యనిర్వాహణాధికారిని నియమించేందుకు ప్రయత్నించగా, అందుకు అభ్యంతర పెడుతూ దీక్షితార్లు కోర్టుకు వెళ్లారు. దాదాపు మూడున్నర దశాబ్దాల అనంతరం సుప్రీం కోర్టు దీక్షితార్లకు అనుకూలంగా 2014లో తీర్పు ఇచ్చింది. ఆ ఆలయాన్ని సంప్రదాయకమైన, శాఖాపరమైన ఆలయంగా ప్రకటించి, దానికి నిర్వాహకులుగా దీక్షితార్లు ఉండవచ్చని తీర్పు చెప్పింది. అయినప్పటికీ, రాష్ట్రప్రభుత్వం మాత్రం ఆ ఆలయాన్ని తన పరిధిలోకి తీసుకురావాలన్న పట్టు దలతో రకరకాల నిందలు దీక్షితార్లపై వేస్తూ వేధిస్తోంది.

**యునెస్కో నివేదిక**

ఇది ప్రముఖ, భారీ ఆలయాల పరిస్థితి అయితే, ఒక మాదిరి నుంచి చిన్న స్థాయి వరకు అనేక ఆలయాలు సరైన నిర్వహణ లేక నిర్లక్ష్యానికి గురై విస్మరణకు గురవుతున్నాయి. తమిళనాడు ప్రభుత్వం హైకోర్టుకు సమర్పించిన నివేదిక ప్రకా రం, దాదాపు 11,999 ఆలయాలు కనీసం ఒక్క పూజ కూడా జరగక మూతపడు తున్నాయి. 34వేల ఆలయాలు ఏడాదికి వచ్చే రూ.10వేల ఆదాయంతో కొట్టు మిట్టాడుతున్నాయి. 37వేల ఆలయాల్లో పూజ, నిర్వహణ, భద్రత తదితరాల కోసం ఒకే వ్యక్తి ఉంటున్నాడుట. తగిన సమయానికి ధూపదీప, నైవేద్యాలు జరక్కపోవడం, ఆలయానికి తగిన భద్రత లేకపోవడంతో జాడపట్టలేని విధంగా విగ్రహాలు, నగలు, ఆస్తుల చోరీ కొనసాగుతున్నాయి. ఆలయ ఆస్తుల దుర్వినియోగం, లూటీ యధేచ్ఛగా సాగిపోతున్నాయి. రాజకీయ అండదండలతో లెక్క లేనన్ని భూకబ్జాలు జరుగుతున్నాయి.అర్చకులకు డబ్బే కాదు గౌరవం లేకుండాపోవడంతో ఆలయ నిర్వహణ సరిగా లేక భక్తులు నిరాశకు లోనవు తుంటారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన టిక్కెట్టు కొని దర్శనం చేసుకునే విధానం కూడా ఒక రకంగా భక్తుల మధ్య వివక్ష చూపడమే. అందరూ కొనగలవారు ఉండరు కదా? వేల ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయని యునెస్కో నివేదిక 2017లోనే పేర్కొంది. ఈ ప్రాచీన ఆలయాలను సరిగా నిర్వహించకపోవడం, సరైన మరమత్తులు చేయించకపోవడంతో అక్కడి విగ్రహాలు, శిల్పాలు చోరీకి గురవుతున్నాయని నివేదిక తెలిపింది. ఈ నేపథ్యంలో ఇటీవలే మద్రాసు హైకోర్టు ఇచ్చిన తీర్పు ఆలయ పునరుద్ధరణలో తొలి అడుగుగా భావించవచ్చు. ★

# అద్భుత నిర్మాణం బృహదీశ్వరాలయం

హిందూ దేవాలయాలు పిక్నిక్ స్పాట్‌లు కావంటూ మద్రాసు హైకోర్టు అక్కడ దేవాదాయ శాఖకు మొట్టికాయలు వేయడానికి కారణం, తంజావూరులోని అతి గొప్ప ఆలయమైన బృహదీశ్వరాలయంలోకి అన్యమతస్తులు ప్రవేశించి, మాంసాహారాన్ని భుజించారంటూ పత్రికలలో వార్తలు రావడమే. మొదటి రాజ రాజ చోళుని కాలంలో నిర్మితమైన అత్యంత పురాతన ఆలయాలలో ఒకటైన తంజావూరులోని బృహదీశ్వరాలయం సహా అన్ని ఆలయాలను సరిగా పరిరక్షించి, నిర్వహించాలని కోర్టు చెప్పింది. కాగా, ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఈ ఆలయ గోపురాన్ని కొందరు ప్రపంచంలోనే ఎత్తైన విమాన గోపురంగా అభివర్ణిస్తుంటారు. పర్యాటకు లను అచ్చెరువుకు గురి చేసే మరొక అంశం ఈ ఆలయం నీడ మధ్యాహ్న సమయంలో కూడా భూమిపై పడదు. సంవత్సరం పొడవునా ఇదే విధంగా ఉండేలా దీనిని డిజైన్ చేశారు.


చెన్నై నుంచి సుమారు 320 కిలోమీటర్ల దూరంలో కావేరీ నదీపై తంజావూరు ఉంది. చరిత్ర కారులకు దొరికిన పురాతన తమిళ గ్రంథాల ప్రకారం ఈ నగరం క్రీస్తు పూర్వం మూడవ శతాబ్దానికి చెందినదని తెలుస్తోంది. చోళుల కాలంలో ఈ పురాతన ఆలయం నిర్మితమైనట్టు అక్కడి శిల్పకళా శైలి చెప్తుంది. సరైన నిర్వహణ లేక శిథిలమవుతు న్నందున దీనిని యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా/ ప్రాంతంగా గుర్తింపు పొందింది.


రాజ రాజ చోళుని కుమారుడు మొదటి రాజేంద్ర చోళుడు గంగైకొండ చోళపురంలో మరో బృహదీశ్వ రాలయాన్ని నిర్మించాడు. ఈ ఆలయం ప్రాచీన ఆలయంకన్నా చిన్నదైనా అందులోని శిల్ప కళా రీతులు, వంటి వాటిలో రెండింటి మధ్యలో పెద్ద తేడా లేదు. ఇతను తండ్రి కంటే ఘనుడు. తన సామ్రాజ్యాన్ని గంగా నది వరకు విస్తరించాడని, అందుకే ఆ ప్రాంతానికి గంగైకొండ చోళపురం అని పేరు పెట్టినట్లు చారిత్రకాధారం. ఈ ఆలయం తంజావూరులోని బృహదీశ్వరా లయం కంటే విశాలమైనది. కాని తన తండ్రి మీద గౌరవంతో ఆలయ శిఖరాన్ని కొంచెం చిన్నదిగా నిర్మించాడుట. ఆలయంలోని శిల్ప కళా రూపాలు చోళుల శిల్ప కళా రీతికి దర్పణాలు. ఆలయం ముందున్న పెద్ద నంది విగ్రహం, గర్భ గుడిలోని 13.5 అడుగుల ఎత్తు 60 అడుగులు విస్తీర్ణంలో వున్న శివలింగం, ఆలయానికే ప్రత్యేక ఆకర్షణ. అంతే గాక ఆలయ గోపురంపై రాజేంద్ర చోళుడు శివ పార్వతుల ఆధ్వర్యంలో పట్టాభిషిక్తుడవుతున్నట్లున్న శిల్పం సహా అనేక శిల్ప కళా రీతులు ఆలయ శోభను ఇనుమడి స్తాయి. ఒకప్పుడు ఇంతటి సువిశాల సామ్రాజ్యానికి కేంద్ర బిందువైన ఈ ప్రదేశం ఇప్పుడు ఒక కుగ్రామం మాత్రమే. ఈ నగరం ఎలా అంతరించిందో చరిత్రకు కూడా అంతు పట్టదు. ఈ చుట్టు ప్రక్కల ప్రాంతాలలో ఇప్పటికి త్రవ్వకాలలో అనేక శిల్పాలు బయట పడుతూ ఆనాటి వైభవాన్ని నేటికీ చాటుతున్నాయి.

వేయి సంవత్సరాల ఆలయాలు దాదాపు పాడుబడిన స్థితిలో ఉంటాయి కానీ ఈ ఆలయం మాత్రం ఇప్పటికీ అత్యద్భుతంగా, కొత్తగా నిర్మించి నట్లు కనిపిస్తుంది. భారతదేశంలోనే అతిపెద్ద శివలింగం ఉన్న శివాలయంగా ఈ ఆలయం ప్రసిద్ధి.

ఈ ఆలయంలో ఎన్నో అంతుచిక్కని రహస్యాలు, వింతలు ఉన్నాయి. 13 అంతస్థులతో నిర్మితమైన ఈ ఆలయ నిర్మాణానికి ఎలాంటి ఉక్కు గాని సిమెంట్ కాని వాడలేదు. ఈ ఆలయం నిర్మాణం పూర్తిగా గ్రానైట్ రాయితో జరిగింది. భారతదేశంలోనే ఎక్కడా లేని విధంగా 13 అంతస్థులు కలిగిన ఏకైక పురాతన క్షేత్రం ఇది. ఇక్కడి శివలింగం ఎత్తు దాదాపుగా 3.7 మీటర్లు ఉంటుంది. అంతేకాదు ఈ ఆలయంలో ఉన్న నందీశ్వరుని విగ్రహం ఎత్తు 2.6 మీటర్లు ఉంటుంది. ఇక ఈ ఆలయ గోపుర కలశం 80 టన్నుల ఏకశిలతో నిర్మించడం మరో విశేషం. ఎవరైనా భక్తులు ఆ ఆలయంలో మాట్లాడుకుంటే ఆ శబ్దాలు ఈ ఆలయంలో మళ్లీ ప్రతిధ్వనించవు. అంతటి శబ్ద పరిజ్ఞానంతో ఈ ఆలయాన్ని నిర్మించారు.

– జాగృతి డెస్క్






# 'అయోధ్య' సంచికతో నా అనుభవాలు

అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ఠ సందర్భంగా జాగృతి ప్రత్యేక సంచిక విడుదల విషయాన్ని తెలిసి కొన్ని సంచికలు తెప్పించి మా పట్టణంలో పంచితే బాగుంటుందన్న ఆలోచన వచ్చింది. అసోసియేట్ ఎడిటర్ దుర్గారెడ్డిని సంప్రదించి 100 ప్రతులు పంపవలసినదిగా కోరాను. వారు ఆ సంచిక విశేషాలు చెప్పిన తరువాత ఇంకా ఎక్కువ ప్రతులు తెప్పిస్తే బాగుంటుందని పించింది. 1000 ప్రతులు అయితే ఒకటి పది రూపాయలని (అసలు వెల రూ. 25) చెప్పారు. 1000 ప్రతులు తెప్పించాను. అదే సమయంలో అయోధ్య అక్షింతల వితరణ కూడా జరుగుతోంది. అయోధ్య అక్షింతలు, జాగృతి ప్రత్యేక సంచిక కావల సినవారు సంప్రదించండి అని వాట్సాప్ గ్రూపులలో మెసేజ్‌లు పెట్టాను. విశేష స్పందన వచ్చింది. విశాఖపట్నం, విజయవాడ, నెల్లూరు, చిత్తూరు, హిందూపురం, హైదరాబాదు లాంటి స్థలాల దగ్గర నుంచి పత్రిక కావాలని మెసేజ్‌లు పెట్టారు. వాళ్లందరికీ కొరియర్ సర్వీసులో ప్రత్యేక సంచిక, రామ అక్షితల ప్యాకెట్లు, అయోధ్య మందిర ఫోటో, కరపత్రం సుమారు 13 మందికి పంపాను. వాటిని అందుకున్న వాళ్లందరూ చాలా ఆనందపడి, 22వ తారీకు జరుపుకున్న రామఉత్సవ కార్యక్రమం విశేషాల ఫోటోలను పంపారు. కొద్దిమంది వాళ్ల రచనలతో కూడిన పుస్తకాలను కానుకగా పంపారు. తిరుపతిలో స్వయంసేవకులు జాగృతిని అఖండ హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతున్న ప్రాంగణంలో పెడితే భక్తులు 25 రూపాయలకు తీసుకున్నారు. నేను మాత్రం 1000 ప్రతులనీ పది రూపాయల వంతునే ఇచ్చాను. కొరియర్ చార్జీలు నావే. వీటి వేగం చూసి ఇంకొక 1000 కూడా తెప్పిస్తే బాగుండునని దుర్గారెడ్డిని సంప్రదించాను. హనుమాన్ చాలీసా అఖండ పారాయణం జరుగుతున్న ప్రాంగణంలో అమ్మిన పుస్తకాల ఆధారంగా చాలామంది నాకు ఫోన్లు చేసి పుస్తకాలు కోరారు. శిశు మందిర్ ప్రధానాచార్యులు నాగరాజు మారుమూల పల్లెలల్లోకి వెళ్లి 100 పుస్తకాలను అందరికీ ఇచ్చారు. విశాఖపట్నం నుంచి ఒక సోదరి ఐదు ప్రతులు కావాలనీ, హిందూపురం నుంచి రఘురామయ్య అనేవారు అక్షింతలు, జాగృతి పంపాలనీ కోరారు. ఇలా కోరిన 12 మందికి అక్షింతలు, రామమందిర ఫోటో, కరపత్రం, జాగృతి ప్రత్యేక సంచిక కలిపి పంపాను. సంచికలన్నీ అయిపోయాయి. ఏడు లేదా ఎనిమిదింటిని మాత్రం నేను ఉంచుకున్నాను. ఇప్పటికి కూడా కొద్దిమంది ఫోన్లు చేసి వాళ్ల చిరునామాలు ఇచ్చి పంపమని అడుగుతున్నారు. వాళ్లకి నేను ఫోన్ చేసి ఒక కాపీ ఇవ్వగలను అని చెప్పి, నా దగ్గర ఉన్న ఆ కాపీలని ఇప్పటికీ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నాను.


ఈ సంచిక చదివిన వాళ్లు దానిలోని గొప్ప విషయాలు తెలుసుకొని, చదవటం సరే, ఇంట్లో కచ్చితంగా ఉండవలసిన పుస్తకమని పదిలంగా దాచుకుంటున్నారు. ప్రతిష్ఠ తరువాత 29వ తారీకు జనవరికి రాబోయే పత్రికను కూడా ముందస్తుగానే రిజర్వు చేసుకున్నారు. జనవరి 29న వచ్చే పత్రికల్ని కూడా వెయ్యి కాపీలుకి ఆర్డరు పెట్టాం. తిరుపతి పట్టణంలో ప్రముఖ కూడళ్లలో ఉన్న బుక్ స్టాల్స్‌లో కూడా ఈ ప్రతులను ఉంచాం. మన కార్యకర్త, పురోహితుడు గిరిప్రసాద్, ఎస్ వి యూనివర్సిటీ ఉద్యోగి 22న ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం రోజు ఒక పెద్ద రామ ఉత్సవ కార్యక్రమాన్ని శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీలో జరిపి ఆ కార్యక్రమంలో సుమారుగా 100 కాపీలను వితరణ చేశారు. ప్రతాప్ రామ్ హిందీ స్వయంసేవక్ అయినప్పటికీ, 100 కాపీలను వారికి పరిచయం ఉన్న తెలుగువారికి ఇచ్చారు. నేను నడుపుతున్న యోగ కేంద్రంలోని పెద్దలకు ఈ కాపీలను మన పూర్వ ప్రాంత సంఘచాలక్ సుందరమూర్తి ద్వారా ఆవిష్కరించి వారందరికీ ఇచ్చాం. మర్నాడు ఒక్కొక్కరు రెండు లేక మూడు లేక నాలుగు చొప్పున అదనంగా కాపీలను తీసుకొని వాళ్ల బంధువులకి స్నేహితులకి ఇచ్చారు. దీనికి కూడా ఒక సోదరి చిత్తూరు నుండి తనకు ఒక కాపీని పంపమని అడిగితే నేను కొరియర్ సర్వీసులు అక్షితలతోపాటు పంపాను. ఆమె, శ్రీమతి శాంతా దేవి. ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు గ్రహీత. నేను పంపిన జాగృతి సంచిక అందుకొని సంతోషపడి తిరిగి కొరియర్లో వారు రచించిన భగవద్గీత, భారతం పుస్తకాలను నాల్గింటిని ఉచితంగా పంపారు. విశాఖపట్నం నుంచి శ్రీమతి జ్యోతి మెసేజ్ ద్వారా నన్ను సంచిక పంపమని కోరితే, పంపాను. వారు ఆ పుస్తకాన్ని అందుకొని 22వ తారీఖున వాళ్ల ఇంట్లో నిర్వహించుకున్న రామ మహోత్సవము, దీపోత్సవము కి సంబంధించిన ఫోటోలను కూడా నాకు పంపి వారి సంతోషాన్ని పంచుకున్నారు. అనంతపురం జిల్లా హిందూపురం నుంచి రఘురామయ్య ఈ సంచిక కూడా కాపీ పంపాలి అని కోరితే, వారికీ పంపాను. నేను ఒక 5 లేక 6 పుస్తకాలను అట్టే పెట్టుకున్నాను. నిన్నటి రోజున తిరుపతి వాస్తవ్యులు ఎవరో నా నంబరు ఎక్కడ సేకరించి ఉన్నారో తెలియదు. నాకు ఫోన్ చేసి, హనుమాన్ చాలీసా అఖండ పారాయణం దగ్గర ఆ సంచిక అమ్మడం చూశాను, నాకు అందలేదు. మీరు ఎట్లా అయినా నాకు ఒక్క కాపీని ఇవ్వాలని కోరారు. వచ్చి నా దగ్గర ఉన్న కొద్ది కాపీలలో ఒకటి తీసుకెళ్లమని చెప్పాను.

సోషల్ మీడియాలో, ఎలక్ట్రానిక్ మీడియాలో, ప్రింట్ మీడియాలో వస్తున్న అయోధ్య విషయాల కంటే జాగృతి ప్రత్యేక సంచికలో వచ్చిన విషయాలు చాలా విశేషంగానూ, విలువైనవిగాను, వివరాలతోనూ ఉన్నట్లుగా అంతా భావించి కోరి, తీసుకెళ్లిన సందర్భాలు చాలా ఉన్నాయి. మన తిరుపతి జ్యేష్ఠ కార్యకర్త వెంకయ్య 100 పుస్తకాలు తీసుకెళ్లి కార్యకర్తలకి, కొత్త వాళ్లకి వితరణ అందించారు. తిరుపతి జిల్లా కార్యవాహ మహేష్ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి కార్యకర్తలని మన దగ్గరికి వచ్చి ఆ పుస్తకాలు తీసుకెళ్లి జిల్లాలోని గ్రామ గ్రామాలలో పంచేలా చేశారు. ఈ అద్భుతమైన కార్యంలో సుమారు 18 మంది ఘట నాయకులుగా రామ సేవ చేశారు. ఈ విధంగా చాలా అద్భుతమైన అనుభవాలు చూశాం.

**-గల్లా సురేష్ స్వయంసేవక్, తిరుపతి**

జాగృతి ప్రత్యేక సంచిక పట్ల ఇంతటి ఆదరాభిమానాలు చూపించి, అందరికీ పంచినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు. మీ అనుభవాలు మాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చాయి. మా ప్రయత్నం ఇంత విజయం సాధించినందుకు సంతోషంగా కూడా ఉంది. ఈ అభిమానం ఇలాగే కొనసాగాలని కోరుతున్నాం.

**-అసోసియేట్ ఎడిటర్**




11

# రామాయణం నాటి మంత్రి వ్యవస్థ

అమాత్య సమితి హిందూరాజ్య పద్ధతి. హిందూరాజ్య పద్ధతిలోని చిరపరిచితమైన ఒక ప్రత్యేకత. ఈ సమితి జీవనోపాధి కోసం రాజుపై ఆధారపడి ఉంటుంది. అధికారంలో, దృష్టిలో అది రాజుకన్న తక్కువ శ్రేణికి చెందినది కనుక రాజు అధికారాలపై దాని నియంత్రణ ఉండదు. రామాయణంలో ఈ సమస్యకు పరిష్కారంగా మరొక పద్ధతి ఏర్పాటైంది. త్యాగ వైరాగ్య సంపదల వల్ల శ్రీసంపన్నులు, జ్ఞానమయులు, జీవనోపాధి కోసం రాజ్యతంత్రంపై ఆధారపడని వ్యక్తులతో కూడిన ఒక వర్గం రాజ్యతంత్రాన్ని అదుపులో ఉంచడానికి ఏర్పడి ఉంది. దీనినే 'మంత్రి సంస్థ' అనేవారు. మంత్రి, ఆమాత్యుడు అనేవి రెండు ప్రత్యేక సంస్థలను సూచించేవే తప్ప పర్యాయపదాలు కావు. పైన మంత్రి సంస్థ, కింద ప్రత్యక్షంగా రాజ్యంచేసే అమాత్య సంస్థ. వీటి మధ్య రాజు. ఇది రామాయణంలో రాజ్యపద్ధతి.

"ఆ రాజుకు రుషులు, రుత్విజులు అయిన, వశిష్ఠుడు, వాయుదేవుడు, సుయజ్ఞుడు, జాబాలి, కౌశ్యపుడు, గౌతముడు, మార్కండేయుడు, కాత్యాయనుడు మంత్రులు" అని వాల్మీకి వర్ణిస్తాడు. ఇలా అష్టమంత్రుల వ్యవస్థ ఉండేది.

ఈ మంత్రి సంస్థకు ముఖ్యుడు వశిష్ఠుడు. ఆయన రాజుకు మతోపాధ్యాయుడు, పురోహితుడు. ఆయన అధికారం సర్వశ్రేష్ఠంగా ఉండేది.

విశ్వామిత్ర మహర్షి రామ, లక్ష్మణుల సహాయం అడిగినప్పుడు దశరథుడు ప్రతిజ్ఞ భంగానికికైనా సిద్ధపడతాడు కానీ, కుమారులను పంపడానికి అంగీకరించడు. అప్పుడు వశిష్ఠుడు 'ధర్మాన్ని త్యజించడం నీకు తగదు. నీకు ఎంత బాధ కలిగినా స్వధర్మానికి అనుగుణంగానే ప్రవర్తించాలి. చేసిన ప్రతిజ్ఞను, ఇచ్చిన మాట తప్పితే నీవు నేటివరకు సంపాదించిన పవిత్రతకు కళంకం ఏర్పడుతుంది. కనుక వెంటనే రాముని ఇచ్చి పంపు' అని నచ్చచెప్పి రాజుతో అలా చేయిస్తాడు.

**వశిష్ఠ మహర్షి కర్తవ్యనిష్ఠ**

ఉత్తరకాండలో వశిష్ఠుని నిరపేక్షమైన తేజస్విత, రాజశక్తిపై ఆయన అధికారం మరింత స్పష్టంగా వర్ణితమైంది. కలిపురుషుడు, రుషివేషంలో రామచంద్రునితో ఏకాంతంగా మాట్లాడటానికి వస్తారు. తమ సంభాషణ జరిగే సమయంలో అక్కడికి ఇతరులెవరూ రాకూడదనీ, అందుకు భిన్నంగా జరిగితే వారికి మరణదండన విధించాలనే నియమాన్ని విధించాడు. రాముడు తన తమ్ముడు లక్ష్మణుడిని ద్వారం వద్ద ఉంచుతారు. అంతలో అక్కడికి వచ్చిన దుర్వాసముని 'రామచంద్రునితో మాట్లాడాలి' అని అంటాడు. లక్ష్మణుడు ఆయనకు వృత్తాంతమంతా వినిపించి, కొద్దిసేపు ఆగవలసిందని ప్రార్థించాడు. ముక్కోపి అయిన ముని అతనిమాట వినిపించుకోలేదు. 'ఇప్పుడే రాముని కలుసుకోవాలి. అలాకాకపోతే నగరాన్ని భస్మం చేస్తాను' అని అన్నాడు. అయోధ్య ప్రజల కోసం తాను బలై వారిని రక్షించాలని నిశ్చయించాడు. రాజాజ్ఞను ఉల్లంఘించి, కాలపురుషుడు శ్రీరాముడు సంభాషణ జరుపుతూన్న స్థలానికి వెళ్లి, దుర్వాసుని ఆగమన వార్త వినిపిస్తారు. వాస్తవానికి అప్పటికి వారి సంభాషణ పూర్తయింది. వారు బయటికి రావడానికి తయారవుతున్నారు. కనుక లక్ష్మణుని అపరాధం కేవలం నామమాత్రమైనదే (Technical fault) కాని సమాజ వికాసం చరమ స్థాయిని అందుకున్నప్పుడు సమాజ వ్యవస్థలో ధర్మనియమాల అతిక్రమణకు స్థానం ఉండదు. అపరాధి లక్ష్మణునికి ఏమి శిక్ష వేయాలనే విచిత్రమైన సమస్య శ్రీరామునికి ఏర్పడింది. లక్ష్మణుని గొప్పతనం అతడు చేసిన అగణితమైన ఉపకారాలు, ఆతని అపరాధం నగణ్య నామమాత్ర స్వరూపం వీటన్నిటి దృష్ట్యా ఆ అపరాధాన్ని పెద్దగా పట్టించుకోకపోవడమే ఉచితం కావచ్చు. ఈ విషయం అయోధ్య ప్రజలను అడిగితే వారు లక్ష్మణుని క్షమించాలని నిర్ణయిస్తారు. లక్ష్మణుడు ఆ అపరాధాన్ని కావాలని లేదా ఉన్మత్తుడై చేశాడా? అతడు ఈ పనిచేయడానికి వెనుకగల ఉదాత్త లక్ష్యం లోక కల్యాణమే. శ్రీరాముడు తన హృదయాన్ని ప్రశ్నించినా లక్ష్మణుని నిరపరాధిగా పరిగణించి పదలివేయాలనే నిర్ణయం చేసి ఉండేది ఆ హృదయం.


**–రామచంద్ర రామానుజ**

**జాగృతి 31.08.1964 సంచిక నుంచి**




సప్త చిరంజీవులు

# త్రిమూర్త్యావతారుడు వ్యాసరుషి



వ్యాసమహర్షిని రుషులు, జ్ఞానులు, మునులు త్రిమూర్త్యావతారంగా భావించారు. సాక్షాత్ శ్రీమన్నారాయణుడే ఆయన రూపంలో అవతరించి తమ కావ్యాల ద్వారా విష్ణుభక్తిని లోకానికి చాటారని రుషులు, జ్ఞానులు, మునులు కీర్తించారు. నాలుగు తలలులేని బ్రహ్మగా, రెండు చేతులు కలిగిన హరిగా, ఫాలనేత్రం లేని శివుడిగా భగవత్ స్వరూపంగా భావించి,అర్చిస్తున్నారు. శ్రీమత్ మహాభారతం పంచమవేదమని ('భారతం పంచమో వేదః), అక్ష(ర)య విజ్ఞాన సరస్వమని, ప్రపంచ వాఙ్మయంలోనే గొప్ప గ్రంథమని ప్రశంసలు అందుకుంది. **'యది హాస్తి తతన్యత్ర యన్నే హాస్తి న తత్క్వచిత్'...** భారతంలో లేనిది ఈ భూమిపై లేదు. భూమిపై ఉన్నదంతా భారతంలో ఉంది' అంటూ విఘ్నదేవుడు గంటం పట్టగా దాదాపు లక్షకు పైగా శ్లోకాలను ఆశువుగా ఈ మహాకావ్యాన్ని ఆవిష్కరించి, 'జయం'అని నిర్దేశించారు.తమ శిష్యుల ద్వారా 'జయం' భారతంగా, 'మహా' భారతంగా విస్తరించింది. భారత కథను దేవలోకంలో విస్తరించే బాధ్యతను నారదుడికి, పితృలోకంలో చెప్పేందుకు శిష్యుడు దేవలుని, గరుడ, గంధర్వ, యక్షరాక్షసలోకాలలో తెలియబరచేందుకు కుమారుడు శుకుని, భూలోకంలో జనమేజయునికి భారతకథను వినిపించడానికి మరో శిష్యుడు వైశంపాయుడిని పంపారు. వేదం తరువాత వేదోక్త ధర్మాన్ని ప్రతిపాదించేందుకు భారతమే ప్రామాణికమని కీర్తిపొందింది. వేద విభజన, ఆధ్యాత్మ రామాయణ రచన ద్వారా సకల ధర్మాలను వివరించి,

# గుప్త సామ్రాజ్యంలో వేదభాష్య రచన

**11**

భారతేతిహాసంలో స్వర్ణయుగమని ప్రసిద్ధి పొందిన గుప్తసామ్రాజ్య కాలంలో వేద భాష్య రచనా ప్రయత్నము ప్రారంభమైనది. బౌద్ధ యుగంలో నివురుకప్పిన నిప్పులా ప్రచ్ఛన్నమై ఉన్న వైదికమతం గుప్త సామ్రాజ్య భానూదయంలో నూతన తేజమును సంతరించుకొని పూర్వాధిక కాంతితో ప్రకాశింప సాగినది. వేద స్వరూపం, వేదార్థం, వేదాశయం... పండిత సామాన్యులకు అందుబాటులో ఉండేందుకు మొదట వేదభాష్య నిర్మానానికి స్కందస్వామి పూనుకొనినారు.

స్కందస్వామి గుజరాత్ రాజధాని వల్లభి నగర నివాసి తండ్రి భర్తృధ్రువుడు. శతపథ బ్రహ్మ భాష్య కారుడైన హరిస్వామికి గురువు. సాధారణ శవం 625 ప్రాంతం వాడు. హర్ష, బాణభట్టుల సమ కాలీనుడు. ఇతడు రుక్ సంహిత యేకాక శ్రీ యాస్కాచార్యుల నిరుక్తమునకు కూడ వ్యాఖ్య రచించెను.

రుగ్వేద సంహితకు లభించే భాష్యాలలో ప్రథమ ప్రాధాన్యమైనది శ్రీ స్కంద స్వామి భాష్యమే. ప్రతి సూక్తం ప్రారంభంలో ఆ సూక్తసంబంధి రుషి, దేవతలను తెల్పుతుంది. కలసినచోట నిరుక్త నిఘంటు ప్రమాణములను చూపుతుంది. వ్యాకరణ వివరణ అత్యవసరమైన స్థలంలోనే ఉంటుంది తప్ప విసుగు కలిగించదు. ఆర్వాచీనమైన శ్రీ సాయణాచార్యుల భాష్యంపై దీని ప్రభావ ప్రతిభా ముద్రలు స్పష్టముగ కనిపిస్తాయి. రుక్ సంహితలో నాల్గవ అష్టకం వరకే స్కందస్వామి భాష్యం లభిస్తుంది. మిగిలిన భాగాలను ఇరువారు ఆచార్యులు పూర్తి చేశారు.

**నారాయణుడు**

**"స్కందస్వామి నారాయణ ఉద్గీత ఇతి తేక్రమాత్ చక్రుః సహైక మృగ్భాష్యం పదవాక్యార్థ గోచరం"**

(స్కందస్వామి, నారాయణ, ఉద్గీథ అనేవారు రుగ్భాష్యాన్ని క్రమముగా రాశారు.) అని రుగ్వేద భాష్యంలో శ్రీ వెంకట మాధవులు రాయడం వలన నారాయణుడను వారు ఋగ్భాష్యాన్ని రాసినట్లు తెలుస్తుంది. క్రమంగా అనడం వలన స్కందస్వామికి పూరకముగ 5.6 అష్టకాలను చేసి ఉండవచ్చు. ఆయన గురించి విశేషాంశాలు లభ్యంకావడం లేదు.

**ఉద్గీథాచార్యుడు**

శ్రీ వేంకట మాధవుల శ్లోకాన్ని అనుసరించి ఉద్గీథాచార్యుడు రుగ్వేద అంత్య భాగానికి భాష్య రచన చేశారని తెలుస్తున్నది. అధ్యాయం అంతంలో తనను గురించి "వనవాసి వినిర్గ తాచార్యస్య ఉద్గీథస్యకృ ఋగ్వేదభాష్యే..! ఆధ్యాయః సమాప్తః"అని ఉంది. ప్రాచీనకాలంలో కర్ణాటక దేశానికి పశ్చిమ భాగానికి 'వనవాసి' అని పేరు ప్రసిద్ధమే, అందువలన ఇతడు కర్నాటక ప్రాంతవాసిగా ఊహింపవచ్చును. ఆయన గురించి ఇంతకంటే చరిత్ర కాంశాలు ఏమీ లభించుడం లేదు. శ్రీ సాయణాచార్యులు శ్రీ ఆత్మానందులును తమ తమ భాష్యాలలో పేర్కొన్నారు. ఆయన భాష్య కథనా విధానం మిక్కిలి ప్రశంసనీయమైనది.




**మాధవభట్టు**

వేద భాష్యకారులలో మాధవనామాలు కలవారు నలుగురున్నారు. ఒకరు సామవేద సంహితకు భాష్యం రాశారు. కనుక ముగ్గురికే రుగ్వేద భాష్యంతో సంబంధం ఉంది. వీరిలో ఒకరు సాయణమాధవులే (సాయణాచార్యులు మాధవుని పేరిట రాయడం వల్ల అభేద ప్రతిపత్తి) పరస్పర సంబంధ బాంధవ్యాలు ఉండడం వల్ల సాయణాచార్యులను ఒక మానవునికి గా గ్రహించాలి. మిగిలిన ఇద్దరిలో ఒకరు వెంకటమాధవులు కాగా, మరొకరు, మాధవభట్టు.

ఈ మాధవభట్టు ప్రథమాష్టక భాష్యాన్ని మద్రాసు విశ్వ విద్యాలయం ప్రకటించింది. ఇది అత్యల్ప మైనప్పటికీ, గంభీర అర్థంతో మనోహరంగా ఉంటుంది. మాధవభట్టు, వెంకట మాధవుడు అనే పేర్లు కలవారు ఒకరే కాని భిన్నులు కారని కొందరంటారు. కాని వీరి భాష్యాలను పరిశీలిస్తే మాధవభట్టు వెంకటమాధవుని కంటే ప్రాచీనుడని భాష్యాఆలు భిన్నకర్తృకాలని స్పష్టంగా తెలుస్తుంది.

**–యలమండ్రి సుబ్రహ్మణ్యశాస్త్రి**

**'జాగృతి' 03.01.1966 సంచిక నుంచి**

---

మనిషి ఎలా జీవించాలి? ఎలా జీవించకూడదు? అనే అంశాలను కథలో రూపంలో ఆవిష్కరించిన ఆయన అంతటితో సంతృప్తి చెందలేదు. చిత్తశాంతి లోపించి వ్యాకులపడుతున్న ఆయన, నారద మహర్షి హితవుతో విష్ణుకథలతో కూడిన శ్రీమద్భాగవత రచన చేశారు. లోకంలోని ధార్మిక గ్రంథాలలోని అత్యధిక అంశాలు వ్యాస విరచిత గ్రంథాల నుంచి స్వీకరించినవేనని చెబుతారు. అందుకే 'వ్యాసోచ్ఛిష్టం జగత్సర్వం' అని వ్యవహారంలోకి వచ్చింది. వ్యాసుడి పాదస్పర్శతో తెలుగు నేలపై దాక్షారామ, బాసర తదితర క్షేత్రాలు ఆయన పాదస్పర్శతో పునీతమయ్యాయని ఆధ్యాత్మికవేత్తల భావన. బాసర వద్ద తపస్సు సమయంలో నిత్యం గోదావరిలో స్నానం చేసి తెచ్చిన పిడికెడు ఇసుకతో సరస్వతీ అమ్మవారి విగ్రహాన్ని రూపొందించారని, నేటికీ పూజలందుకున్న అమ్మవారి విగ్రహం వ్యాసుని సృష్టేనని స్థలపురాణం. ఆయన తపస్సు కారణంగా ఆ ప్రాంతం 'వ్యాసపురి'గా, కాలక్రమంలో వాసరగా, బాసరగా ప్రసిద్ధమైంది. ఆంధ్రప్రదేశ్‌లోని దాక్షారామంలో భీమేశ్వరునిపై 'భీమేశ్వరపురాణం' చెప్పాడని అంటారు.'మిమ్ము తరచూ దర్శించుకునే భాగ్యం లేదా?' అని వేదనిధి అనే యువకుడు విన్నవించి నప్పుడు 'నిరంతర జ్ఞానాన్వేషణే నా సమగ్ర స్వరూపం. నన్ను దర్శించాలనే సంకల్పం కలిగి నప్పుడు జ్ఞానం కోసం వెదుకు' అని వ్యాస భగవానుడిని సూచించారట. గురు పరంపరలో ఆయనను ప్రథమ గురువుగా సంభావించి ఆయన జన్మతిథి (ఆషాఢ పౌర్ణమి)ని వ్యాసపూర్ణిమ పాటించడం వేల సంవత్సరాలుగా అనవాయితీగా వస్తోంది.

**–రామచంద్ర రామానుజ**

---

## వివేకానంద సూక్తిశతి

**My brave lads, you are born to do great things! let not the barks of puppies frighten you no not even the thunderbolts of heaven!**



**ధీరవత్సలార ధీరులు మీరంత**
**కుక్క అరుపులేమి లెక్క ధరణి**
**పిడుగులెన్నిపడిన పిండి చేయగలరు**
**వినుడి స్వామి సద్వివేకవాణి!!**



బండిరాజుల శంకర్

# సమగ్రాభి

**కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా ఆరోసారి బడ్జెట్ ప్రవేశపెట్టారు. గత బడ్జెట్‌కు భిన్నంగా 2047 నాటికి 'వికసిత్ భారత్' సాధనే లక్ష్యంగా, సమగ్రాభివృద్ధి దిశగా రూపొందించిన 'సమీకృత సమ్మిళిత' బడ్జెట్ ఇది. ప్రపంచ ఆర్థికవ్యవస్థల్లో భారత్‌ను అగ్రశ్రేణికి చేర్చడానికి సమ్మిళిత సమగ్రాభివృద్ధిపై బడ్జెట్ దృష్టి పెట్టింది. ప్రధానంగా నాలుగు వర్గాల సంక్షేమంపై ఇది దృష్టి పెట్టింది. వారు– పేదలు, మహిళలు, అన్నదాతలు, యువత. వీరు పురోగమిస్తే దేశం పురోగమిస్తుంది. కేవలం 10 ఏళ్లలో దేశ ఆర్థికవ్యవస్థను ప్రపంచంలోనే అతిపెద్ద 5వ ఆర్థిక వ్యవస్థగా వృద్ధి చెందేలా కృషి చేశామని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఎన్నికల ముందు ప్రవేశపెట్టినదే అయినా ఈ బడ్జెట్‌లో ఎలాంటి జనాకర్షక పథకాలు లేకపోవడం గమనార్హం.**

సామాజిక స్థితితో సంబంధం లేకుండా అందరికీ సమానావకాశాలు, వనరులు అందాయి. వనరుల కేటాయింపు కంటే ఎక్కువగా ఫలితాల సాధన పై దృష్టి పెట్టడం వల్ల గత 10 ఏళ్లలో 25 కోట్లమందికి పేదరికం నుండి విముక్తి లభించింది. 2014తో పోలిస్తే తలసరి ఆదాయం రెట్టింపయి, ప్రస్తుతం రూ. 1.74 లక్షలకు చేరిందని నిర్మలా సీతారామన్ వెల్లడించారు. సాంకేతిక విజ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థను నిర్మించడమే బడ్జెట్ లక్ష్యమని మంత్రి తెలియచేశారు. ఈ లక్ష్య సాధనకు ప్రజా భాగస్వామ్యం (జన్ భాగి దారి) సబ్ కా సాథ్, సబ్ కా ప్రయాస్ (అందరితో కలిసి అందరి కృషి) సబ్ కా వికాస్ (అందరివికాసం) అవసరాన్ని గుర్తించారు. పౌరులకు విస్తృత అవకాశాలు కల్పించడం, మెరుగైన ఉపాధి అవకాశాలు, వృద్ధి రేటు పెరుగుదల, స్థిరమైన సూక్ష్మ ఆర్థికవ్యవస్థ బలోపేతం వంటి చర్యలతో బడ్జెట్ లక్ష్యాల సాధనకు కేటాయింపులు చేశారు.



నిర్మలా సీతారామన్

### ప్రాధాన్యాలు

మధ్యంతర బడ్జెట్‌ను ఏడు ప్రాధాన్యలతో రూపొందించారు. 1. సమ్మిళిత అభివృద్ధి, 2. చివరి వ్యక్తి వరకూ లబ్ధి చేకూర్చడం 3. మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, 4. ప్రజల శక్తిని వినియోగించడం, 5. గ్రీన్ గ్రోత్ (పర్యావరణ అనుకూల వృద్ధి), 6. యువశక్తి, 7. ఆర్థికరంగం. కాగా బడ్జెట్‌లో జనరంజక నిర్ణయాలు, పథకాలు ప్రకటించలేదు. ద్రవ్యలోటు తగ్గింపునకు ప్రాధాన్య మిచ్చారు. రూ. 11.11 లక్షల కోట్లు కేటాయించి మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశారు. సమ్మిళిత వృద్ధే లక్ష్యంగా ఉద్యోగాల సృష్టికి ప్రాధాన్యమిచ్చారు.

గృహ నిర్మాణం, పర్యాటకం, పునరుత్పాదక ఇంధన వనరుల ప్రోత్సాహకాలు ప్రకటించారు. బడ్జెట్‌లో మహిళలు, యువత, స్వయం సహాయక బృందాల మహిళల సాధికారిత సాధనకు బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయి. పరిశోధనలకు ఆవిష్కరణ లకు లక్ష కోట్ల రూపాయలు కేటాయించడం చరిత్రాత్మక నిర్ణయమని ఆర్థిక వేత్తలు హర్షం వ్యక్తం చేశారు. వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో వృద్ధి అభివృద్ధి వ్యూహాలతో స్థూల ఆర్థిక వ్యవస్థను మెరుగుపరిచే దిశగా ఆర్థిక క్రమశిక్షణ, వృద్ధికి మార్గం చూపిన బడ్జెట్‌గా పేర్కొనవచ్చు. దేశంలో ఆసుపత్రులకు మౌలిక సదుపాయాల కల్పన, వైద్య కళాశాలల ఏర్పాటు ప్రత్యేక కమిటీ ఏర్పాటు హర్షణీయం.

9–14 సంవత్సరాల బాలికలకు గర్భాశయ క్యాన్సర్ నిరోధక టీకాలు ఇచ్చే పథకం వల్ల యేటా దేశంలో 80 వేల మందికి ఈ రకం క్యాన్సర్ నుండి విముక్తి లభిస్తుంది. మాతాశిశు సంరక్షణకు ఉన్న పథకాలను ఒక సమీకృత కార్యక్రమం కిందికి తీసుకురావడం, మెరుగైన పోషకాహార పంపిణీ, ఆశా వర్కర్స్, అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులను ఆయుష్మాన్ భారత్ కింద ఆరోగ్య బీమా కల్పన చర్యలు, మహిళల ఆరోగ్య పరిరక్షణకు, ఆర్థిక సాధికారతకు ఉపకరిస్తుంది. ఇంకా మానవవనరుల అభివృద్ధికి తోడ్పడుతుంది. దాదాపు 55 కోట్ల మందికి ఈ పథకం వర్తిస్తుంది.

గతంలో ఎన్నడూ లేనట్లు పాఠశాల విద్య అక్షరాస్యత విభాగానికి కేంద్ర ప్రభుత్వం రూ. 73,498 కోట్లు కేటాయించింది. ప్రధానమంత్రి శ్రీ పథకానికి రూ. 6050 కోట్లు, సమగ్ర శిక్షా అభియాన్, కేంద్రీయ విద్యాసంస్థలకు, నవోదయ విద్యాలయాలకు అధిక నిధులు ఇవ్వడం వల్ల విద్యారంగ అభివృద్ధి సాధ్యమే. ఉన్నత విద్యకు బడ్జెట్‌లో రూ. 9,624 కోట్ల మేరకు కోత విధించింది.

నూతన ఆవిష్కరణలు నైపుణ్యం పెరిగి మానవ వనరుల అభివృద్ధికి దోహదపడతాయి. వ్యవసాయ రంగం, సహకార రంగానికి ప్రాధాన్యం, వ్యవసాయ ఆధారిత ఆర్థికవ్యవస్థ, అభివృద్ధికి వ్యవసాయ అనుబంధ రంగాలకు గత ఏడాదితో పోలిస్తే కేటాయింపులు పెరిగాయి. చేపల పెంపకం, పాల ఉత్పాదకత, ఆహార శుద్ధి పరిశ్రమలు, వ్యవసాయ రంగాన్ని అభివృధి పరిచేందుకు ప్రైవేట్– పబ్లిక్ పెట్టుబడులకు ఆహ్వానం, నూనెగింజల ఉత్పత్తి, ఉత్పాదకత పెంచడం, వంటనూనెల తయారీలో ఆత్మనిర్భరత సాధనకు వ్యూహాల రూపకల్పన, వేరుశెనగ, నువ్వులు, ఆవాలు, సోయా, సన్ ఫ్లవర్ పంటలకు ప్రోత్సాహం ఈ బడ్జెట్‌లో కనిపిస్తుంది. అధిక దిగుబడులు ఇచ్చే ఆధునిక సాగు పద్ధతుల వినియోగం, మార్కెట్ అనుసంధానం, పంటల బీమా, మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధులు వంటి పథకాలతో పాడిరైతులను ఆదుకునే చర్యలు వారికి లాభం చేకూరుస్తాయి. 11.8 కోట్ల మందికి పీఎం సమ్మాన్ యోజన కింద ఆర్థికసాయంతో 38 లక్షల మంది రైతులు లబ్ధి పొందుతారు.

### వ్యవసాయ రంగంలో స్టార్టప్‌ల ప్రోత్సాహం

గ్రామీణ ప్రాంతాలలో ఔత్సాహిక యువతను వ్యవసాయ స్టార్టప్‌ల ఏర్పాటు చేసేలా ప్రోత్స హించడం కోసం సహకార వ్యవసాయాభివృద్ధి నిధి ఏర్పాటుకు ప్రతిపాదించారు. దీనితో గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు కలుగుతాయి. ప్రకృతి వ్యవసాయం, రైతులకు సహకార పరపతి అందించడం, నూతన సాంకేతిక నైపుణ్యంతో కూడిన సేంద్రీయ వ్యవసాయం విధానాన్ని అమలు చేయడం దీని ఉద్దేశం.

# వృద్ధికి దిక్సూచి




**వ్యవసాయాధారిత పరిశ్రమలు**

ఆహారశుద్ధి పరిశ్రమల స్థాపన, కిసాన్ డ్రోన్స్ ఏర్పాటు ద్వారా రైతులకు ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంతో డిజిటల్ హైటెక్ సేవలను అందించడం, సస్యరక్షణ పిచికారి సేవలు, భూదస్త్రాల డిజిటలీకరణ వంటివి గ్రామీణ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి దిక్సూచిగా నిలిచే చర్యలుగా పేర్కొనవచ్చు.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి రూ. 86 వేల కోట్ల కేటాయించారు. గత బడ్జెట్‌తో పోలిస్తే ఇది 43 శాతం ఎక్కువ. జాతీయ జీవనోపాధి మిషన్ అజీవికకు రూ. 15,047 కోట్లు కేటాయించారు.

**మహిళా సాధికారిత**

మహిళలను లక్షాధికారులను చేసే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన 'లఖ్‌పతి దీదీ' పథకం లక్ష్యాన్ని 3 కోట్లకు పెంచారు. దీనిలో స్వయం సహాయ బృందాలకు శిక్షణ ఇస్తారు. తద్వారా వారు ఏటా లక్ష రూపాయల ఆదాయం పొంది ఆర్థిక సాధికారిత సాధిస్తారు. యువత సాధికారిత, సాంఘిక సంక్షేమం అన్ని రంగాలలో పౌరులకు అవకాశాల కల్పన, ఉద్యోగాల కల్పన, నైపుణ్యం మెరుగుపరిచే దిశగా అడుగులు వేసిన బడ్జెట్ ఇది అని చెప్పవచ్చు. యువతలో ఉన్న సామర్థ్యాన్ని వెలికితీయడం, ప్రపంచ స్థాయిలో ప్రతిభాపాటవాల వికాసానికి బడ్జెట్ చేయూతనిస్తుంది.

**ఆదాయపు పన్ను**

ప్రస్తుతం ఉన్న ఆదాయపు పన్ను స్లాబ్‌లను 6 నుంచి 5కు తగ్గించారు. ఆదాయ పన్ను పరిమితి 6 లక్షల నుండి 9 లక్షల వరకు పెంచారు. గతంలో 10శాతం పన్ను చెల్లించే దాన్ని బడ్జెట్లో ఎత్తివేశారు. వ్యక్తిగత ఆదాయ పన్ను కార్పొరేట్ పన్నులలో మార్పు లేదు. మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ. 75 వేల కోట్లు, రైల్వేల అభివృద్ధికి రూ. 2.4 లక్షల కోట్లు, కొత్త రైల్వేల నిర్మాణానికి, మౌలిక వసతుల అభివృద్ధికి కేటాయింపులు చేశారు. రైల్వేలో 3 కొత్త నడవాల ఏర్పాటు ప్రతిపాదనలు చేశారు. దీని వల్ల సరుకు, ప్రయాణికుల రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయి.

**మెట్రో నహా భారత్ రైళ్ల విస్తరణ**

ప్రస్తుత రైల్వే నెట్‌వర్క్‌ను 3 కారిడార్లుగా విభజించి రైల్వే బడ్జెట్ రూ. 25,5,393 కోట్లుగా ప్రకటించారు. 40 వేల సాధారణ రైలు బోగీలను వందే భారత్ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా అప్‌గ్రేడ్ చేయడం వల్ల ప్రయాణికులకు సౌకర్యంవంతమైన సేవలు అందుబాటులోకి వస్తాయి.

ఇళ్లపై రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటు చేసుకున్న వారికి నెలకు 300 యూనిట్ల వరకు ఉచితంగా వినియోగించే అవకాశం కల్పించారు. దీనివల్ల ఏడాదికి రూ.15 వేల నుండి 18 వేలు ఆదా చేసుకోవచ్చు. 149 విమానాశ్రయాలు ఉన్న పౌర విమానయాన రంగానికి బడ్జెట్‌లో రూ.2,300 కోట్లు కేటాయించారు. 22 విమానాశ్రయాల పునరుద్ధరణ, 124 వాయుమార్గాలను ప్రారంభించి ఈశాన్య ప్రాంతాలతో అనుసంధానం చేస్తారు. రాష్ట్రాలకు వడ్డీ లేని రుణాల పథకం కింద రూ.13.7 లక్షల కోట్లు, పీఎం ఆవాస యోజనకు రూ.79 వేల కోట్లు కేటాయించడం వల్ల ఆర్థికవ్యవస్థలో ఉత్పాదక ఆస్తుల కల్పనకు ఊతం ఇస్తుంది.

**విద్య వైద్య రంగాలకు పెద్ద పీట**


వైద్య, విద్యా రంగాలలో నెలకొన్న సమస్యలను పారదోలడం లక్ష్యంగా బడ్జెట్లో నిధులు కేటాయించారు. వైద్య, మందుల, పరికరాలు, ఔషధ పరిశ్రమకు ఇస్తున్న పన్ను మినహాయింపు, పరిశోధనను ప్రోత్సహించడం ఇందుకే. ఇక వ్యవసాయంలో నానో యూరియా విజయవంతం కావడంవల్ల నానో డీఏపీ వినియోగాన్ని ప్రోత్సహిస్తారు. ఎరువులపై రాయితీ 8 శాతానికి తగ్గించారు. అయితే పంటలకు సాగునీటి పొదుపు, సూక్ష్మ సేద్యం పథకానికి, బిందు తుంపర్ల పరికరాలపై రాయితీలు లేవు.

ఆపరేషన్ గ్రీన్ పథకం కింద టొమేటో, ఉల్లిగడ్డ, మరో22 ఆహార పంటలకు పంట శుద్ధి నిల్వ సదుపాయాల జోలికి పోలేదు. ఇప్పటి వరకు 19 పంటలనే గుర్తించారు. జాతీయ ఎలక్ట్రానిక్ వ్యవసాయ మార్కెట్ (ఈనామ్) 1000 కొత్త మార్కెట్లను ఆన్‌లైన్ పరిధిలోకి తీసుకువచ్చే దిశగా చర్యలు లేక పోవడం, గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయదారుల ఉత్పత్తులకు మద్దతు ధరలు లభించని స్థితి రైతాంగాన్ని నిరాశకు గురిచేసేదేనన్న అభిప్రాయం ఉంది.

గల్ఫ్ దేశాల్లో సమస్యలను ఎదుర్కొనే ప్రవాస భారతీయ మహిళల సహాయార్థం వన్ స్టాఫ్ సెంటర్ నెలకొల్పే ప్రకటనకు నిధులను కేటాయించలేదు. నిర్భయ నిధి మీద దయ చూపలేదు. నూతన పాస్‌పోర్ట్ కేంద్రాల ఏర్పాటు, భవనాల నిర్మాణ ప్రసక్తి లేదు. నదుల అనుసంధానం కోసం బడ్జెట్లో రూ॥ 3500 కోట్లు కేటాయించారు. నిధుల కొరత వల్ల నదుల అనుసంధానం ఏళ్లు పట్టవచ్చు.

అన్న దాత సంరక్షణ యోజన, రైతు ఉత్పత్తి సంఘాలకు వడ్డీ రాయితీలకు నిధులు భారీగా పెంచారు. పరిశోధనలకు రూ. లక్ష కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటు వల్ల స్టార్టప్ పరిశోధనలు, ఆవిష్కరణలు పెంచేందుకు వీలుగా పబ్లిక్ ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించాలని బడ్జెట్లో నిర్ణయం తీసుకున్నారు. 50 ఏళ్ల పాటు వడ్డీ లేని రుణాలు అందించేందుకు కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయడం వల్ల పరిశోధన, అభివృద్ధి వేగవంతమై, ఆర్థికాభివృద్ధి జరుగుతుంది.

దీర్ఘకాలిక దృష్టితో రూపొందించిన బడ్జెట్ ఇది. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగి, ప్రపంచంలో తృతీయ ఆర్థికశక్తి స్థాయికి చేరుకొని, సామాజిక న్యాయాన్ని నినాదంగా కాకుండ ఒక విధానంగా పాటించి భారత్‌ను విశ్వగురు స్థాయికి ఎదిగేలా చేస్తుందని ఆశిద్దాం. ★



**నేదునూరి కనకయ్య**
అధ్యక్షులు, తెలంగాణ ఎకనామిక్ ఫోరం, కరీంనగర్

ఎన్నికల నేపథ్యంలో కేంద్ర మధ్యంతర బడ్జెట్‌ను ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా గత దశాబ్దకాలంలో ప్రభుత్వం సాధించిన విజయాలు, దేశ ఆర్థిక ప్రగతి ఏ రీతిగ ఉన్నది అనే అంశాలను తమ ప్రసంగంలో వివరించారు. ప్రసంగం కొంత మేరకు ప్రగతి నివేదికలా అనిపించినా ఈ బడ్జెట్ ఆర్థిక ఏకీకరణకు, పెట్టుబడి వ్యయం పెంపుదలకు ప్రాధాన్యం ఇచ్చినట్టు స్పష్టంగా తెలుస్తున్నది. కొవిడ్ అనంతరం ఆర్థిక క్రమశిక్షణ కొంత మేరకు గాడి తప్పినట్టుగా గణాంకాలు తెలియజేస్తున్నాయి. కాబట్టి ఆర్థిక ఏకీకరణ, క్రమశిక్షణ, లోటు నియంత్రణ అత్యంత ఆశ్యకమయ్యాయి. పన్ను రాబడులు మెరుగైన నేపథ్యంలో లోటు నియంత్రణకు అవకాశం లభించింది. 2024-25లో అప్పులు కాకుండానే 30.80 లక్షల కోట్ల రూపాయలుగా అంచనా వేశారు.



# ఆర్థిక స్థిరీకరణ, మధ్యంతర

ప్రత్యక్ష పరోక్ష పన్నుల వసూళ్లు పెరగడం వల్ల ప్రభుత్వ ఆదాయం పెరిగింది. గత దశాబ్ద కాలంలో ప్రత్యక్ష పన్నుల ఆదాయం మూడు రెట్లు పెరిగింది. పన్ను రేట్లు తగ్గిన అనంతరం కూడా పన్ను ఆదాయం పెరగడం మన దేశ ఆర్థిక ప్రగతికి సూచికగా భావించవచ్చు. దేశంలో ఆదాయ పన్ను రిటర్నులు దాఖలు చేసేవారి సంఖ్య పెరగటాన్ని, ప్రగతి సూచికగానే కాక చట్టాలను అమలు జరపడంలో ప్రభుత్వం పురోగతి సాధించినట్లుగా పరిగణించాలి. 2023-24లో దాదాపు 7.51కోట్లకు పైగా ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేశారు. అదే 2013 -14లో 2.87 కోట్లమంది మాత్రమే రిటర్నులు దాఖలు చేయగా అందులో 1.25 కోట్ల మంది మాత్రమే పన్ను చెల్లించారు. అంటే దేశ జనాభాలో కేవలం 1 శాతం ప్రజలు ఆదాయపు పన్ను చెల్లించారు. ఈ 10 సంవత్సరాలలో పరిస్థితి కొంత మెరుగుపడినా ఆదాయపు పన్ను చెల్లించేవారి సంఖ్య దేశ జనాభాతో పోలిస్తే తక్కువే. 2023-24లో 7.50 కోట్లమందికి పైగా ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేయగా, అందులో ఆదాయపు పన్ను చెల్లించిన వారు కేవలం 2.24 కోట్ల మంది. అంటే ఇప్పటికి కూడా దేశ జనాభాలో కనీసం రెండు శాతం ప్రజలు కూడా పన్ను చెల్లించటం లేదు. ఒక వైపు దేశం ఆర్థికంగా వేగంగా వృద్ధి చెందుతున్నా, ఆదాయపు పన్ను చెల్లించేవారి సంఖ్య ప్రపంచంలో అనేక దేశాలతో పోలిస్తే మన దేశంలో చాలా తక్కువ. దేశంలో పాన్‌కార్డు (PAN Card) కలిగి ఉన్న వారి సంఖ్య గత దశాబ్దిలో గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం 70 కోట్లమందికి పైగా పాన్ కార్డు కలిగి ఉన్నారు. అయినా పన్ను చెల్లించేవారి సంఖ్య చాలా తక్కువ. ప్రత్యక్ష పన్నులు చెల్లించేవారి సంఖ్య తక్కువ ఉండటం మన దేశం లాంటి దేశాలతో సహజమే అని సరిపెట్టుకున్నా పరోక్ష పన్నులు చెల్లించేవారి సంఖ్య కూడా అంతా గొప్పగా లేదు.

2023 నాటికి మన దేశంలో జీఎస్‌టీ పన్ను చెల్లింపుదారుల సంఖ్య 1.4 కోట్ల మంది మాత్రమే. జీఎస్‌టీ వసూళ్లు నెలకు రూ.1.6 లక్షల కోట్లకు చేరుకున్న మాట వాస్తవమే అయినా, దేశంలో ప్రభుత్వానికి జీఎస్‌టీ కదుతున్నవారి సంఖ్య తక్కువనే చెప్పవలసి వస్తుంది. ప్రభుత్వానికి జీఎస్‌టీ కంపెనీలే ఎక్కువ శాతం ఉన్న విషయాన్ని గమనించాలి. జీఎస్‌టీ చెల్లిస్తున్న 1.40 కోట్ల చెల్లింపు దారులతో కంపెనీలే 73 శాతానికి పైగా ఉన్నాయి. అంటే అనేకమంది వ్యాపారస్థులు ప్రభుత్వానికి అటు ఆదాయపు పన్ను కాని, ఇటు జీఎస్‌టీ కాని చెల్లించటం లేదు. అలా చెల్లించకపోవటంవల్ల ప్రభుత్వానికి రావల్సినంత ఆదాయం రావడంలేదు. ఆదాయం లేకపోయినా కొంతమేరకు ఖర్చులు చేయాల్సిన అవసరం ఏర్పడింది కాబట్టి ప్రభుత్వాలు అప్పులు చేయాల్సి వస్తుంది. అప్పులు ఎక్కువగా చేయటం వల్ల వడ్డీ భారం పెరిగిపోతున్నది. అప్పుల వల్ల ఇతర పరిణామాలు కూడా ఉన్నాయి. కాని వాటిని ప్రస్తుతానికి ప్రక్కన పెట్టినా, వడ్డీ భారమే అధికంగా ఉంటున్నది. ప్రభుత్వ ఖర్చులలో వడ్డీలకే 20శాతం పోతున్నది. వచ్చే ఆదాయంలో అయిదవ భాగం వడ్డీలు కట్టటానికే ఖర్చు చేయాల్సి రావటం ఆర్థిక క్రమశిక్షణ అనిపించుకోదు. అందుకే గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వాలు అప్పులు చేయటం తగ్గించాలని అనేక సంస్థలు (అందులో అంతర్జాతీయ సంస్థలు కూడా ఉన్నాయి) మేధావులు ప్రభుత్వానికి సూచిస్తున్నాయి. మోదీ ప్రభుత్వం పగ్గాలు చేబట్టిన తొలి అయిదు సంవత్సరాలలో ఈ విషయంలో కొంత పురోగతి సాధించి, ఆర్థిక స్థితిని కొంతమేరకు గాడిలో పెట్టారు. 2013-14లో మన ప్రభుత్వ అప్పు దేశస్థుల జాతీయ ఉత్పత్తి (జీడీపీలో) 50 శాతానికి పైగా ఉండగా, తొలి అయిదు సంవత్సరాలలో మోదీ ప్రభుత్వం దానిని 47.9 శాతానికి తగ్గించ గలిగింది.

2018-19లో కేంద్ర ప్రభుత్వం 5.29 లక్షల కోట్లు వడ్డీ చెల్లించింది. అయితే కొవిడ్‌వల్ల ప్రభుత్వ ఆదాయం తగ్గటం, ఖర్చులు నిలవరించలేకపోవటం వల్ల అప్పులు ఎక్కువగా చేయవలసి వచ్చింది. అందువల్ల 2024-25 మధ్యంతర బడ్జెట్‌లో వడ్డీల కోసం 11.90 లక్షల కోట్లు కేటాయించవలసి వచ్చింది. ఇది రక్షణ రంగానికి చేసిన కేటాయింపుల కంటే రెట్టింపని గమనించాలి. ప్రభుత్వానికి స్థూలంగా 38.31 లక్షల కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేయగా, అందులో రాష్ట్ర ప్రభుత్వాల వాటా తదితర బదలాయింపులు మినహాయిస్తే ప్రభుత్వానికి వచ్చే నికర ఆదాయం రూ.26.02 లక్షల కోట్లు. దాంట్లో ప్రభుత్వోద్యోగుల జీతభత్యాలు, పెన్షన్ల చెల్లింపునకు రూ. 10.08 లక్షల కోట్లు ఖర్చు అవుతుంది. అంటే ప్రభుత్వానికి వచ్చే 26.02 లక్షల కోట్ల ఆదాయంలో కేవలం జీతాలు, పెన్షన్లు (ఉద్యోగులకు చెల్లింపులు), వడ్డీలకే 21.98 లక్షల కోట్లు ఖర్చు అవుతుంది. ప్రభుత్వ ఆదాయం మొత్తంలో కేవలం ఈ రెండింటికే 85శాతం ఖర్చు అవుతుంది. ఇక ప్రభుత్వం ఇస్తున్న (పెట్రోలియం, ఎరువులు, ఆహారం తదితర) సబ్సిడీలకు రూ. 4.09 లక్షల కోట్లు ఖర్చు అవుతుంది. ప్రభుత్వానికి వచ్చే రూ. 26.02 లక్షల కోట్లలో ఈ నాలుగింటికే రూ. 26.07 లక్షలు ఖర్చు అవుతుంది. ఈ నాలుగు చెల్లింపులకే ఆదాయం సరిపోవట్లేదని చెప్పటానికి పెద్ద ఆర్థిక పరిజ్ఞానం అవసరం లేదు. ఈ నాలుగింటి చెల్లింపులకే ఆదాయం సరిపోనప్పుడు మిగిలిన ఇతర అంశాలపై ఖర్చులు చేయాలంటే అప్పులైనా చేయాలి



## క్రమశిక్షణ దిశగా
## ర బడ్జెట్

లేదా ఆస్తులైనా అమ్మాలి, ప్రభుత్వం ఈ రెండూ చేస్తున్నది. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో ప్రభుత్వ ఆర్థిక స్థితి గాడితప్పి, ఇబ్బందులు తప్పవు కాబట్టి, ఎన్నికల సంవత్సరం అయినా సరే నూతన పథకాలను ప్రవేశపెట్టే సాహసం చేయకుండా, ఆర్థిక ఏకీకరణకు ఆర్థిక స్థిరీకరణకు, ఆర్థిక క్రమశిక్షణకు ఈ బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇచ్చారు.

ఈ బడ్జెట్‌లో వివిధ పథకాల క్రింద రూ. 19.96 లక్షల కోట్లు కేటాయించారు. ఇందులో కేంద్ర ప్రాయోజిత పథకాలు అంటే రాష్ట్రాల భాగ స్వామ్యంతో అమలు జరిపే పథకాలకు రూ. 5.02 లక్షల కోట్లు కేటాయించగా మిగిలిన రూ. 14.94 లక్షల కోట్లు కేంద్ర పథకాలకు ఖర్చు చేయనున్నారు. ఈ ఖర్చుల కోసం అదనంగా సంవత్సరం రూ. 16.85 లక్షల కోట్లు అప్పు చేయనున్నారు. ఇలా ప్రభుత్వం అప్పు చేసినా దేశ ఆర్థిక ప్రగతి కొనసాగించటానికి అవసరమైన చర్యలు ప్రభుత్వం తీసుకొంటున్నది. అందుకే ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న దేశాలలో ఒకటిగా కొనసాగుతూ, ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా అవతరించి ప్రపంచ సగటు వృద్ధిరేటు అయిన 2.7కు రెట్టింపు కంటే ఎక్కువగా, అంటే 6.1 శాతం వృద్ధి రేటును మన దేశం నమోదు చేసుకుంటుందని అంచనా వేశారు. చైనా, అమెరికా, యూరప్, యూకే, జపాన్ వంటి దిగ్గజ దేశాలకంటే మన వార్షిక వృద్ధి రేటు ఎక్కువగా ఉన్నదని గర్వించాలి. వృద్ధిరేటు ఆశాజనకంగా ఉన్నది కాబట్టి, దేశంలో నిరుద్యోగం తగ్గుముఖం పట్టింది.

2017-18లో 6.1 శాతం ఉన్న నిరుద్యోగ రేటు 2022-23 నాటికి 3.2 శాతానికి తగ్గింది. ప్రభుత్వ పరోక్ష పన్నుల వసూళ్ల పెరుగుదల కూడా ఈ విషయాన్ని ధృవీకరిస్తుంది. ప్రజలకి ఉపాధి లభిస్తేనే వారి ఆదాయాలు పెరుగుతాయి. ఆదాయాలు పెరిగితే వస్తు సేవల వినిమయం పెరుగుతుంది. వస్తు సేవల వినిమయం పెరిగితే పెట్టుబడులు, ఉత్పత్తి, వృద్ధి రేటు పెరగటంతో పాటు ప్రభుత్వానికి వచ్చే పరోక్ష పన్నులు పెరుగుతాయి. పరోక్ష పన్నుల వసూళ్లు పెరిగి ప్రభుత్వ ఆదాయం పెరిగింది కాబట్టి ప్రజల ఉపాధి అవకాశాలు మెరుగు పడినట్టుగా భావించవచ్చు. అలాగే ద్రవ్యోల్బణం కూడా గతంతో పోల్చినప్పుడు తగ్గింది. 2014లో నరేంద్రమోదీ మొదటిసారి ప్రభుత్వ పగ్గాలు చేబట్టినప్పుడు 9.4 శాతం ఉన్న ద్రవ్యోల్బణం 2024 నాటికి 5.5 శాతానికి తగ్గింది. అయితే మోదీ తొలి 5 సంవత్సరాల పాలనలో 2018-19నాటికి ఈ ద్రవ్యోల్బణం తగ్గి 3.4 శాతానికి చేరుకొన్నది. మలి అయిదు సంవత్సరాలలో అనేక కారణాలవల్ల 6.7 శాతం వరకు పెరిగి వర్తమానంలో 5.5 శాతానికి తగ్గింది.

గత అయిదు సంవత్సరాలలో పెట్టుబడి వ్యయం క్రమంగా పెరుగుతున్నది. 2018లో రూ. 2.63 లక్షల కోట్లు ఉన్న పెట్టుబడి వ్యయం 2023 నాటికి రూ. 7.50 లక్షల కోట్లకు చేరుకోగా, ఈ సంవత్సర మధ్యంతర బడ్జెట్‌లో పెట్టుబడి వ్యయానికి రూ.11.11 లక్షల కోట్లు కేటాయించారు. దీనికి పెట్టుబడి వ్యయం కోసం ప్రభుత్వం ఇచ్చే గ్రాంటును కూడా జోడిస్తే దీని మొత్తం దాదాపు రూ.15 లక్షల కోట్ల వరకు ఉంటుందని అంచనా వేశారు. క్రమంగా పెట్టుబడి వ్యయం పెరగటం వల్ల దేశంలో మౌలిక సదుపాయాలు పెరుగుతున్నాయి. మౌలిక సదుపాయాలు మెరుగుపడటం వల్ల దేశంలో ఉపాధి అవకాశాలు పెరిగాయి. ఉపాధి అవకాశాలు పెంచటానికి ఇటీవలి కాలంలో విశేషమైన కృషి చేసింది. వ్యాపారులకు ముఖ్యంగా మహిళ, సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు, అంకుర సంస్థలకు, అవసరమైన పెట్టుబడి సమకూర్చటంతో పాటు అనేక ప్రోతాహకాలను అమలు జరిపింది. ఉపాధికి అవసరమైన నైపుణ్యాన్ని పెంచటానికి నైపుణ్య అభివృద్ధి పేరుతో అనేక రకాల వృత్తులలో నైపుణ్యం పెంచటానికి తగిన శిక్షణ ఇవ్వడం జరిగింది. దాదాపు 1.40 కోట్లమందికి స్కిల్ ఇండియా మిషన్ కింద నైపుణ్య వృద్ధిలో శిక్షణ ఇప్పించి, ఉపాధి కల్పించారు. 78 లక్షలమంది వీధి వ్యాపారస్థులకు PM-SVA Nidhi క్రింద పెట్టుబడి సాయం అందించారు. PM ముద్ర లోన్ల కింద 43 కోట్లు మంజూరు చేశారు. 30 కోట్ల మహిళా ముద్ర లోన్లను మంజూరు చేశారు. అలాగే 83 లక్షల స్వయం సహాయక బృందాల చెందిన కోటిమంది మహిళలకు లక్‌పతీదీది (లక్షాధికారి సోదరి) పథకం క్రింద లబ్ధి చేకూర్చారు. అలాగే ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలు కల్పించారు. ఇటువంటి ప్రయత్నాల వల్లనే ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశం అయినా సరే వృద్ధి రేటును గణనీయంగా పెంచగలిగారు, నిరుద్యోగ రేటును కొంతమేరకి తగ్గించగలిగారు. అలాగే స్వావలంబన, స్వదేశీ విధానాలను కూడా వీలైనంత మేరకు ప్రోత్సహించారు. ముఖ్యంగా వ్యవసాయ రంగంలో ప్రభుత్వ ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించారు.

ఈ సంవత్సరం దిగుబడి అనంతర పనులకు సంబంధించి ప్రోత్సహకాలకు ప్రాధాన్యం కల్పించారు. అలాగే ఆత్మనిర్భర్ భారత్ క్రింద నూనె గింజల ఉత్పత్తికి వ్యూహాత్మక ప్రాధాన్యం కల్పించి, నూనెలు, నూనెగింజల దిగుమతిని తగ్గించడానికి కృషి చేస్తున్నారు. పాడి పరిశ్రమ వృద్ధికి సమగ్రమైన పథకాన్ని రూపొందిస్తున్నారు. అలానే ఎరువుల విషయంలో భూసార పరిరక్షణ చర్యలతో భాగంగా నానో DAP ని విస్తృత పరుస్తున్నారు. అంతే కాకుండ మత్స్య సంపద సమగ్ర అభివృద్ధిపై దృష్టి సారించి మత్స్య ఎగుమతులను రెట్టింపు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. రైతులకు ఫసల్ బీమా యోజన క్రింద 4 కోట్ల మంది రైతులకి లబ్ధి చేకూర్చాం. దాదాపు 1361 వ్యవసాయ మండీలు (మార్కెట్లను) E-NAM పరిధిలోకి తీసుకొచ్చి 3 లక్షల కోట్ల రూపాయల వ్యవసాయ వ్యాపారంలో పారదర్శకత పెంచారు. రైతుల అకౌంట్లకు నేరుగా డబ్బు చేరే వ్యవస్థను ఏర్పాటుచేశారు. సోలార్ విద్యుత్ (సౌర విద్యుత్) రంగంలో ప్రోత్సాహకాల ద్వారా దాదాపు కోటిమంది గృహస్థులకు నెలకు 300 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందే అవకాశం కల్పించారు. ప్రస్తుతం దేశంలో ఉత్పత్తి అయ్యే మొత్తం విద్యుత్‌లో 40శాతం మించి విద్యుత్‌ను సాంప్రదాయేతర మార్గాల ద్వారా ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని ఏర్పాటు చేసి పర్యావరణ పరిరక్షణలో తమ బాధ్యత నెరవేర్చటంలో నిబద్ధతను చాటుకున్నారు. 10 కోట్ల మంది మహిళలకు PNUY పథకం క్రింద గ్యాస్ కనెక్షన్లు ఇచ్చారు. 39.2 కోట్ల LED బల్బులు, లక్షలాది LED ట్యూబ్ లైట్లు, విద్యుత్ వినోయ సామర్థ్యం కలిగిన FAN లు ఉజ్వాలా పథకం క్రింద వితరణ చేశారు. దాదాపు 11.8 కోట్లమంది రైతులకు PM-KISan క్రింద నేరుగా వారి ఖాతాలకు డబ్బు జమ చేస్తున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా పథకాలు సమర్థవంతంగా అమలు చేసినప్పటికి ప్రజలకు సమగ్ర సమాచారం లేనందువల్ల బడ్జెట్ మాధ్యమంగా మరోమారు ఈ అంశాలను ప్రజలకు వివరించే ప్రయత్నం చేశారు. ★

# శుభంకరుడు

సకల జగతి చైతన్య కారకుడు దివాకరుడు త్రిమూర్తి స్వరూపుడు. 'నమస్కార ప్రియోభానుః' అని ఆర్యోక్తి. కేవలం వందనంతోనే ప్రసన్నుడై ఆరోగ్య విజ్ఞానాలను ప్రసాదించే ప్రత్యక్ష భగవానుడు. సూర్యచంద్రులను శ్రీమన్నారాయణుడి నేత్రద్వయంగా పేర్కొంటారు. కనుకనే, సూర్యకిరణాలను సాక్షాత్తు శ్రీహరి కరుణా కటాక్ష వీక్షణాలుగా భావించి ఆరాధిస్తారు. సూర్యుడు క్రమశిక్షణకు మారుపేరు. సమయపాలనలో,కర్తవ్య నిర్వహణలో యుగాయుగాలకు స్ఫూర్తిప్రదాత. ఉదయాస్తమయ వేళల్లోని సూర్యకిరణాలు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాయని ఆయుర్వేదం చెబుతోంది.

సూర్యభగవానుడు కర్మసాక్షి. సకల లోకాలకు ఆత్మస్వరూపుడు. 'సర్వం సూర్యమయం జగత్' అన్నట్లు సకల జగత్తు ఆయన తేజస్సుతో చైతన్యం పొందుతోంది. కాలస్వరూపుడు.. కాలానికి అధిపతి. సూర్యగమనాన్ని అనుసరించే సంవత్సర కాలం ఉత్తర దక్షిణాయనాలుగా విభజితమైంది. సూర్యుడు త్రిసంధ్యలలో రుక్ యజు సామవేద మంత్రాల ప్రభావంతో కాంతిని అందిస్తున్నట్లు పురాణ కథనం. ఆ కారణంగానే సూర్యుడికి 'త్రయితను'( మూడు వేదాలు దేహంగా కలవాడు)అని పేరు వచ్చింది.

అదితి కశ్యపులకు మాఘ శుద్ధ సప్తమినాడు రోహిణి నక్షత్రంలో సూర్యభగవానుడు జన్మించాడు. ఈ పర్వదినాన్ని 'సూర్య జయంతి' అని వ్యవహరిస్తారు. ఈ తిథి నాడే రథాన్ని అధిరోహించడం వల్ల 'రథసప్తమి' అని పేరు వచ్చిందని మత్స్యపురాణం పేర్కొంటోంది. దీనినే మహాసప్తమి, భానుసప్తమి, అచలాసప్తమి అనీ వ్యవహరిస్తారు. ఆయన ఉత్తర దిశ ప్రయాణం ఈ రోజునే మొదలవుతుంది.

సప్తాశ్వాలు పూన్చిన సూర్యుని ఏకచక్రరథం ఒక దిశలో పయనించే కాలం సంవత్సరంగా కాగా, ఆ చక్రం ఇరుసును వృత్తభాగంలో కలిపే ఆరు రేఖలూ ఆరు రుతువులు, ఏడు అశ్వాలను (గాయత్రి, త్రిష్టుప్, అనుష్టుప్, జగతి, పంక్తి, బృహతి, ఉష్ణిక్కు) ఏడు రంగుల కాంతికిరణాలుగా భావిస్తారు. ద్వాదశ ఆదిత్యులు (పన్నెండుగురు) అని ఆధ్యాత్మిక గ్రంథాలు పేర్కొంటున్నాయి. తీక్షణతను బట్టి ఒక్కొక్క మాసానికి ఒక్కొక్క సూర్యుడు సారథ్యం వహిస్తాడు. ఆ ప్రకారం, ఆయన జన్మతిథి (రథసప్తమి) వచ్చే మాఘ మాసంలోని ఆదిత్యుడిని 'పూషుడు'అనే పేరుతో వ్యవహరిస్తాడు. చైత్రంలో ధాత, వైశాఖంలో అర్యముడు,జేష్ఠంలో మిత్రుడు, ఆషాఢంలో వరుణుడు, శ్రావణంలో ఇంద్రుడు, భాద్రపదంలో వివస్వంతుడు, ఆశ్వయుజంలో త్వష్ట, కార్తికంలో విష్ణువు, మార్గశీర్షంలో అంశుమంతుడు, పుష్యంలో భగుడు, మాఘంలో (రథసప్తం మాసం) పూషుడు, ఫాల్గుణంలో పర్జన్యుడు... పేర్లతో ఆయా నెలల్లో ప్రాతినిధ్యం వహిస్తాడు.

చంద్రుడు మఘ నక్షత్రంలో ఉండే మాసం మాఘం. 'మఘం' అంటే యజ్ఞం. 'అఘం' అనే సంస్కృత రూపానికి 'పాపం' అని భావం.మాఘం

# జ్ఞాన ప్రదాయినీ! నమోస్తుతే....!!

ఫిబ్రవరి 14 వసంత పంచమి



అఖిలవిద్యా ప్రదాయినిగా,జ్ఞానవల్లి సముల్లాసినిగా మాఘ శుద్ధ పంచమి నాడు సరస్వతీమాత అభివ్యక్తమైందని, మన కంటికి కనిపించే సుందరమైన జగత్తంతా ఆమె స్వరూపమేనని బ్రహ్మాండ పురాణం, ఆ దేవి మూర్తీభవించిన జ్ఞానాకృతి అని పద్మపురాణం పేర్కొంటున్నాయి. జ్ఞానాయుతమైన విద్యల సమాహారమే 'సరస్వతి' అని వేదం ప్రతిపాదించింది. త్రిమూర్తులు జ్ఞాన సంబంధిత కళలు, అంశాల్ని, దివ్యత్వాన్ని వసంతపంచమి నాడే సరస్వతి అమ్మవారికి సంక్రమింప చేశారని పద్మపురాణం పేర్కొంటోంది. శ్రీహరి భృగుమహర్షికి ఈ తిథినాడే సరస్వతీదేవి మూల మంత్రాన్ని ఉపదేశించారని చెబుతారు. వసంత పంచమిని 'శ్రీ పంచమి' అనీ వ్యవహరిస్తారు.

ఈ జగత్తు ఒక దశలో నిస్తేజంగా, నిశ్శబ్దంగా మారడంతో ఆందోళన చెందిన దేవతలు విధాతను ఆశ్రయించగా, ఆయన తన దివ్య కమండలంలోని మంత్రపూరిత జలాన్ని భూమిపై చిలకరించాడట. దాంతో రెండు చేతులతో వీణ వాయిస్తూ, మరో రెండు చేతులలో జపమాల, పుస్తకాన్ని ధరించిన బ్రాహ్మీశక్తి ఉద్భవించిందని చెబుతారు. పుస్తకం సకల కళలు, విద్యలకు ప్రతీక కాగా, జపమాల పవిత్రకు చిహ్నం. ఆమె హృదయస్థానంలో వేదాలు, బుద్ధి స్థానంలో ధర్మశాస్త్రాలు, శ్వాసలో పురాణాలు, తిలకంలో కావ్యాలు, జిహ్వాలో వాఙ్మయం, నేత్రాలలో ఆధ్యాత్మికత, లౌకిక విద్యలు, ఉదరంలో సంగీత నాట్య కళలు వికసిస్తాయని రుషులు శ్లాఘించారు. సరస్వతీమాత పరమ సాత్వికమూర్తి. అందుకే ఆమెను అహింసకు అధినాయకికగా బ్రహ్మ వైవర్త పురాణం చెబుతోంది.

ధవళ వస్త్రధారిణియై, పద్మంపై ఆశీనురాలై, చిరునగవు మోముతో కాంతులీనుతూ జ్ఞానాన్ని అనుగ్రహిస్తుందంటారు. ఆమె శ్వేత వస్త్రం స్వచ్ఛతకు, వాహనం శ్వేత హంసను ఆత్మలన్నిటికి మూలమైన

# ప్రభాకరుడు



అంటే పాపాలను నశింపచేసేది. యజ్ఞయాగాదులకు అనువైనది, మాధవ ప్రీతికరమైనదని చెబుతారు.

రథసప్తమి ప్రత్యేకత గురించి 'వ్రతచూడామణి' పేర్కొన్న ప్రకారం, ఆరోజు సూర్యోదయానికి ముందే నెయ్యి లేదా నువ్వుల నూనెతో దీపాన్ని వెలిగించి నదీతీరంలో కాని, చెరువులో కానీ వదిలి, జిల్లేడు ఆకులు, రేగుపండ్లు తలమీద ఉంచుకుని స్నానం చేయాలి (ఆధునిక యుగకాలంలో ఆ వెసులుబాటు లేనందున ప్రత్యామ్నాయ ఏర్పాట్లే శరణ్యం) దీనివల్ల ఆరోగ్య ఐశ్వర్యాలు, తేజస్సు పెంపుతో పాటు చర్మరోగాలు, జన్మాంతర సప్తవిధ పాపాలు (ప్రస్తుత, గత జన్మల పాపాలు, మాట, మనసు, శరీరంతో చేసిన పాపాలు,తెలిసీ తెలియక చేసినవి) నశిస్తాయని




డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి

సీనియర్ జర్నలిస్ట్


పరమాత్మకు సంకేతంగా చెబుతారు.

ప్రవాహరూపంలో ఉండే జ్ఞానానికి ప్రతీక సరస్వతీమాత. ఆమెను వాగ్దేవిగా అర్చిస్తారు. వాక్కు, ధారణ, మేధ, ప్రజ్ఞ, బుద్ధి , స్మరణ తదితర లక్షణాలు ఆమె శక్తులని చండీ సప్తశతి చెబుతోంది. విద్యవల్ల జ్ఞానం, దాని ద్వారా భుక్తి, ముక్తి సిద్ధిస్తాయి. 'కేవలం చదవడం, రాయడమనే అక్షరజ్ఞానమే విద్యకాదు. మనిషిలోని వివేకం,కళలు, బుద్ధి(విచక్షణ) నైపుణ్యం, సృజన, విషయాల పట్ల అవగాహన, సమయస్ఫూర్తి వంటివీ చదువు కిందికే వస్తాయి'అని పెద్దలు అంటారు. ఈ సకల మేధో సంపదలకు ఆమెను అధిష్ఠానదేవతగా కొలుస్తారు.

సృష్టి నిర్మాణ నిర్వహణా శక్తులన్నిటిలో సర్వోత్కృష్ట మూలకారకశక్తి మహాసరస్వతి అని జగద్గురు శంకర భగవత్పాదులు 'సౌందర్యలహరి'లో శ్లాఘించారు. తాము నెలకొల్పిన నాలుగు ఆమ్నాయపీఠాలలో దక్షిణామ్నాయ శృంగేరి శారదా పీఠం మొట్టమొదటిది. శంకరులు తాము నెలకొల్పిన పీఠాల ఉత్తరాధిపతులకు అనుగ్రహించిన పేర్లలో వాణి సంబంధితాలైన, 'సరస్వతి,ఇంద్ర సరస్వతి, శారద, భారతి...'లాంటివి ఉండడాన్ని బట్టి వారికి ఆమె కటాక్షం పట్ల ఎంతప్రీతి పాత్రతో అవగత మవుతుంది.

సరస్వతి వాగ్దేవత. వాక్కు అంటే బ్రహ్మ. వాక్కు గొప్ప సంపద. దానిని సద్వినియోగపరచుకున్నవారు ధన్యాత్ములు. భావితరాలకు ఆదర్శమూర్తులు. అలాంటి వారిలో వర్తమాన సమాజంలోని రామభద్రాచార్య స్వామీజీ పరమోదాహరణ. అయోధ్యలో దివ్యభవ్య రామమందిరం నిర్మాణం, బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సాకారం కావడానికి ముందు న్యాయస్థానంలో జరిగిన వాదోపవాదాల్లో ఆయన వాక్కు పరమ ప్రామాణికంగా నిలిచింది.

'శ్రీరాముడు అయోధ్యలోనే జన్మించాడనడానికి రుజువులు కానీ, ప్రామాణికం గ్రంథం కాని ఉన్నదా?' అని ఆ అంశంపై వాదప్రతివాదనల వేళ న్యాయమూర్తి వేసిన ప్రశ్నకు, 'ఆధారం ఉంది రుగ్వేదంలో' అని ఒక స్వరం పలికింది. అందుకు సంబంధించిన పుటలు సహా వివరాలను ఏకరవు పెట్టింది ఆ గళం. న్యాయమూర్తితో పాటు రామజన్మభూమి ట్రస్ట్ తరపున వాదిస్తున్న ప్రఖ్యాత న్యాయవాది పరాశరన్ ఆ గొంతును ఆలకించారు. ఆచార్యజీ వివరణతో, న్యాయమూర్తి రుగ్వేద ప్రతిని తెప్పించి ఆయన చెప్పిన వివరాలతో సరిపోల్చారు. అంధుడైన రామభద్రాచార్య స్వామీజీ, తన తండ్రి వల్లెవేస్తున్న వేదాలను బాల్యం నుంచి కంఠస్థం చేసిన పుణ్యం ఇప్పుడు ఉపక రించినట్లయింది. వాగ్దేవి ఆ రామభద్రుడి ఉనికిని ఈ రామభద్రుడి నోట ఇలా పలికించిదని, అదే వాక్కు గొప్పదనంగా భావించాలి.

చైత్రంలో వచ్చే వసంతశోభ మాఘం నుంచి మొదలవుతుందనే ఉద్దేశంతో ఈ రోజును 'వసంత పంచమి'గా పిలుస్తారని శాస్త్రకారులు చెబుతారు. త్రినేత్రుడి కోపాగ్నికి భస్మమైన మన్మథుడు, రతీదేవి ప్రార్థనతో ఆమెకు మాత్రమే కనిపించేలా పునర్జన్మ పొందిన రోజు ఇదే కావడంతో దీనిని 'మదన పంచమి' అంటారు.

శరన్నవరాత్రుల సందర్భంగా మూలానక్షత్రం నాడే కాకుండా శ్రీపంచమి నాడూ చిన్నారులకు అక్షరాభ్యాసం చేస్తారు. విద్యా సామగ్రిని అమ్మవారి సమక్షంలో ఉంచి ప్రత్యేకంగా అర్చిస్తారు. అమ్మవారికి పాయసం, చెరకు రసం, అవుపాలు, అరటిపళ్లు, చక్కెర, పటిక బెల్లం లాంటి సాత్విక పదార్థాలు నివేదించాలని పెద్దలు చెబుతారు.

సరస్వతి ఆరాధన సనాతన వైదిక ధర్మంలోనే కాకుండా బౌద్ధ జైనాలలోనూ కనిపిస్తోంది. బౌద్ధులు 'మంజు పంచమి, మంజుశ్రీ'గా, జైనులు 'శ్రుతవదన'గా వ్యవహరిస్తూ అర్చిస్తారు. రోమన్లు, గ్రీకులు శ్రీవాణిని 'జ్ఞానదేవత'గా ఆరాధిస్తారు. ★

, ఆ రోజు సూర్యోదయ సమయ స్నానం సూర్యగ్రహణం నాటి స్నానమంత ఫలితం లభిస్తుందని విశ్వాసం.

రవి మకరరాశిలో ఉన్నప్పుడు వచ్చే సప్తమి సమయంలో సూర్యకిరణాలు నేలపై పుష్కలంగా పడతాయని, ఆ శక్తి ప్రధానంగా జిల్లేడు, చిక్కుడు, రేగు చెట్లు, పారే నీటిపైన ఎక్కువగా ఉంటుందని చెబుతారు. అందుకే రథసప్తమి నాటి స్నానపూజలు విశిష్టమైనవని అంటారు. సూర్యపదానికి 'అర్క' అనే పర్యాయపదం కూడా ఉంది. ఆయనకు ప్రీతికరమైన జిల్లేడు అకులను 'అర్కపత్రాలు' అని, రేగు పండ్లను 'అర్క ఫలాలు'అని సంబోధిస్తారు. ఈ రెండింటిని తల/భుజంపై ఉంచుకుని స్నానం చేయడం వల్ల ఏడు జన్మల పాపకర్మలు నశిస్తాయని పురాణాలు చెబుతుండగా, దీనివెనుక ఆరోగ్యరహస్యాలు



ఉన్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. సూర్య కిరణాలు పడిన జిల్లేడు ఆకులు, రేగుపళ్లతో స్నానం చేయడం వల్ల తరువాత వేసవిలో వేడిని తట్టుకునే శక్తి శరీరానికి వస్తుందని వారు వివరిస్తున్నారు చిక్కుడు ఆకులలో నైవేద్యం సమర్పించడం వల్ల ఆ ఆకుల్లో ఉండే ఆరోగ్య రసాలు పదార్థాల్లోకి చేరి ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాయి. కేవలం రథసప్తమి నాడే కాకుండా ఏడాదంతా రోజుకు కొద్దిసేపు సూర్యకిరణాలు పడేలా గడిపినా, శరీరానికి అవసరమైన డి విటమన్ అందుతుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

భాస్కరుడు నిత్యానుసంధానీయుడు. మరీ ముఖ్యంగా మాఘ మాసంలోని ఆదివారాలలో ఆయన అర్చనను మరింత ప్రత్యేకతగా చెబుతారు. ఆదివారాలలో సూర్యనమస్కారాలు చేసి పాలను నివేదిస్తే సకల శుభాలు కలుగుతాయని విశ్వాసం. సూర్యారాధన, సూర్యనమస్కారాల వల్ల జ్ఞానం, సద్గుణం, వర్చస్సు, బలం, ధనం, సంతానం, పాపనాశనం, సకల రోగ నివారణ, ఆయుర్వృద్ధి కలుగుతాయని రుగ్వేద వచనం. అందుకే ఆయన పుట్టిన తిథి 'రథ సప్తమి'ని 'ఆరోగ్య సప్తమి' అనీ అంటారు. ఆయన కృప కోసం 'అరుణపారాయణం' చేస్తారు.

సూర్యారాధన అనాదిగా వస్తున్నదే. అవతార పురుషులు శ్రీరామ, శ్రీకృష్ణుడు సహా అనేకులు ఆయనను అర్చించారని ఐతిహ్యం. శ్రీరామచంద్రుడు అగస్త్య మహర్షి అనుగ్రహంతో పొందిన ఆదిత్య హృదయస్తోత్ర పఠనంతోనే లంకేశ్వరుడిపై విజయం సాధించాడని, నవమ బ్రహ్మగా వినుతికెక్కిన హనుమ సూర్యోపాసన ద్వారానే సర్వవిద్యలు అభ్యసించారని పురాణగాథ. శ్రీకృష్ణుడి కుమారుడు సాంబుడు సూర్యారాధనతో కుష్ఠువ్యాధి బాధ నుంచి విముక్తుడయ్యాడట. ధర్మరాజు వనవాస కాలంలో సూర్యారాధనతోనే 'అక్షయపాత్ర'ను పొంది ఆకలిదప్పులను జయించగలిగాడు.

రథసప్తమి నాడు పెద్దలు/పండితులకు ఛత్రం (గొడుగు), చామరం (కస్తూరి మృగ కేశాలతో చేసిన విసనకర్ర) దానం ఇవ్వడం ఆచారం. దీనివల్ల పుణ్యలోక ప్రాప్తి కలుగుతుందని విశ్వాసం. అందుకు సంబంధించి ప్రచారంలో ఉన్న గాథ ప్రకారం.... జమదగ్ని మహర్షి ధనుర్విద్య సాధనలో భాగంగా బాణ ప్రయోగం చేస్తుండగా, దూరంగా పడుతున్న వాటిని మునిపత్ని రేణుకాదేవి సేకరించి తెస్తోంది. ఆ క్రమంలో ఎండ తీవ్రతకు అలసిపోయింది. అందుకు సూర్యుడే కారణమని భావించిన ముని ఆగ్రహించగా, బ్రాహ్మణ రూపంలో వచ్చిన ఆదిత్యుడు ఆ మహర్షికి నచ్చచెప్పి ఛత్రచామరాలు బహూకరించాడు.

కొత్తగా నోములు, దీక్షలూ స్వీకరించే వారు రథసప్తమి నాడు వ్రతాన్ని ఆచరించి వాటిని ప్రారంభించడం అనాదిగా వస్తున్న ఆచారం. రథసప్తమి వ్రతం ఆచరించేవారు, ముందు రోజు (మాఘ శుద్ధ షష్ఠి) ఆలయానికి వెళ్లి, సంకల్పం చెప్పుకోవాలని, ఆ రోజు ఏకభుక్త నియమం పాటించి, మరునాడు సూర్యోదయానికి పూర్వమే ఏడు జిల్లేడు/చిక్కుడు ఆకులను తల/భుజంపై ఉంచుకుని స్నానం చేయాలని శాస్త్రం చెబుతోంది. రథసప్తమి నాటికి చలి క్రమంగా తగ్గుముఖం పడుతూ ఉష్ణోగ్రత క్రమంగా పెరుగుతుంది. అందుకే పూర్వం రాజులు రథసప్తమి నాటి నుంచి జైత్రయాత్రలకు సన్నాహాలు చేసుకునేవారు.

సూర్యచంద్రులు కర్తవ్య పరాయణులు. క్రమశిక్షణకు మారు పేరు. కాలవిలంబన చేస్తూ, పనులు వాయిదా వేసే వారికి కర్తవ్య బోధ చేస్తారు. 'సూర్యుడిలా సాగిపో' అని ఉత్తేజపరచడం వింటూ ఉంటాం. సూర్యుడు ఎవరి ప్రమేయం లేకుండానే ఉదయిస్తాడు. జీవరాశికి ఆహారం, ఆరోగ్యం సమకూరుస్తూ, తన పని తాను చేసుకుంటూ వేళ మించగానే నిష్క్రమిస్తాడు. త్రిమూర్తి స్వరూపుడిగా పూజలు అందుకుంటూ జగదుత్పత్తి, వృద్ధికి బ్రహ్మ విష్ణు భూమికలను పోషిస్తున్నాడు. సూర్యరశ్మి ప్రభావంతో వానలు కురుస్తూ, వృక్ష జాతులు పెరుగుతూ సమస్త జీవరాశికి ఆహారం అందుతోంది.

దేశంలో అనేక సూర్యదేవాలయాలు ఉన్నాయి. వాటిలో కోణార్క్ (ఒడిశా) అరసవెల్లి (ఆంధ్రప్రదేశ్) ప్రసిద్ధమైనవి. ఒడిశాలో ఏకశిలపై వంద అడుగుల ఎత్తయిన రథం నిర్మితమైంది. రెండు చేతులతో పద్మాలు ధరించి, రథచక్రాలు, గుర్రాలు అతిస్పష్టంగా జీవకళలొలుకుతూ దర్శనమిస్తాయి. అరసవెల్లిలో సూర్యకిరణాలు స్వామి విగ్రహ పాదాలను తాకడం ఆలయ నిర్మాణ కౌశలాన్ని తెలియచేస్తుంది.

**తిరుమలేశునికి సప్తరథ సేవ**

తిరుమలలో ఇతర పండుగల మాదిరిగానే రథసప్తమికి ప్రత్యేకత ఉంది. ఏడాదిలో ఎన్నడూ లేని విధంగా ఆ ఒక్కరోజే శ్రీవారు ఏడు రథాలపై వివిధ అలంకారాలలో ఊరేగి కనువిందు చేస్తారు. సూర్య ప్రభ వాహనంతో తిరువీధి ఉత్సవం మొదలై చిన్నశేష, గరుడ, హనుమంత, కల్పవృక్ష , సర్వభూపాల, చంద్రప్రభ వాహనాలతో ముగుస్తుంది. దీనిని అర్ధ బ్రహ్మోత్సవం అంటారు.

**'సప్తలోక ప్రకాశాయ సప్తసప్త రథాయచ**
**సప్త ద్వీప ప్రకాశయ భాస్కరాయ నమోనమః'...**


స్నానం, దీపం, అర్ఘ్యం, అర్చనం, తర్పణం రథసప్తమి నాటి ప్రత్యేక ధర్మాలు. ముందురోజు (షష్ఠి) నిరాహారంగా ఉండి మరునాడు శాస్త్రోక్తంగా రథసప్తమి వ్రతం ఆచరించడం వల్ల ఆరోగ్యం సిద్ధించడంతో పాటు ఏడేడు జన్మల పాపాలు నశిస్తాయని 'ధర్మసింధువు' పేర్కొంటోంది. ★

# హిందూ చైతన్యదీప్తి సేవాలాల్ మహరాజ్



బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్‌ను హిందూ ధర్మం ఉన్నతిని తెలియచెప్పడానికి జన్మించిన మహనీయుడిగా భావిస్తారు. ప్రజల మేలు కోసం అనేక ఉద్యమాలు చేశారు. ధర్మ ప్రచారం, మత మార్పిడుల నివారణ, క్షేత్ర ధర్మ సంరక్షణ కోసం జీవితాంతం కృషి చేశారు. భారదేశ చరిత్రలో 18వ శతాబ్దం ఎంతో క్లిష్టమైనది. గొప్పగొప్ప రాజులు అంతరించారు. మరాఠాలు శక్తివంతులవుతున్నారు. మరోవైపు బ్రిటిష్‌వారు (ఈస్ట్ ఇండియా కంపెనీ) భారత్‌ను తమ అధీనంలోకి తీసుకునే పని మొదలుపెట్టారు. మిషనరీలు క్రైస్తవ మతప్రచారం ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో సేవాలాల్ మహరాజ్ అవతరించారు. క్రైస్తవీకరణ సాగుతున్న సమయంలో బంజారాలలో హిందూ చైతన్యాన్ని పెంపొందించారు. భక్తిని ప్రేరేపిస్తూ, అది ఆయుధంగా సంస్కరణలు చేపట్టి, సమాజాన్ని సంఘటితపరిచారు. రాబోయే పరిణామాలను ముందుగా పసిగట్టి జాతిని మేల్కొలిపారు.

అనంతపూర్ జిల్లా రాంజీనాయక్ తండాలో భీమా నాయక్, ధర్మిణి భాయి దంపతులకు 1739 ఫిబ్రవరి 15న జన్మించిన సేవాలాల్‌కు చిన్నతనం నుంచే సేవాగుణం ఉండేది. ఆవులు కాయడానికి వెళ్లేటప్పుడు తల్లి కట్టి ఇచ్చిన సద్దిని తాను తినకుండా ఆకలితో ఉన్నవాళ్లకు పెట్టి, తాను బంకమట్టితో రొట్టెలు చేసుకొని తినేవాడు. ఈ వింత ప్రవర్తన తల్లితండ్రులకు, తండాలోని జనాలకు ఆశ్చర్యం కలిగించేది. జాతర్ల సమయంలో జంతుబలిని వ్యతిరేకించారు. 'ఒకవేళ అమ్మవారికి బలి ఇష్టమైతే నేనే బలై పోతాను' అని సేవాలాల్ అమ్మవారి కాళ్ల దగ్గర తన తలను ఉంచి, 'నా రక్తాన్ని నైవేద్యంగా స్వీకరించి బంజారాలకు వరాలు ఇవ్వు'అని ప్రార్థించాడు. కరుణించిన అమ్మవారు, 'నిజమైన భక్తుడు సమాజానికి సేవకుడు. అతని నాయకత్వంలో ప్రయాణించండి' అని జగదాంబ ఆశీర్వదించింది. అప్పటి నుంచి జగదాంబనే గురువుగా స్వీకరించాడు.



**గుగులోతు వెంకన్న నాయక్**
బీజేపీ రాష్ట్ర నాయకులు

**మహరాజ్ మహిమలు**

సంత్ సేవాలాల్ మహరాజ్ అద్భుత మహిమలపై అనేక కథనాలు ప్రచారంలో ఉన్నాయి. పురుషుడిని స్త్రీగా మార్చడం, ఒక ముంత బియ్యంతో పదివేల మందికి భోజనాలు పెట్టడం, చనిపోయిన వ్యక్తిని మూడు దినాల తరువాత బతికించడం, విషం కలిపిన తీపి వంటకాలను నిర్వీర్యం చేయడం. ఉధృతంగా పారే ప్రవాహాన్ని ఆపి తమ తండా ప్రజలను, ఆవులను దాటించడం. వంటివి అందులో కొన్ని. సేవాలాల్‌ను ఆటపట్టించి, అపకీర్తి తీసుకురావాలని జాదూగర్ వడితియా ఒక పురుషుడికి ఆడవేషం వేసి తీసుకువచ్చి సంతానం ప్రసాదించాలని కోరతాడు. సేవాలాల్ 'తథాస్తు'అని దీవించడంతో ఆ పురుషుడు నిజంగానే స్త్రీగా మారిపోతాడు.

దర్బారులోనికి ప్రవేశించడానికి ప్రవేశ మార్గంలో చిన్న తలుపును ఏర్పాటు చేయగా సేవాలాల్ తన ఆకారాన్ని కుదించుకుని తలవంచకుండానే ఆ దర్వాజాలో నుండి ప్రవేశిస్తాడు. అలాగే సేవాలాల్ బావిలో దిగి సన్నని నూలు పోగు ఆధారంతో పైకి వచ్చి తన భక్తిని నిరూపించారు.

అన్ని విద్యలను నేర్చుకొని బంజారాల సేవలో నిమగ్నమయ్యాడు. ప్రజల మేలు కోసం అనేక ఉద్యమాలు చేశారు. వీరిలో 'పెరిఫర్' ఒకటి. ధర్మ ప్రచారం, ఆర్థిక సంస్కరణలు, మత మార్పిడులు అరికట్టడం, క్షేత్ర ధర్మాన్ని రక్షించడం మొదలైనవి ముఖ్యమైనవి. హింస మహా పాపమని, మద్యం , ధూమపానం శాపమని హితవు పలికాడు. అహింస సిద్ధాంతానికి పునాది వేశాడు. అప్పట్లో హైదరాబాదులో మశూచి వ్యాధి ప్రబలినా, సంత్ సేవాలాల్ ఉన్న బంజారా హిల్స్ ప్రాంతానికి మాత్రం ఆ వ్యాధి సోకలేదు. ఆయన మహిమను గుర్తించిన రాజు, సేవాలాల్ ఆశీస్సులతో ఆ వ్యాధిని నిర్మూలించాడని చరిత్ర తెలుపుతోంది.


**బంజారా గిరిజనుల గొప్పతనం**

బంజారా సమాజ్ నిత్యం రామనామాన్ని స్మరిస్తుంది. 'నమస్తే, హలో' బదులుగా 'రామ్ రామ్' అని పలకరించుకుంటారు. బంజారాలు పృధ్వీరాజ్ చవాన్, రాణా ప్రతాప్ సింగ్ వంశస్థులని, వీరూ రాజపుత్రుల్లాంటి వారని కల్నల్ టాడ్ అనే చరిత్ర కారుడు పేర్కొన్నారు.

లంబాడీలు, బంజారాలు, సుగాలీలు, గ్వార్ భాయ్ అని వ్యవహారంలో ఉన్న ఈ గిరిజనులు ప్రపంచవ్యాప్తంగా గోర్ బంజారాలుగా పేరుపొందారు. మధ్య యుగంలో మహమ్మద్ ఘోరీకి వ్యతిరేకంగా పృథ్వీరాజ్ చౌహాన్ పక్షాన పోరాడిన వీరోచిత చరిత్ర బంజారాల సొంతం. దక్కన్ పీఠభూమిలో లంబాడీలు కాకతీయుల కంటే ముందే ఉన్నారని, సంచార జాతివారైనా వీరు రజాకార్లతో పోరాడారని, నవాబులు వారి ధైర్యసాహసాలకు మెచ్చి భూములను ఇనాములుగా ఇచ్చారని చరిత్ర చెబుతోంది. బంజారాలు ఎవరికీ హాని తలపెట్టేవారు కాదని, సహాయ గుణం విరివిగా కలవారని, ధైర్యసాహసాలకు ప్రతీకలనీ చరిత్ర ద్వారా తెలుస్తుంది.

అయితే కొన్ని దశాబ్దాలుగా బంజారా జాతి వివక్షను చవి చూస్తున్న నేపథ్యంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బంజారా సమాజాన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ముందుకు తీసికెళ్ల డానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నారు.

దేశంలో దాదాపు 14 కోట్ల మంది బంజారా సమాజం మాట్లాడే "గోర్ బోలి" భాషను రాజ్యాం గంలో 8వ షెడ్యూల్‌లో చేర్చాలన్న మూడు దశాబ్దాల విన్నపాలు నరేంద్రమోదీ నాయకత్వంలో ఫలవంతం కాలగలదని బంజారాలు నమ్ముతున్నారు. ★




**ప్రాంతాల వారీగా వివక్ష పేరిట తెలంగాణలో మళ్లీ ప్రాంతీయ రాజకీయాలు మొదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రాజెక్టుల్ని కేంద్రానికి అప్పగించే అంశంపై ప్రారంభమైన వివాదం తిరిగి ప్రాంతాల వారీగా ప్రాజెక్టులపై చేసిన నిర్లక్ష్యం గురించిన చర్చకు దారి తీస్తున్నట్లుగా కనిపిస్తోంది. దక్షిణ తెలంగాణలో ప్రాజెక్టుల్ని పట్టించుకోకుండా ఉత్తర తెలంగాణ ప్రాజెక్టుల్ని నిర్మించారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. అసలు ఉత్తర తెలంగాణలో కాళేశ్వరం ప్రాజెక్ట్ అవసరం ఏమిటని ప్రశ్నిస్తోంది. భారీ ఖర్చుతో అవసరం లేకపోయినా ప్రాజెక్టు కట్టారని, అసలైన ప్రాజెక్టుల్ని నిర్లక్ష్యం చేశారని మంత్రులు ఆరోపిస్తున్నారు. మరో వైపు.. కాంగ్రెస్‌పార్టీ నిర్ణయాలే తెలంగాణకు నష్టదాయకమంటూ బీఆర్ఎస్ తనదైన శైలిలో ఆరోపణలు గుప్పిస్తోంది. మొత్తానికి తెలంగాణలో నీటి పంచాయతీ నెలకొంది. ఈ క్రమంలో ఎవరు చెప్పేది నిజం అనేది సందిగ్ధంగా మారింది. గత ప్రభుత్వ పాలకులు చెబుతున్నది వాస్తవమా? లేక ప్రస్తుత ప్రభుత్వాధినేతల వాదనలు కరెక్టా? అనేది తేలాల్సి ఉంది.**

బీఆర్ఎస్ పాలనలో లోటుపాట్లను ఏరుతోన్న కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో నీటి పాపాలు మొత్తం కేసీఆర్‌వే అని దుమ్మెత్తి పోస్తున్నారు. ఏకంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కేసీఆర్ తీరుపై అంతెత్తున ఎగిసిపడుతున్నారు. కేసీఆర్ పాలనలోనే నదీ జలాలపై హక్కులను ఆంధ్రప్రదేశ్‌కు ధారాదత్తం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణా ప్రాజెక్టుల అప్పగింతకు అంగీకరించింది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని.. తాము ఒప్పుకోకున్నా తమపై అభాండాలు వేస్తున్నారని రేవంత్ ధ్వజమెత్తారు. అంతటితో ఆగకుండా, పక్క రాష్ట్ర పాలకులతో కుమ్మక్కై జలదోపిడీకి కేసీఆర్ సహకారం అందించారని కూడా ఆరోపణలు గుప్పించారు. అసెంబ్లీ సమావేశాల్లో సాగునీటిపై శ్వేతపత్రం విడుదల చేస్తామని కూడా స్పష్టం చేశారు.

"2022 మే 27వ తేదీన జరిగిన 16వ కృష్ణాబోర్డు సమావేశం ఎజెండాలోని 16.7వ అంశం కింద ప్రాజెక్టు కాంపొనెంట్‌లను అప్పగించడానికి అభ్యంతరం లేదని చెప్పారు. 2023 మే 19న 17వ కృష్ణాబోర్డు సమావేశంలోనూ ప్రాజెక్టులను అప్పగిస్తామని అంగీకరించారు. 2023-24 రాష్ట్ర బడ్జెట్‌లో శ్రీశైలం, నాగార్జునసాగర్ కాంపొనెంట్లతో పాటు గోదావరి బేసిన్‌లో పెద్దవాగును అప్పగించడానికి అంగీకరించినట్లు స్పష్టంగా పేర్కొన్నారు. సీడ్‌మనీ కింద ఒక్కో బోర్డుకు రూ.200 కోట్ల చొప్పున కేటాయించాలని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ఈ మొత్తం వ్యవహారంలో మామా అల్లుళ్లు కేసీఆర్, హరీశ్‌రావు ఉన్నారు" అని సీఎం రేవంత్‌రెడ్డి కుండబద్దలు కొట్టారు.

గత తొమ్మిదిన్నరేళ్ల కాలంలో కేంద్రానికి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కేసీఆర్ సర్కారు పూర్తిగా లొంగిపోయిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న 811 టీఎంసీల్లో ఆంధ్రప్రదేశ్ 512, తెలంగాణకు 299 టీఎంసీలు మాత్రమే వినియోగించుకునేలా 2015లోనే కేంద్రం వద్ద కేసీఆర్ ఒప్పందం చేసుకున్నారని మండిపడ్డారు. తెలంగాణ నీటి హక్కులను శాశ్వతంగా ఆంధ్రప్రదేశ్‌కు ధారాదత్తం చేసిన ఘనుడు కేసీఆర్ అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. సాగునీటి రంగంపై అసెంబ్లీలో చర్చకు రావాలని సవాల్ విసిరారు.

శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులను కృష్ణానదీ యాజమాన్యబోర్డుకు అప్పగించడం వల్ల తెలంగాణకు తీవ్ర నష్టం వాటిల్లిందని బీఆర్ఎస్ ఆరోపణలు చేసిన నేపథ్యంలో నీటిపారుదల, అటవీశాఖల మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కొండా సురేఖతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర సచివాలయంలో మాట్లాడారు. కృష్ణా, గోదావరి ప్రాజెక్టులను బోర్డులకు స్వాధీనం చేసే విషయంలో కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్‌లు తాము చేసిన పాపాలను కప్పిపుచ్చుకుని.. వాటిని కాంగ్రెస్‌పై నెట్టేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపణలు చేశారు. మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇలాంటి నిర్ణయమేదీ తీసుకోలేదని, ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం విధి విధానాలను కేంద్రం రూపొందించాల్సి ఉందని, కానీ, ప్రతి అంశం తనను అడిగే చేశారని, ఈ చట్టానికి తానే రూపకల్పన చేశానని కేసీఆర్ గతంలోనే చెప్పారని గుర్తు చేశారు. ఆ రోజు 50 శాతం కావాలని అడగకపోగా, ఈ రోజు సగం నీళ్ల రావాలంటున్నారని ఎద్దేవా చేశారు. తొలుత ఒక్క సంవత్సరానికే అని చెప్పి.. 2019 వరకు ఏటా 299 టీఎంసీలు మాత్రమే తెలంగాణకు ఇచ్చేలా కొనసాగించారని కుండబద్దలు కొట్టారు.

ప్రగతి భవన్ వేదికగానే రాయలసీమ ఎత్తిపోతలకు కుట్ర జరిగిందన్నారు రేవంత్‌రెడ్డి. 2020 జనవరి 14న ప్రగతిభవన్‌లో రెండు రాష్ట్రాల సీఎంలు కేసీఆర్, జగన్ కలిసి ఆరుగంటల పాటు సమీక్షించారని, రాయలసీమ ఎత్తిపోతల నుంచి రోజుకు 8 టీఎంసీలు తరలించుకునిపోయేలా అనుమతించారని, శ్రీశైలం కనీస మట్టం 834 అడుగులైతే, 797 అడుగుల మట్టం నుంచి అంటే బురద నీటిని కూడా తీసుకెళ్లేలా 2020 మే నెల 5న ఎత్తిపోతల పథకాన్ని జీవో 203తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిందన్నారు. తెలంగాణ అధీనంలోని నాగార్జునసాగర్ ప్రాజెక్టును.. ఏపీ సీఎం జగన్ తమ సాయుధ పోలీసులను పంపి ఆక్రమిస్తే అప్పటి ముఖ్య మంత్రి కేసీఆర్ ఒక్క మాట కూడా మాట్లాడలేదని విమర్శించారు.

2020 ఆగస్టు 5వ తేదీన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశం ఏర్పాటు చేసిందని, దీని ఎజెండాలో రాయలసీమ ఎత్తిపోతల పథకం ఉందని, కానీ 20వ తేదీ వరకు బిజీగా ఉన్నామని, తర్వాత సమావేశం ఏర్పాటు చేస్తే వస్తామని నీటిపారుదలశాఖ కార్యదర్శితో కేసీఆర్ లేఖ రాయించారని.. దీనికి కారణం పదో తేదీన రాయలసీమ ఎత్తిపోతల టెండర్ ఉండడమే అని రేవంత్ వివరించారు. దాన్ని మేఘా కృష్ణారెడ్డికి అప్పగించడానికి ఆటంకం కలగకూడదనే ఆ సమావేశానికి రాలేమని చెప్పించారని.. ఐదో తేదీన బోర్డు సమావేశానికి హాజరై గట్టిగా పట్టుబడితే రాయలసీమ టెండర్ వాయిదా పడేదని రేవంత్ అభిప్రాయపడ్డారు.

అంతేకాదు.. బీఆర్ఎస్ నేతలకు రేవంత్ తనదైన శైలిలో సవాల్ విసిరారు. సాగునీటి రంగంపై అసెంబ్లీలో శ్వేతపత్రం ప్రవేశపెడతామని.. దీనిపై 48 గంటల పాటు చర్చిస్తామని.. చర్చకు రమ్మని కేసీఆర్‌కు సవాల్ విసురుతున్నారు. కేటీఆర్, హరీశ్‌రావు కూడా చర్చలో పాల్గొనవచ్చని, కవిత కూడా మాట్లాడతానంటే ఉభయసభల సమావేశం ఏర్పాటు చేస్తామని రేవంత్ చెప్పారు. కేసీఆర్ మాట్లాడేందుకు పూర్తి అవకాశం ఇస్తామని.. ఒక్క నిమిషం కూడా మైక్ కట్ చేయబోమని.. ఎవరు తెలంగాణకు ద్రోహం చేశారో తేలిపోతుందని రేవంత్



# లో నీటి పంచాయతీ

సుజాత గోపగోని, 6302164068

అన్నారు. . శ్రీశైలం నుంచి నీటిని తీసుకునే అన్ని ప్రాజెక్టులను పూర్తి చేసినా తెలంగాణ తీసుకోగలిగేది రోజుకు రెండు టీఎంసీలే అని.. కానీ ఆంధ్రా మాత్రం రోజుకు 12 నుంచి 13 టీఎంసీలు తీసుకుంటుందని వెల్లడించారు. వారం రోజులు కళ్లు మూసుకుంటే శ్రీశైలం నుంచి 100 టీఎంసీలు పోతాయని, తర్వాత బురదే మిగులుతుందని రేవంత్‌రెడ్డి హెచ్చరించారు.

అందుకే నీటి వినియోగం ప్రస్తుతం 50 శాతం చొప్పున ఉండాలని కేంద్రానికి చెప్పామన్నారు రేవంత్‌రెడ్డి. నికరజలాలు కేటాయించాక ఏ ప్రాజెక్టు నుంచి ఎంత అనే స్పష్టత వస్తుందన్నారు. ఆ తర్వాతే ప్రాజెక్టుల అప్పగింతపై చర్చ జరుగుతుందన్నారు. తెలంగాణ తరపున గత ప్రభుత్వం సుప్రీంకోర్టులో కేసు వేసి, ఎనిమిదేళ్ల తర్వాత ఉపసంహరించుకుని.. రెండు రాష్ట్రాల మధ్య అంశంగా ట్రైబ్యునల్‌కు పంపిందన్నారు. మహారాష్ట్ర, కర్ణాటకలను కూడా ఇందులోకి తెమ్మని కోరామని.. ఈ ప్రయత్నం చేస్తున్నామని రేవంత్ చెప్పారు.

మరోవైపు.. ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాజకీయ పోరాటం చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టుల్ని కేంద్రానికి అప్పగించిందని బీఆర్ఎస్ వాదిస్తోంది. కృష్ణా నదీ జలాల వివాదం, యాజమాన్య నిర్వహణ అంశంలో కాంగ్రెస్ పార్టీని ప్రజల ముందు దోషిగా నిలబెట్టాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వ్యూహాలు రచిస్తున్నారని చెబుతున్నారు. అసెంబ్లీ సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీపై గట్టిగా కౌంటర్ అటాక్ చేయాలని బీఆఎస్ నిర్ణయించిందంటున్నారు. ఈ మేరకు కృష్ణా నదీ పరివాహక ప్రాంతమైన దక్షిణ తెలంగాణ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కృష్ణా బేసిన్‌లో ఉన్న ఉమ్మడి ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడంపై పార్టీ



రేవంత్‌రెడ్డి

భవిష్యత్తు కార్యాచరణను ఖరారు చేశారు. అలాగే అసెంబ్లీ సమావేశాలలో అనుసరించాల్సిన వ్యూహంపై కూడా చర్చించారు. వీటితో పాటు క్యాబినెట్‌లో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై ప్రధానంగా చర్చించారు. ప్రాజెక్టులు కేంద్రం చేతిలోకి వెళ్తే తాగడానికి కూడా నీరు ఉండదని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. అయితే అసలు బీఆర్ఎస్ విభజన చట్టం కింద ఎప్పుడో ప్రాజెక్టుల్ని కేంద్రానికి అప్పగించిం దని.. కాంగ్రెస్ పత్రాలు చూపించింది. నీటి పంపకాల్లో వాటాలకు అనుమతించి సంతకాలు కూడా చేశారని చెబుతున్నారు. అయితే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల రోజున ఏపీ సర్కార్ సాగర్ ప్రాజెక్టును ఆక్రమించుకున్న విధానంతో.. కేంద్రం మరోసారి అలాంటి వివాదాలు రాకుండా నిర్వహణను తన చేతుల్లోకి తీసుకోవాలని నిర్ణయించడంతో మరో చాయిస్ లేకుండా పోయింది.

నిజానికి పదేళ్ల కాలంలో దక్షిణ తెలంగాణ ప్రాజెక్టులపై కేసీఆర్ పెద్దగా దృష్టి పెట్టలేదన్న ఆరోపణలు ఉన్నాయి. పూర్తిగా కాళేశ్వరం కోసమే ఖర్చు పెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలోనూ ఇలాంటి చర్చ జరిగింది. మహబూబ్ నగర్ జిల్లాలో నిర్మించాల్సిన ఎస్ఎల్‌బీసీ, కల్వకుర్తి ఎత్తిపోతల ప్రాజెక్టులు ఎప్పుడో పూర్తి కావాల్సి ఉంది. కానీ ఇంకా ప్రారంభం కాలేదు. దక్షిణ తెలంగాణ కరువు తీర్చేస్తుందని ఆశపడ్డ పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు ఎక్కడ ఉంది అక్కడే ఉంది. ఎన్నికలకు ముందు కేసీఆర్ ఓ మోటార్ ఆన్ చేశారు. కానీ ప్రాజెక్టు ఇంకా నలభై శాతం కూడా పూర్తి కాలేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టును పూర్తి చేసి ఉంటే పది లక్షల ఎకరాలకు నీరు అందేదని చెబుతున్నారు. శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగ మార్గం పని రాష్ట్ర పునర్విభజన నాటికి 30 కి.మీ. పూర్తయింది. పది కి.మీ. పెండింగ్‌లో ఉండగా.. గత పదేళ్లలో ఒక కి.మీ. మాత్రమే పూర్తి చేశారు. ఇది పూర్తయితే మూడున్నర లక్షల ఎకరాలకు గ్రావిటీ ద్వారా నీళ్లందుతాయి. కేసీఆర్ ఉద్దేశపూర్వకంగా పనులు చేయలేదని ప్రజల ముందుకు తీసుకెళ్తోంది. పాలమూరు– రంగారెడ్డికి రూ.30 వేల కోట్లు ఖర్చుచేసినా ఎకరాకు కూడా నీరివ్వలేదని కాంగ్రెస్ గుర్తు చేస్తోంది.అదే సమయంలో దక్షిణ తెలంగాణ జిల్లాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేశారని రేవంత్ రెడ్డి ఆరోపిస్తున్నారు. డిండి, పాలమూరు ఎత్తిపోతల పథకాలకు ఒకే దగ్గరి నుంచి నీటిని తరలించే విధంగా ప్రాజెక్టులను పూర్తిచేస్తే నల్లగొండ, పాలమూరు జిల్లాల మధ్య పోరాటాలు జరుగుతాయన్న ఆందోళన ఉందంటు న్నారు. బీఆర్ఎస్ తరపున దక్షిణ తెలంగాణ నేతల చేతగానితనం వల్లే దక్షిణ తెలంగాణకు, పాత మహబూబ్‌నగర్ జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది.

ఈ క్రమంలోనే పెండింగ్ ప్రాజెక్టుల్లో చిన్నచిన్న పనులు చేస్తే.. త్వరగా పూర్తయ్యే వాటికి తొలి ప్రాధాన్యం ఇస్తామంటున్నారు రేవంత్. శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగ మార్గం పని రాష్ట్ర పునర్విభజన నాటికి 30 కిలోమీటర్లు పూర్తయింద న్నారు. పది కిలో మీటర్లు పెండింగ్‌లో ఉండగా.. గత పదేళ్లలో ఒక కిలో మీటర్ మాత్రమే పూర్తి చేశారని.. ఇది పూర్తయితే మూడున్నర లక్షల ఎకరాలకు గ్రావిటీ ద్వారా నీళ్లందుతాయన్నారు రేవంత్. ఉమ్మడి రాష్ట్రంలో కంటే ఎక్కువగా నిర్లక్ష్యానికి గురైన ఈ ప్రాజెక్టును 18 నెలల్లోగా పూర్తి చేయాలన్నది లక్ష్యమన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల కూడా ఇంతేనని.. పాలమూరు– రంగారెడ్డికి 30 వేల కోట్ల రూపాయలు ఖర్చుచేసినా ఎకరాకు కూడా నీరివ్వలేదని మండిపడ్డారు. కాళేశ్వరంపై విచారణకు న్యాయమూర్తిని కేటాయించాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కోరామన్నారు. సమాధానం రాగానే చర్యలు తీసుకుంటామని.. మేడిగడ్డ కుంగుబాటుపై సీడబ్ల్యూసీ, నేషనల్ డ్యాం సేఫ్టీ, అనుభవజ్ఞులైన ఇంజినీర్లతో కమిటీ ఏర్పాటు చేసి, వారి నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

వైసీపీ ప్రభుత్వం విధానాలు నిరుద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేశాయి. అటు ప్రతిపక్ష నేతగా, ఇటు సీఎంగా 2.30 లక్షల ఉద్యోగాలను జాబ్ క్యాలెండర్ ద్వారా భర్తీచేస్తామని ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడమే దీనికి కారణం. ప్రభుత్వోద్యోగాల కోసం వేలకు వేలు ఖర్చుచేసి ఏళ్ల తరబడి కోచింగ్ తీసుకుని ఆర్థికంగా కొందరు నష్టపోగా, వయసు పెరిగి కొందరు ఉద్యోగార్హతను కోల్పోయారు. పోనీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలైనా వస్తాయనుకుంటే అవికూడా రాక అభ్యర్థులు నిరుత్సాహానికి లోనయ్యారు. కొత్త పరిశ్రమలు కూడా రాకపోవడంతో ఈ రంగంలోనూ ఉపాధి కరవై కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. డెలివరీబాయ్‌లుగా, ఆటోలు నడుపుకోవడం తప్ప ఉద్యోగాలు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఇక ఎన్నికలు మరో రెండు నెలల్లో రానుండటంతో ప్రభుత్వం మరల నిరుద్యోగులను మోసం చేసేందుకు ప్రయత్నిస్తోంది. గ్రూప్ -2, జూనియర్ కళాశాలల లెక్చరర్లు, పాలిటెక్నిక్ కళాశాలల లెక్చరర్లు వంటి కొన్ని ఉద్యోగాలకు అరకొర పోస్టులు ప్రకటించి వాటికి నోటిఫికేషన్లు విడుదల చేసింది. ఇటీవల విడుదల చేసిన డీఎస్‌సీ-24 పరిస్థితి కూడా ఇంతే. 25 వేల ఖాళీలుండగా కేవలం 6 వేల ఉద్యోగాలు భర్తీకి నోటిఫికేషన్లు ఇవ్వడంతో అభ్యర్థులు మండిపడుతున్నారు.

# వైకాపా విధానాలతో ని

కొన్ని వారాలలో ఎన్నికల నగారా మోగనున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ ఎంపిక ప్రక్రియను ప్రకటించింది. మొత్తం 6,100 పోస్టులను భర్తీ చేస్తామని, దశల వారీగా టెట్, ఆ తదుపరి డీఎస్సీ నిర్వహిస్తామని, ఒకట్రెండు రోజుల్లోనే నోటిఫికేషన్ వెలువరిస్తామని తెలిపింది. ఎన్నేళ్లుగానో ఎదురుచూస్తున్న ఉపాధ్యాయ అభ్యర్థులకు ఈ వార్త గొప్ప ఉత్సాహాన్ని కలిగించాలి. కానీ, అందుకు బదులు భారీ ఆశల మీద నీళ్లు కుమ్మరించి నట్లయింది. అభ్యర్థుల ఆశలకు తగ్గట్టుగా కాక అధికార పార్టీ ఎన్నికల అవసరాలకు తగ్గట్టుగా, తూతూ మంత్రంగా ఈ ప్రకటన ఉండటమే అందుకు కారణం. పాదయాత్ర సమయంలో వైసీపీ అధినేత ఉద్యోగ, నిరుద్యోగ బృందాల మీద ఎంతో ప్రేమ ఒలకపోశారు. రాష్ట్రంలో 23 వేల ఉపాధ్యాయ ఖాళీలు ఉండగా, వాటిని భర్తీ చేయకుండా చంద్రబాబు ఏం చేస్తున్నారంటూ ప్రశ్నలు గుప్పించారు. తాము అధికారంలోకి వచ్చీ రాగానే మెగా డీఎస్సీని ప్రకటించి, అటు పాఠశాల విద్యను, ఇటు ఉపాధ్యాయ అభ్యర్థుల జీవితాలను ఉద్ధరిస్తామని హామీలు గుప్పించారు. కానీ, సీఎం అయ్యాక ఆ విషయం పూర్తిగా మర్చిపోయారు. పాఠశాల విద్యలో పెను మార్పులు తెస్తున్నామంటూ హడావిడి చేయటం నిత్యకృత్యంగా పెట్టుకున్నారు. విలీనం పేరుతో వేలాది పాఠశాలలను మూసేసి, పోస్టులను కుదించారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన, పాఠశాలలకు హంగులూ అలంకరణ అంటూ ఆర్భాటంగా ప్రచారం చేసుకున్నారు. బోధనకు అవసరమైన పోస్టుల భర్తీని మాత్రం విస్మరించారు. దీంతో, ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఐదారు లక్షల మంది ఉపాధ్యాయ అభ్యర్థులకు మరో ఐదేళ్ల వయసు మీరింది. ప్రభుత్వ ఉద్యోగం పొందగలమన్న ఆత్మవిశ్వాసం వారిలో రోజురోజుకూ సన్నగిల్లు తోంది. ఈ దశలో ప్రభుత్వం ఉన్న ఖాళీలను దాచిపెట్టి, కంటితుడుపు చర్యగా పోస్టుల భర్తీని ప్రకటించటం నిరుద్యోగులను మోసగించటమే!



వైఎస్ జగన్

**పలు జిల్లాల్లో ఆందోళన**

ఎన్నికలకు రెండు నెలల ముందు అరకొర పోస్టులతో డీఎస్సీ ప్రకటించడంపై నిరుద్యోగులు ఉద్యమిస్తున్నారు. ఉపాధ్యాయ పోస్టుల సంఖ్యను పెంచాలని, అసెంబ్లీ బడ్జెట్లో ఆ దిశగా ఆమోదించా లని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందుతున్న అభ్యర్థు లంతా రోడ్డెక్కారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినది స్తున్నారు. కృష్ణాజిల్లా అవనిగడ్డ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు, అనంత పురం, చిత్తూరు, కడప, ఏలూరు, కాకినాడ, విశాఖ, శ్రీకాకుళం తదితర ప్రాంతాల్లో నిరసనలు ప్రారంభ మయ్యాయి. పలు జిల్లాల్లో కలెక్టరేట్‌ల ముట్టడికి నిరుద్యోగులు ప్రయత్నించారు. డీఎస్సీ అభ్యర్థుల నిరసనలకు నిరుద్యోగ, విద్యార్థి, యువజన సంఘాలు సంఘీభావం తెలుపుతున్నాయి. రాష్ట్ర స్థాయి ఉద్యమానికి నిరుద్యోగ సంఘాలు కార్యాచరణ రూపొందిస్తున్నాయి. గతంలో మెగా డీఎస్సీ ఇవ్వాలంటూ సీఎం క్యాంపు కార్యాలయం ముట్టడికి విద్యార్థి, యువజన సంఘాలు పిలుపునిచ్చాయి. ఆందోళనలు, ధర్నాలు, నిరసనలు చేపట్టాయి. ఇటీవల విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ క్యాంపు కార్యాలయం ఎదుట ఆందోళనలు నిర్వహించారు. ప్రభుత్వం దిగివచ్చి మెగా డీఎస్సీ ఇస్తుందని నిరుద్యోగులు ఆశించగా, అందుకు విరుద్ధంగా మొక్కుబడిగా డీఎస్సీని ప్రకటించింది. నిరుద్యోగులంతా ఆగ్రహంతో ఉన్నారు. 2022 టెట్ పరీక్ష 6.50 లక్షల మంది నిరుద్యోగులు రాశారు. ప్రస్తుత డీఎస్సీకి ఆ సంఖ్య ఏడు లక్షలకు చేరే అవకాశముంది. ఐదేళ్ల తర్వాత ప్రకటించిన డీఎస్సీలో కేవలం 6,100 ఉపాధ్యాయ పోస్టులు ఉండటంపై తప్పుపడుతున్నారు. రాష్ట్రంలో దాదాపు 25వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటన్నిటినీ భర్తీ చేయ కుండా, కేవలం ఎన్నికల ముందు నిరుద్యోగులను మభ్యపెట్టేందుకు మొక్కుబడిగా డీఎస్సీని ప్రకటించింది. ఈ విధానం ద్వారా జిల్లాల వారీగా డీఎస్సీ పోస్టులు కుదించుకు పోతాయి. అనంతపురం జిల్లాలో నాలుగున్నరేళ్ల నుంచి నాలుగువేల మంది

టీఎన్. భూషణ్



# రుద్యోగుల్లో తీవ్ర నిరాశ

డీఎస్సీ కోసం వేచిచూస్తుంటే, అక్కడ కేవలం నాలుగు ఎస్జీటీ పోస్టులను మాత్రమే ఖాళీలను చూపించారు. అతి తక్కువ పోస్టులను చూపించడంపై ప్రతిపక్షాలు ధ్వజమెత్తుతున్నాయి. ఉన్న పోస్టులన్నీ పెంచి డీఎస్సీని ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నాయి.

**మరల అప్రెంటీస్ విధానం**

అప్రెంటీస్ విధానం ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం పైనా నిరుద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు తూర్పారబడుతున్నాయి. రెండేళ్లపాటు అప్రెంటీస్ విధానంతో ఉపాధ్యాయులను ఎంపిక చేయడం వల్ల వారికి ఉద్యోగ భద్రత లేకుండా పోతుంది. గతంలోని అప్రెంటీస్ విధానంపై ఉపాధ్యాయ సంఘాల ఆందోళనతో రద్దయింది. మళ్లీ వైసీపీ ప్రభుత్వం అప్రెంటీస్ విధానాన్ని తీసుకురావడంపై నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

ఇదే విధానం రాబోయే అన్ని ఉద్యోగాలకు వర్తింపజేసే అవకాశముంది. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగాలను పోటీ పరీక్ష ద్వారా ఎంపిక చేశారు. ఆ తర్వాత వారికి ఉద్యోగాల క్రమబద్ధీకరించవలసి ఉండగా, రెండేళ్లు పూర్తయిన వారికి ఏపీపీఎస్సీ ద్వారా డిపార్టుమెంటల్ పరీక్షలు రాయించేలా నిబంధన విధించారు. అందులో అర్హత పొందిన వారి ఉద్యోగాలనే క్రమబద్ధీకరించారు. తాజాగా డీఎస్సీ పోస్టుల భర్తీలో ఈ అప్రెంటీస్ విధానాన్ని ప్రభుత్వం తెరపైకి తేవడంతో నిరుద్యోగులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. తక్షణమే అప్రెంటీస్ విధానానికి స్వస్తి పలికి, ఉపాధ్యాయ పోస్టులను నేరుగా భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

**నిరుద్యోగులకు నయవంచన**

ప్రతిపక్షంలో ఉన్న సమయంలో వైసీపీ నోటికొచ్చిన హామీలు ఇచ్చుకుంటూపోయింది. అధికారంలోకి వచ్చాక సీపీఎస్ రద్దు, మద్యనిషేధం వంటి హామీలు అమలుచేయడం తమ వల్ల కాదని చేతులెత్తేసింది. అదే తరహాలో నిరుద్యోగులను ఆకట్టుకునేందుకు అప్పట్లో జాబ్ క్యాలెండర్ అని పెద్దఎత్తున ప్రచారం చేశారు. తాము అధికారంలోకి రావడమే ఆలస్యం ఉద్యోగాలన్నీ భర్తీ అయిపోతాయి అన్న స్థాయిలో హామీల వర్షం కురిపించారు. 2019 నాటికే 2.3 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వాటిని అధికారంలోకి రాగానే భర్తీ చేస్తామని నమ్మించారు.

కానీ, అధికారంలోకి వచ్చాక ఏపీపీఎస్సీ ద్వారా పట్టుమని పదివేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదు. చివరికి అటూ ఇటూగా 5వేల ఉద్యోగాలు మాత్రమే ఇవ్వగలిగారు. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగాలు భర్తీచేసి, వలంటీర్లను నియమించి అవే ఉద్యోగాలు అని ప్రచారం చేశారు. అప్పట్లో ముఖ్యమంత్రి తన మాట నిలబెట్టుకుని చెప్పినట్లుగా చూస్తే 2019 నాటికే 2.3 లక్షల ఖాళీలుంటే, ఈ ఐదేళ్లలో ఆ సంఖ్య ఇంకా భారీగా పెరిగి ఉంటుంది. కానీ, ఇప్పుడు అసలు ఖాళీలే లేవన్నట్టుగా ఉద్యోగాల భర్తీని ప్రభుత్వం కొండెక్కించింది.

**అన్ని అంశాల్లో అంతే...**

2022 నవంబరులో ప్రకటించిన 6 వేల పోలీసు కానిస్టేబుళ్ల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ఇంకా కొనసాగుతూనే ఉంది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న యూనివర్సిటీల్లోని ఖాళీల విషయంలోనూ జగన్ ప్రభుత్వం నిరుద్యోగులను నిండా ముంచింది. నాలుగేళ్లపాటు పట్టించుకోకుండా చివరి ఏడాది భర్తీ చేస్తామని ప్రకటించింది. గతేడాది జూలైలో నోటిఫికేషన్లు ఇస్తామని స్వయంగా సీఎం ప్రకటించినా అది అమలు కాలేదు. పోస్టుల రేషనలైజేషన్ అంటూ ఉన్నత విద్యామండలి ఉద్దేశపూర్వకంగా జాప్యం చేసి, ఏడాది చివర్లో నోటిఫికేషన్లు ఇచ్చింది.

రేషనలైజేషన్‌ను గందరగోళం చేయడంతో అనేకమంది కోర్టుకు వెళ్లే పరిస్థితి వచ్చింది. చివరికి ఇది న్యాయస్థానం ఆదేశాలతో ఆగిపోయింది. సీఎం ప్రకటించినట్లుగా జూలైలోనే నోటిఫికేషన్లు ఇచ్చి ఉంటే న్యాయ వివాదాలు కూడా వీగిపోయి ఈ సమయానికి ప్రక్రియ ప్రారంభమయ్యేది. ఉన్నత విద్యామండలి నిర్వాకంతో 3,200 పోస్టుల భర్తీ ఎటూ కాకుండా ఆగిపోయింది. పోనీ రేషనలైజేషన్ సక్రమంగా చేసినా న్యాయ వివాదాలు లేకుండా పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగేది. పోస్టుల భర్తీ చేయడం ఇష్టంలేకే ప్రభుత్వం ఇలా చేసిందని నిరుద్యోగులు మండిపడుతున్నారు. మొత్తంగా చూస్తే ఎన్నికలకు ముందు ఒక మాట.. అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మాట అన్న విధంగా నిరుద్యోగులను జగన్ ప్రభుత్వం నిండా ముంచింది.

**చివర్లో నోటిఫికేషన్లు**

వైసీపీ అధికారంలోకి వచ్చాక ఒకే ఒక్క గ్రూప్–1 నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేసింది. 89 పోస్టులకు ఇటీవల మరో నోటిఫికేషన్ జారీ చేసింది. ఇక, గ్రూప్–2 ఉద్యోగాల్లో ప్రభుత్వం నిరుద్యోగులను ఇంకా దారుణంగా మోసం చేసింది. నాలుగున్నరేళ్ల పాటు ఒక్కటంటే ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదు. ఎన్నికలు దగ్గరికొస్తున్నందున విమర్శలు పెరగడంతో 890 పోస్టుల ఇటీవల నోటిఫికేషన్ ఇచ్చింది. తాజాగా డిగ్రీ, పాలిటెక్నిక్, జూనియర్ లెక్చరర్లు, ఇతరత్రా కొన్ని పోస్టుల భర్తీకి నెల ముందు నోటిఫికేషన్లు జారీచేసింది.

ఈ మొత్తం నోటిఫికేషన్లకు దరఖాస్తుల ప్రక్రియ పూర్తయి, పరీక్షలు జరిగే సమయానికి ఎన్నికలు వస్తాయి. ఇక వాటి ప్రక్రియను పూర్తిచేసి ఉద్యోగాలు ఇవ్వడం వచ్చే ప్రభుత్వంలోనే జరుగుతుంది. అంటే ఈ ప్రభుత్వంలో నిరుద్యోగులకు నోటిఫికేషన్లు మాత్రమే మిగిలాయి.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

## రాముడిని దర్శించుకున్న ముస్లిం బృందం



అయోధ్య రామమందిర దర్శనానికి కొద్దిరోజులు ఆగి రావలసిందని తీర్థక్షేత్ర ట్రస్ట్ కోరుతోంది. ఒకటి విపరీతమైన రద్దీ. రెండు దారుణమైన శీతలం. ఇలాంటి పరిస్థితులలో కూడా లక్నో నుంచి బయలుదేరి ఆరు రోజుల తరువాత అయోధ్య చేరుకుని రాముడిని దర్శించుకున్నారు. జనవరి 25న వీరంతా బయలుదేరి, 150 కిలోమీటర్లు కాలి నడకన 'జైశ్రీరాం' అని నినాదాలు ఇచ్చుకుంటూ జనవరి 31న రామనగరి చేరుకున్నారు. ఇంతకీ వీరంతా ముస్లింలే. దాదాపు 350 మంది. ఆర్ఎస్ఎస్‌కు మద్దతు ఉండే ముస్లిం రాష్ట్రీయ మంచ్ (ఎంఆర్ఎం) సభ్యులు. షహీద్ సయీద్ ఈ యాత్రకు సమన్వయకర్తగా వ్యవహరించారు. 25 కిలోమీటర్లు నడిచి, రాత్రి కాగానే ఒకచోట బస చేసి మరునాడు వేకువనే మళ్లీ ప్రయాణం ఆరంభించేవారు. ఇమామ్ ఎ హింద్ శ్రీరాముడిని దర్శించుకోవడం గొప్ప అనుభవమని వారంతా చెబుతున్నారు. సమైక్యత, సఖ్యత, సార్వభౌమాధికారం, సామరస్యం అనే అంశాల గురించి ఒక సందేశం పంపడానికే తాము ఈ యాత్ర చేపట్టామని షహీద్ సయీద్ చెప్పారు. వీరంతా ఎంఆర్ఎం అయోధ్య శాఖ నాయకులు,రాజా రయీస్, షేర్ ఆలీఖాన్ నాయకత్వంలో రాములవారిని దర్శించుకున్నారు. శ్రీరాముడు తమ పూర్వీకుడని వీరంతా చెప్పారు. దేశం పట్ల గౌరవం, సాటి మనుషుల పట్ల సానుభూతి ఇవే ప్రధానమని కులం, మతం, వర్గం ఇవన్నీ తరువాత వస్తాయని వారంతా అన్నారు.

## మణిశంకర్ అయ్యర్ నోటి



ఢిల్లీలోని జంగ్‌పుర రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కాంగ్రెస్ ప్రముఖుడు, నోటి దురదకు పెట్టింది పేరు అయిన మణిశంకర్ అయ్యర్‌కు నోటీసులు జారీ చేసింది. జనవరి 22 నాటి ప్రాణప్రతిష్ఠను విమర్శిస్తూ సామాజిక మాధ్యమాలలో నీవు, నీ కూతురు శరణ్య అయ్యర్ పెట్టిన పోస్టులకి క్షమాపణ చెప్పాలి. లేదంటే జంగ్‌పురను వీడి వెళ్లాలి అన్నదే ఆ నోటీసుల సారాంశం. మీ నోటి దురదతో నిక్షేపంలాంటి మా కాలనీలో అశాంతిని రేపవద్దని కూడా ఆ తండ్రీకూతుళ్లను స్థానికులు హెచ్చరించారు. శరణ్య అయ్యర్ తండ్రిని మించిన తనయ వలె ఉన్నది. ప్రాణప్రతిష్ఠ రోజున తాను ఉపవాస దీక్ష చేపడతాననీ, ఆ విధంగా సాటి ముస్లింల దుఃఖానికి సాంత్వన చేకూరుస్తానని సామాజిక మాధ్యమాలలో పోస్టు

## అయోధ్యకు రోజుకు రెండు లక్షల మంది

అయోధ్య రామమందిర దర్శనానికి భక్తులు వెల్లువెత్తుతున్నారు. ఈ జనవరి 22న ప్రాణప్రతిష్ఠ జరిగినప్పటి నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు 25 లక్షల మంది భక్తులు బాలరామ్‌ను దర్శించుకున్నారు. రూ. 11 కోట్లు విరాళాలుగా వచ్చాయి. మొత్తం 11 రోజులలోనే 25 లక్షల మంది రాములవారిని దర్శించుకున్నారని అయోధ్య తీర్థక్షేత్ర ట్రస్ట్ ప్రకటించింది. విరాళాలలో రూ. 8 కోట్లు హుండీ ఆదాయంగాను (పది రోజుల లెక్క), రూ. 3.50 కోట్లు ఆన్‌లైన్ ద్వారా భక్తులు అందించారు. ప్రస్తుతం రోజుకు రెండు లక్షల వంతున భక్తులు వస్తున్నారని తీర్థక్షేత్ర ట్రస్ట్ కార్యాలయం అధికారి ప్రకాశ్ గుప్తా చెప్పారు. ఈ ధనాన్ని సీసీ టీవీ నీడలో 11 మంది బ్యాంకు ఉద్యోగులు, ముగ్గురు తీర్థక్షేత్ర

## అయోధ్య మా అమ్మమ్మగారింటి వంటిదని చెప్పిన దక్షిణ కొరియా

ప్రభు రాముడిని చూడాలన్న తహ తహ కేవలం భారతీయులలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తోంది. కొందరు కుతూహలంతో రావాలనుకుంటుంటే, కొందరు మాత్రం బంధుత్వం కలుపుకొని రావాలనుకుంటున్నారు. తమ పూర్వీకురాలైన రాణి హెయో హ్వాంగ్-ఒక్, అయోధ్య యువరాణి సురిరత్న అని, ఆమె సముద్రాలు దాటి వచ్చి తమ రాజు కిమ్ సురోను వివాహం చేసుకుందని కొరియన్ల విశ్వాసం. కనుక, వారు అయోధ్యను తమ అమ్మమ్మగారి ఇల్లులా, ప్రభు శ్రీరాముడిని తమ వంశ పెద్దగా భావిస్తారు. అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ జరిగినప్పటి నుంచి దక్షిణ కొరియాలో కూడా భారత్‌కు రావాలన్న కలకలం మొదలైంది.

అయోధ్య రామమందిరంలో ప్రాణ ప్రతిష్ఠతో భారత్, కొరియాల మధ్య సాంస్కృతిక సంబంధాలు మరింత బలపడనున్నాయి. కొరియా జానపద కథల ప్రకారం అయోధ్య యువరాణి సురిరత్న (కొరియన్ రాణి హెయో హ్వాంగ్-ఒక్), సముద్రాలను దాటి కొరియాలో గయ రాజ్యాన్ని





స్థాపించిన రాజు కిమ్ సురోను వివాహం చేసుకుంది. ఈ కథ భారతదేశంలో విస్తృతంగా ప్రచారంలో లేనప్పటికీ, దక్షిణ కొరియాలో దాదాపు 60లక్షల మంది ప్రజలు తాము రాణి హెయో హ్వాంగ్-ఒక్ వంశానికి చెందినవారమని చెప్పుకుంటారు. వారికి అయోధ్య చారిత్రిక నగరం కాదు, మాతృపూర్వీకుల నివాసం. ఇటీవల జరిగిన ప్రాణప్రతిష్ఠను వారు తమ ఇళ్లనుంచే ఆన్‌లైన్‌లో అత్యంత గౌరవంతో వీక్షించారు. ఇప్పుడు స్వయంగా తామే వచ్చి ఆలయాన్ని సందర్శించాలని వారు కోరుకుంటున్నారు.

ముఖ్యంగా కరక్ వంశానికి చెందిన వారికి అయోధ్య ప్రత్యేకమైనది. ఇక్కడ 2001లో సరయూ నది ఒడ్డున ఏర్పాటు చేసిన 'క్వీన్ హెవో మెమోరియల్ పార్క్'ను సందర్శించి, అక్కడ ఆమెకు నివాళులు అర్పిస్తారు. అందుకే, 'అయోధ్య ను మేం మా అమ్మమ్మగారిల్లులా చూస్తాం కనుక అది మాకు చాలా ప్రత్యేకమైనది,' అని 'సెంట్రల్ కరక్ క్లాన్ సొసైటీ' సెక్రెటరీ జనరల్ కిమ్ చిల్ – సూ పేర్కొంటారు.

దాదాపు రెండువేల చదరపు మీటర్ల ప్రాంతంలో విస్తరించిన క్వీన్ హెవో మెమోరియల్ పార్క్ ను కొరియా శిల్పకళా శైలిలో నిర్మించారు. ఇందులో ఒక ధ్యానమందిరం, రహదారులు, ఫౌంటేన్, కుడ్య

## దురద, కాలనీ సంఘం వాత

పెట్టింది. అవతలి మతం వారి మనోభావాలను దెబ్బ తీసేటట్టు పోస్టులు పెట్టినా, ఆ విధంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా ఇక్కడ ఎవ్వరూ సహించరని కూడా తెగేసి చెప్పారు. ఇంకో చక్కని మాట కూడా చెప్పారు. తమరు ఏం వాగినా గుడ్డిగా వెళ్లిపోయే జనం ఉన్న కాలనీకి పోయి అక్కడ ఇలాంటి పోస్టులు పెట్టుకోవచ్చు. ఇక్కడైతే సాధ్యం కాదు అని కూడా ఆ కాలనీ వాసులు గట్టిగానే చెప్పారు. హిందువుల మనోభావాలను, విశ్వాసాలను ఇంకా ఎద్దేవా చేస్తామంటే కుదరదన్న సంగతి ఈ సంఘటనతో కూడా రుజువు అవుతున్నదని బీజేపీ ఐటీ సెల్ అధిపతి అమిత్ మాలవీయ అన్నారు.

## భక్తులు



ట్రస్ట్ సభ్యులు లెక్కించారు. మొత్తం నాలుగు హుండీలు ఏర్పాటు చేశారు. అయోధ్యకు తీర్థక్షేత్ర ట్రస్ట్ పేరుతో విరాళాలు ఇచ్చినట్టయితే సెక్షన్ 80జి కింద పన్ను మినహాయింపు కూడా ఇస్తున్నారు.

## కరక్ వంశస్థులు

చిత్రాలు, ఆడియో – వీడియో సౌకర్యాలతో, రాణి హెవో హ్వాంగ్–ఒక్, రాజు కిమ్ సురోలకు అంకితం చేసిన మండపాలతో సుందరంగా ఉంటుంది.

ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం, దక్షిణ కొరియాలోని గిమ్‌హే నగరానికి మధ్య భాగస్వామ్యమే ఈ పార్క్ ఏర్పాటుకు, నిర్వహణకు తోడ్పడడమే కాక, రెండు దేశాల మధ్య సాంస్కృతిక బదలాయింపును, సంబంధాలను ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే పలువురు అయోధ్యను సందర్శించేందుకు ప్రణాళికలు వేసుకుంటున్నారు. ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఆన్‌లైన్‌లో వీక్షించిన వీరిలో అనేకమంది ఆలయ వివాదం గురించి చదివి ఉన్న వారే కావడం విశేషం. ఈ పవిత్ర నగరాన్ని సందర్శించి, రామమందిర ఆధ్యాత్మిక శోభను కళ్లారా చూసేందుకు వారు తహతహ లాడుతున్నారు. కాలాన్ని, దూరాన్ని అధిగమించిన పంచుకున్న వారసత్వం, కొనసాగుతున్న సాంస్కృతిక సంబంధాలకు ఇది తార్కాణంగా నిలుస్తుంది.

## డీఎంకే ప్రభుత్వం హిందూ వ్యతిరేకి కాదు

### సుప్రీం కోర్టుకు చెప్పిన తమిళనాడు డీజీపీ




అయోధ్య రామమందిరంలో ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా తమిళనాడు రాష్ట్రంలో చోటు చేసుకున్న పరిణామాలు అందరికీ తెలిసినవే. పోలీసులు, ప్రభుత్వం రామభక్తులు ఏ కార్యక్రమం చేయకుండా అడుగడుగునా మోకాలడ్డుతూ వచ్చారు. తాము ఆ కార్యక్రమాన్ని చూడాలన్న పట్టుదలతో భక్తులు కోర్టుకు వెడితే తప్ప వారికి అనుమతి లభించని విషయం తెలిసిందే. ఈ క్రమంలో కేసు సుప్రీం కోర్టుకు చేరడంతో రాష్ట్ర డిజిపి దీనిపై వివరణ ఇచ్చుకోవలసి వచ్చింది. ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఉత్సవాలు జరుపుకునేందుకు అనుమతి కోరుతూ దరఖాస్తు చేసుకున్న 288లో కేవలం 4కి మాత్రమే అనుమతినిచ్చినట్టు తమిళనాడు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సుప్రీం కోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో అంగీకరించారు. మద్రాసు హైకోర్టు జోక్యం లేని సమయంలో తాము తీసుకున్న నిర్ణయమదని తెలిపారు. అలా అని పిటిషనర్ పేర్కొన్నట్టుగా రాష్ట్ర ప్రభుత్వం హిందూ వ్యతిరేకి కాదంటూ సమర్థించు కున్నారు. 'ప్రాణ ప్రతిష్ఠ' కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాలపై తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం అప్రకటిత నిషేధాన్ని ప్రకటించిన నేపథ్యంలో, పిటిషనర్లు దానిని ఎత్తివేయాలని కోరుతూ కోర్టును ఆశ్రయించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ వివరణను సుప్రీం కోరి నప్పుడు అటువంటి నిషేధాలేమీ లేవంటూ పేర్కొంది. అయితే, ఇప్పుడు డిజిపి దాఖలు చేసిన అఫిడవిట్ ప్రకారం, హైకోర్టు ఉత్తర్వులు జారీ చేయకముందు 288 దరఖాస్తులు రాగా, అందులో కేవలం 4కు అనుమతించారు. వీటిలో 146దరఖాస్తులను తిరస్కరించగా, 138 ధ్రువీకరణ కోసం పెండింగ్‌లో పెట్టారు. కాగా, బహిరంగ ప్రదేశాలలో ప్రత్యక్ష ప్రసారాలకు అనుమతించాలంటూ దాఖలైన 22 దరఖాస్తులను తిరస్కరించినట్టు అందులో డిజిపి పేర్కొన్నారు. అయోధ్య కార్యక్రమాల ప్రత్యక్ష ప్రసారాలను ఆలయాలు, ఇతర ఆడిటోరియాల వంటి వాటిలో అనుమతించాలని కోరుతూ దాఖలు చేసిన దరఖాస్తులలో 7 తిరస్కరించి, ఎనిమిదింటిని ధ్రువీకరణ కోసం పెండింగ్‌లో ఉంచారు.


బహిరంగ ప్రదేశాలలో భజనలు, అన్నదానాలు, ప్రత్యేక పూజలు చేసేందుకు అనుమతి కోసం దాఖలైన 226 దరఖాస్తులలో, కేవలం నాలుగింటికి అనుమతి రాగా, 94ను తిరస్కరించారు. ఒక హిందూ సంస్థ అయోధ్య ప్రత్యక్ష ప్రసారాలు చేసేందుకు అనుమతినిస్తూ మద్రాసు హైకోర్టు భజనలు చేయడం, రామనామ జపాలు, అన్నదానాలు నిర్వహించడం అన్నవాటిపై నిషేధాలు లేవంటూ వ్యాఖ్యానించింది. దీని కారణంగా మొత్తం 288 దరఖాస్తులలో 4 మాత్రమే తిరస్కరణకు గురికాగా, 248కి అనుమతి లభించిందని డిజిపి అత్యున్నత న్యాయస్థానానికి సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

## ఓ నలభయ్ అయినా వస్తాయా?



వచ్చే లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి నలభయ్ స్థానాలైనా దక్కుతాయో లేదో అనుమానమేనని టీఎంసీ నేత, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. తాము పశ్చిమ బెంగాల్‌లోని మొత్తం 42 స్థానాలకు కూడా అభ్యర్థులను నిలుపుతాము అని ప్రకటించిన మరునాడే, ఫిబ్రవరి రెండున ఆమె ఈ వ్యంగ్యాస్త్రం సంధించారు. తాను రెండు స్థానాలు కేటాయిస్తానని అవి కూడా గెలవడం కష్టమేనని ఆమె అన్నారు. వాళ్లు అవి కూడా కాదన్నారు. ఇక వాళ్లతో సీట్ల సర్దుబాటు చర్చలు లేవు అని తేల్చారు దీదీ. రాహుల్ గాంధీ భారత్ న్యాయ్ జోడో యాత్రకు సంబంధించి తనకు కనీస సమాచారం కూడా లేదని మమత మరొకసారి మండిపడ్డారు. యాత్ర సంగతి తాను అధికారుల ద్వారా తెలుసుకోవలసి వచ్చిందని వాపోయారు. కాంగ్రెస్‌కు అంత బలమే ఉంటే వారణాసిలో ప్రధాని నరేంద్ర మోదీని ఓడించి చూపాలని కూడా పెద్ద లక్ష్యాన్నే కాంగ్రెస్ పార్టీ ఎదుట ఉంచారు దీదీ. చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకున్నట్టు అసలు మమత లేని ఇండీ కూటమిని ఊహించ లేమని రాహుల్ తరువాత ప్రకటించారు గానీ అప్పటికే జరగవలసిన నష్టం జరిగిపోయింది. పైగా రాహుల్ కారు బెంగాల్ ప్రవేశించగానే ప్రతీకాత్మకంగా అద్దం పగిలింది. ఇది కూడా ఒక తమాషాయే. ఆ అద్దం బిహార్‌లోనే పగిలిందని దీదీ భలే వివరణ ఇచ్చారు. అంటే రాహుల్ చూసుకోలేదని దీదీ కవిహృదయం కావచ్చు.

# కాంగ్రెస్ ఎంపీ.. ప్రత్యేక దక్షిణ భారతదేశం..



నోరు మాట్లాడుతుంటే నొసలు వెక్కిరిస్తున్నట్టు ఉంది అంటారు. కాంగ్రెస్ వైఖరి ఈ నానుడికి దగ్గరగానే ఉంది. ఆ పార్టీ నాయకుడు కాని నాయకుడు భారత్ న్యాయ్ జోడో యాత్ర జరుపుతూ ఉంటే, ఆ పార్టీ ఎంపీ దక్షిణ భారతాన్ని వేరే దేశం చేయాలన్నంత వరకు వెళ్లాడు. 'దక్షిణ భారతదేశం నుంచి వస్తున్న నిధులని ఉత్తర భారతదేశ అవసరాలకు తరలిస్తున్నారు, ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే తాము ప్రత్యేక దేశం కోసం పిలుపు ఇవ్వక తప్పని పరిస్థితి వస్తుంది' బెంగళూరు రూరల్ నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్ సభ్యుడు డీకే సురేశ్ ఈ మాట అన్నారు. ఈయన కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ చిన్న తమ్ముడు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టిన తరువాత విలేకరులతో మాట్లాడుతూ డీకే సురేశ్ ఈ వ్యాఖ్యలు చేశారు. మా దగ్గర నుంచి వసూలు చేసిన జీఎస్‌టీ, మాకు ఇస్తే చాలు. కస్టమ్స్, ప్రత్యక్ష పన్నులు కూడా మావి మాకు చేరాలి. దక్షిణ భారతదేశానికి చాలా అన్యాయం జరుగుతున్నట్టే ఉంది' అన్నారు. ఇంకా, 'అభివృద్ధి కోసం ఇచ్చే నిధులలో మా వాటాను ఉత్తర భారతదేశానికి తరలిస్తున్నారు. మాకు అన్యాయం చేస్తున్నారు. మేం ఈ వైఖరిని ఖండించకుంటే చివరికి ప్రత్యేక దేశం కోసం పిలుపును ఇచ్చే పరిస్థితికి నెట్టినట్టవుతుంది అన్నారాయన. పైగా హిందీ రాష్ట్రాల బరువును మా నెత్తి మీద పెడుతున్నారని కూడా తేల్చేశారు. దీని మీద బీజేపీ కాంగ్రెస్ పార్టీని దుమ్మెత్తి పోస్తోంది. దీనితో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్వయంగా నష్ట నివారణ చర్యలకు దిగక తప్పలేదు. దేశ విభజన గురించి ఎవరు మాట్లాడినా, మా పార్టీ అయినా, వేరొక పార్టీ అయినా దానిని మేం నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తాం. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు భారత్ ఒకటేనని ఖర్గే రాజ్యసభలో ప్రకటించడం గుడ్డిలోమెల్ల. అయినా దేశ విభజన గురించి మాట్లాడడం రాజ్యాంగానికి వ్యతిరేకమని తెలియని అజ్ఞానులను కూడా పార్లమెంట్‌కు ఎందుకు పంపిస్తారు?

## ఈసారి బీజేపీకి 400 సీట్లు వస్తాయిగా...




నిస్సహాయత, నిర్వేదం, చేతకానితనం ఒక్కొక్కసారి నోటి వెంట వాస్తవాలు వెల్లువెత్తేలా చేస్తాయి. ఫిబ్రవరి 2న రాజ్యసభలో ఇందుకు సంబంధించిన ఒక ఉదంతం జరిగింది. సాక్షాత్తు కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే వచ్చే ఎన్నికలలో నాలుగు వందలు.. ఆపై స్థానాలే వస్తాయిలెండి అని అనుకోకుండా నిజం చెప్పేశారు. దీనికి అధికార పక్ష సభ్యులు బల్లలు చరుస్తూ హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ కూడా చిరునవ్వులు చిందించారు. కాంగ్రెస్ సభ్యుల గొంతులలో మాత్రం పచ్చి వెలక్కాయ పడినట్టయింది. చైర్మన్ కూడా అవి మీరు మోదీకి ఇచ్చే ఆశీస్సులు అంటూ శ్లాఘించారు. బడ్జెట్ మీద ప్రసంగిస్తూ ఖర్గే ఇప్పటికే మీకు 330 లేకపోతే 334 స్థానాలతో మందిబలం ఉంది కదా! వచ్చే ఎన్నికలలో అది 400కి దాటి పోతుంది అన్నారు. అయితే వాళ్లు 400 గెలిచినా, ఇండీ కూటమి గెలిచే 100 సీట్లే ఎక్కువ బలమైనవని ఖర్గే సర్దుకున్నారు. అయితే ఖర్గే మాటల్లోని వ్యంగ్యాన్ని బీజేపీ వాళ్లు గ్రహించలేక బల్లలు, చంకలు చరుచుకున్నారని కాంగ్రెస్ ఎంపీ శక్తిసింహ్ గోహిల్ అసహనం వ్యక్తం చేశారు.

## వాళ్లది 40 శాతం అవినీతి అన్నాం, మరి ఇప్పుడో..!



గడచిన కర్ణాటక ఎన్నికలలో బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్ ఎన్ని టక్కు టమార విద్యలు ప్రదర్శించాలో అన్నీ ప్రదర్శించింది. అలాగే మిషనరీలు, ముస్లిం సంఘాలు అన్నీ ఏకమై మొత్తానికి ఓడించాయి. కాంగ్రెస్ అయితే బీజేపీ ఏ పని చేసినా 40 శాతం అవినీతి ఉందని ఆరోపించింది. అప్పుడు అలా ఆరోపించాం సరే, ఇప్పుడు మన సంగతేమిటి అంటున్నారు, కాంగ్రెస్ నాయకుడు, మాజీ మంత్రి బి. శివరాము. 'నేను ఒకటి నేరుగా ముఖ్యమంత్రికే చెబుతున్నాను. మన జిల్లా (హసన్)లో చాలా వ్యతిరేకత ఉంది. బీజేపీ హయాంలో వారిది 40 శాతం అవినీతి అని అన్నాం. ఇప్పుడు అంతకంటే ఎక్కువే అవినీతి ఉంది' అని ఆయన అన్నారు. శివరాము ప్రస్తుతం శాసనసభ సభ్యుడు. ఈ అవినీతిని ఆపాలని నేనే కాదు, పార్టీ కార్యకర్తలంతా కోరుకుంటున్నారని ఆయన అన్నారు. కానీ సొంత పార్టీ అవినీతి గురించి బాహాటంగా చర్చకు పెడితే అంత బాగుండదని ఆగానని కూడా ఆయన అంటున్నారు.

## ఇండీ కూటమిలో మహా వికాస్ అఘాడి కూడా లేదు



ఇండీ కూటమి అంతమైపోయిందని ప్రకటించారు ప్రకాశ్ అంబేడ్కర్. ఫిబ్రవరి 2వ తేదీన ఆయన ఉద్ధవ్ ఠాక్రే నాయకత్వంలోని మహా వికాస్ అఘాడీతో సీట్ల ఒప్పంద చర్చలు మొదలు పెట్టారు. బీఆర్ అంబేడ్కర్ మనమడు ప్రకాశ్. ఈ చర్చలకు సంబంధించిన ఫోటోలను శివసేన ఉద్ధవ్ ఠాక్రే వర్గం నాయకుడు సంజయ్ రౌత్ సామాజిక మాధ్యమాలలో పెట్టారు. అంటే ఇప్పుడు ఎన్‌సీపీ, శివసేన ఉద్ధవ్ వర్గం, ప్రకాశ్ అంబేడ్కర్ నాయకత్వంలోని వంచిత్ బహుజన అఘాడీ కలసి పోటీ చేస్తాయి. ఈ చర్చల సందర్భంలోనే ప్రకాశ్ ఇండీ కూటమి ఇక లేనట్టేనని చెప్పేశారు. ఇండీతో కలసి పోటీ చేయకూడదని తామంతా నిర్ణయించామని కూడా ప్రకాశ్ శుభవార్త చెప్పేశారు. ఇక మిగిలినదెవరు? డీఎంకే, కాంగ్రెస్, ఇంకా చిల్లరమల్లర పార్టీలు. ఇవన్నీ కలసి బీజేపీతో తలపడాలి మరి! చూద్దాం. ఖర్గే కూడా కోరుకున్నట్టు 400 సీట్లు రావచ్చు బీజేపీకి.



# పాకిస్తాన్ భయంతో వణికిపోయిన క్షణాలు



'అభినందన్‌ను విడిచిపెట్టి పాకిస్తాన్ మంచి పని చేసింది. లేదంటే ఓ భయానక రాత్రిని చూడాల్సి వచ్చేది' - 2019 ఏప్రిల్‌లో సార్వత్రిక ఎన్నికల ప్రచారం సందర్భంగా గుజరాత్‌లో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్య ఇది. అప్పట్లోనే ఈ వ్యాఖ్య ఆసక్తిని రేకెత్తించినా, తరువాత అంతా మరచిపోయారు. అసలు ఆనాడు పాకిస్తాన్ తమకు పట్టుబడిన భారత్ వింగ్ కమాండర్ అభినందన్ వర్థమాన్‌ను ఎందుకు హడావిడిగా విడిచి పెట్టాల్సి వచ్చింది? తాజాగా మార్కెట్‌లోకి వస్తున్న భారత మాజీ దౌత్యవేత్త అజయ్ బిసారియా పుస్తకం ఇందుకు సమాధానం ఇచ్చింది.

ఏ దేశమైనా శత్రువు పట్టుబడితే సంతోషిస్తుంది. కానీ ఐదేళ్ల క్రితం ఫిబ్రవరి 27, 2019న అభినందన్ చేజిక్కిన సమయంలో పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ సహా ఉన్నతస్థాయి అధికార గణమంతా చిగురుటాకులా వణికింది. పాక్ రెండురోజుల్లో అభినందన్‌ను విడిచిపెట్టి, బతుకుజీవుడా అని ఊపిరిపీల్చుకుంది. పాక్ ఎందుకలా భయపడింది? ఇమ్రాన్‌కు ఎందుకు చెమటలు పట్టాయి? ఆ సమయంలో పాక్‌లో భారత హై కమిషనర్‌గా పనిచేసిన అజయ్ బిసారియా ఈ అంశాలనే తన తాజా పుస్తకంలో వివరించారు.

'యాంగర్ మేనేజ్‌మెంట్: ది ట్రబుల్డ్ డిప్లొమాటిక్ రిలేషన్‌షిప్ బిట్వీన్ ఇండియా అండ్ పాకిస్తాన్' పేరుతో ఈ పుస్తకం త్వరలో మార్కెట్‌లోకి రానుంది. పుల్వామా ఉగ్రదాడి తర్వాత ఇరు దేశాల మధ్య చోటు చేసుకున్న ఉద్రిక్తతలు ఎలాంటివి? భారత దౌత్యనీతితో పాక్ ఎలా భయపడింది? ఉగ్రవాదంపై తమ విధానాలను ఎలా మార్చుకోవాల్సి వచ్చింది? వంటి అంశాలను అందులో చర్చించారు.

ఫిబ్రవరి 14, 2019న పుల్వామాలో సైనిక కాన్వాయ్‌పై పాకిస్తాన్ కేంద్రంగా పనిచేసే ఉగ్ర సంస్థ జైష్ ఈ మహమ్మద్ దాడి చేసింది. సుమారు 40 మంది సైనికులు చనిపోయారు. దీనికి ప్రతిగా బాలాకోట్‌లో ఉగ్ర శిబిరాలపై భారత్ వైమానిక దాడులు చేసింది. బాలాకోట్ ఘటన జరిగిన మరుసటి రోజు ఫిబ్రవరి 27న పాక్ వైమానిక దళం ఎఫ్-16 విమానాలతో భారత్‌పై దాడికి యత్నించగా.. వింగ్ కమాండర్ అభినందన్ మిగ్-21 విమానంతో వెంటాడి ఒక ఎఫ్-16ను నేలకూల్చారు. అదే సమయంలో ఆయన విమానం కూడా కూలిపోవడంతో పారాచూట్ సాయంతో కిందకు దూకే ప్రయత్నంలో..పాక్ భూభాగంలో పడ్డారు. ఆయనను పాక్ జవాన్లు చిత్రహింసలు పెట్టారు. అభినందన్‌ను తిరిగి అప్పగించాలని భారత్ నుంచే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో పాక్‌పై ఒత్తిడి పెరిగింది. పాక్ సైన్యం వాఘా సరిహద్దు వద్ద భారత్‌కు ఆయనను అప్పగించింది.

అభినందన్ విడుదలను శాంతి ప్రయత్నం అన్నట్లుగా చిత్రీకరించే ప్రయత్నం చేసింది పాకిస్తాన్. కానీ దీని వెనుక సుదీర్ఘ తతంగమే నడిచింది. అభినందన్‌కి ప్రాణహాని జరిగితే భారత్ నుంచి తీవ్ర పరిణామాలు ఉంటాయని పాకిస్తాన్‌కి అమెరికా, బ్రిటన్ రాయబారులు సహా పాశ్చాత్యదేశాల దౌత్యవేత్తలు వెల్లడించడంతో పాకిస్తాన్ దిగిరాక తప్పలేదు

**పాకిస్తాన్‌పై భారత్ క్షిపణుల గురి**

అభినందన్‌ను బంధించిన తర్వాత భారత్ తీవ్రంగా స్పందించింది. దాయాది పైకి 9 క్షిపణులతో దాడికి సిద్ధమైంది. బాలాకోట్‌పై భారత వాయుసేన



మోదీ, ఇమ్రాన్ ఖాన్

దాడుల తర్వాత పాకిస్తాన్ విదేశాంగ కార్యదర్శి తెహ్మినా జన్‌జువాకు ఆ దేశ సైనికాధికారుల నుంచి కీలక సమాచారం అందిందని బిసారియా పేర్కొన్నారు. భారత్ తొమ్మిది క్షిపణులను పాక్‌పైకి ఎక్కుపెట్టిందని, వాటిని ఏ క్షణంలోనైనా ప్రయోగించే అవకాశం ఉందనేది వారికి అందిన సందేశం. ఆందోళన చెందిన పాక్ ఈ విషయాన్ని అమెరికా, యూకే, ఫ్రాన్స్ రాయబారులకు చేరవేసింది. భారత్‌కు సర్దిచెప్పాలని పాక్ కార్యదర్శి ఆయా దేశాల రాయబారులను కోరారు. ఐరాసలో వీటో అధికారం ఉన్న ఐదు దేశాలతో పాటు భారత్, పాక్ మధ్య ఆరోజు రాత్రి పెద్ద ఎత్తున దౌత్యపరమైన సంప్రదింపులు జరిగాయని బిసారియా చెప్పారు.

**మోదీతో మాట్లాడేందుకు ఇమ్రాన్ ప్రయత్నం**

ఈ పరిణామాలతో పాక్ తీవ్రంగా భయపడింది. ఆ సమయంలో భారత్‌లోని అప్పటి పాక్ హైకమిషనర్ సోహైల్ మహమ్మద్ ఇస్లామాబాద్‌లో ఉన్నారు. ఫిబ్రవరి 27 అర్ధరాత్రి ఆయన నన్ను సంప్రదించారు. 'మోదీతో ఇమ్రాన్‌ఖాన్ ఫోన్‌లో మాట్లాడాలనుకుంటున్నారు' అని చెప్పారు. నేను వెంటనే ఢిల్లీలోని అధికారులకు సమాచారమిచ్చాను. అప్పుడు ఖాన్‌తో మాట్లాడేందుకు ప్రధాని మోదీ అందుబాటులో లేరని అధికారులు చెప్పారు. పాక్‌కు ఏదైనా అత్యవసరమైతే హైకమిషనర్ (నా) తోనే మాట్లాడాలని చెప్పాలని సూచించారు. ఆ తర్వాత పాక్ అధికారులు మళ్లీ నాతో సంప్రదించలేదు' అని బిసారియా కథనం.

'తర్వాత కొన్ని రోజులకు ఇమ్రాన్ ఖాన్ అత్యంత సన్నిహితుడు ఒకరు నన్ను సంప్రదించారు. ఆ ఏడాది కిర్గిజ్‌స్థాన్‌లో జరిగిన ఎస్‌సీవో సదస్సులో ప్రధాని మోదీ, ఇమ్రాన్‌ఖాన్ మధ్య భేటీ ఏర్పాటు చేయాలని కోరారు. ఉగ్రవాద కట్టడిపై వారి విధానాలను ఖాన్.. మోదీకి వివరించి సర్దిచెప్తారని చెప్పారు. కానీ ఆ భేటీకి ప్రధాని హాజరుకాలేదు' అని అజయ్ వెల్లడించారు. పాకిస్తాన్ నేరుగా తమ ఆందోళనలకు భారత్‌కు వివరించాలని సమాచారం అందుకున్న దేశాల్లో ఒకటి సూచించినట్లు బిసారియా తన పుస్తకంలో రాశారు. ఈ క్రమంలో ప్రధాని మోదీతో అప్పటి పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ మాట్లాడడానికి చేసిన ప్రయత్నం విఫలమైందని తెలిపారు.

**చైనా సాయం కోరిన ఇమ్రాన్..**

ఈ క్రమంలో ఇమ్రాన్‌ఖాన్ చైనా సాయం కోరారని తనకు తెలిసినట్లు బిసారియా తెలిపారు. భారత్‌కు అమెరికా మద్దతిస్తున్నందున చైనా తమ వెంటే ఉండాలని ఆయన కోరినట్లు చెప్పారు. కానీ, షీ జిన్‌పింగ్ దీన్ని తిరస్కరించారు. భారత్‌పైకి పాక్‌ను ఎగదోసేందుకు చైనా సహకరించబోదని స్పష్టం చేశారు. భారత్‌తో అమెరికాకు సన్నిహిత సంబంధాలున్నందున.. పాక్ నేరుగా అగ్రదేశంతోనే సంప్రదింపులు జరపాలని జిన్‌పింగ్ హితవు పలికారని బిసారియా చెప్పారు.

ప్రధాని మోదీతో అప్పటి పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ మాట్లాడడానికి చేసిన ప్రయత్నం విఫలం కావడంతో పాకిస్తాన్ అధికారులు అమెరికా, యూకే రాయబారులు అదేరోజు రాత్రి భారత విదేశాంగశాఖ కార్యదర్శిని సంప్రదించారని వెల్లడించారు. 'ఘర్షణపూరిత వాతావరణం నుంచి వెనక్కి తగ్గేందుకు పాక్ సిద్ధమైంది. భారత్ ఇచ్చే సమాచారం ఆధారంగా దర్యాప్తు జరిపేందుకు అంగీకరించింది. ఉగ్రవాదాన్ని అణచి వేయడానికి చర్యలు తీసుకుంటామంది. ఇమ్రాన్‌ఖాన్ స్వయంగా ఈ ప్రకటనలు చేయడంతో పాటు అభినందన్‌ను కూడా విడిచి పెడతారు' అని వారు చెప్పినట్లు బిసారియా వెల్లడించారు.

**మోదీ చేసిన వ్యాఖ్యలు అవేనా?**

అయితే అభినందన్‌ను విడిపించుకునేందుకు పాక్‌వైపు భారత్ క్షిపణులు సిద్ధం చేసినట్లు ఎక్కడా ఎప్పుడూ అధికారికంగా వెల్లడించలేదని.. కానీ దాని వల్లే అప్పటి ఇమ్రాన్‌ఖాన్ ప్రభుత్వం భయపడిందని వివరించారు. అప్పుడు మోదీ చేసిన వ్యాఖ్యలకు అజయ్ బిసారియా తన పుస్తకంలో రాసుకొచ్చిన విషయాలు బలాన్ని చేకూరుస్తున్నాయి. అభినందన్‌ను తీసుకురావడానికి భారత్ సైనిక విమానాన్ని పంపేందుకు సిద్ధం కాగా పాకిస్తాన్ నిరాకరించిందని బిసారియా వెల్లడించారు. ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న తరుణంలో భారత వాయుసేన విమానం పాక్ భూభాగంలోకి అనుమతించడాన్ని వారు ప్రమాదంగా భావించారని వివరించారు.

**పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ కాళ్లు వణికాయి**

అభినందన్‌ను పట్టుకున్న సమయంలో భారత్ దాడి చేస్తుందని పాక్ భయపడి పోయింది. పాకిస్తాన్



ఆర్మీ చీఫ్ జనరల్ కమర్ జావేద్ బాజ్వా కాళ్లు వణికిపోయాయి. ఈ విషయాన్ని పాకిస్తాన్ ముస్లిం లీగ్ (ఎన్) ఎంపీ అయాజ్ సాదిక్ మూడేళ్ల క్రితమే బహిర్గతం చేశారు.

ఆ రోజు పాకిస్తాన్ విదేశాంగ మంత్రి షా మొహమ్మద్ ఖురేషీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధికార పార్టీకి చెందిన నేతలతో పాటు ప్రతిపక్షాలకు చెందిన నేతలు కొందరు హాజరయ్యారు.'అభినందన్‌ను వదిలిపెట్టకపోతే ఈరోజు రాత్రి 9 గంటలకు భారత్ మనపై దాడి చేస్తుంది.' అని ఖురేషీ చెప్పిన సమయంలో పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ కమర్ జావేద్ బాజ్వా కాళ్లు వణికి పోయాయి.


'నాకు ఇంకా గుర్తుంది. ఆ రోజు షా మొహమ్మద్ ఖురేషీ సమావేశం నిర్వ హిస్తున్నారు. ప్రధాని ఇమ్రాన్ ఖాన్ సమావేశానికి రావడానికి ఇష్టపడలేదు. ఆర్మీ చీఫ్ కమర్ జావేద్ బాజ్వా సమావేశానికి వచ్చారు. ఆ సమయంలో ఆయన కాళ్లు వణుకుతున్నాయి. దేవుడి మీద భారం వేసి అభినందన్ వర్ధమాన్‌ని వదిలిపెట్టండి. లేకపోతే రాత్రి 9 గంటలకు పాకిస్తాన్ మీద భారత్ దాడి చేస్తుంది.' అని ఖురేషీ చెప్పినట్టు సాదిక్ తెలిపారు.

**తుడుచి పెట్టాలనుకున్నాం: ధనోవా**

బాలాకోట్‌లోని ఉగ్రస్థావరాలపై భారత్ వైమానిక దాడులకు ప్రతీకారంగా పాక్ దుస్సాహసం చేస్తే, వారి సైనిక విభాగాల్ని తుడిచి పెట్టేద్దామనుకున్నామని నాటి వైమానిక దళాధిపతి బి.ఎస్.ధనోవా చెప్పారు. అందుకు మన సేనలు అప్పటికే సిద్ధమయ్యాయని ఆయన మూడేళ్ల క్రితం ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. దౌత్యపరంగా, రాజకీయంగా పాకిస్తాన్ విపరీతమైన ఒత్తిడికి లోనైందని ధనోవా వివరించారు. భారత్‌తో పెట్టుకోవడం ఎంత ప్రమాదకరమో ముందే పసిగట్టారని తెలిపారు.

అభినందన్‌ను అప్పగించడం తప్ప అప్పుడు పాక్‌కు మరో మార్గం లేదని స్పష్టం చేశారు. భారత బలగాల సామర్థ్యాన్ని చూసే నాడు పాక్ నాయకుల కాళ్లు వణికి ఉంటాయని పరోక్షంగా ఆ దేశ ప్రతిపక్ష నాయకుడి వ్యాఖ్యల్ని ఉటంకిస్తూ ఈ విషయం ప్రస్తావించారు. బాలాకోట్‌పై ఐఏఎఫ్ వైమానిక దాడుల తర్వాత పాక్ చేసిన దుస్సాహసంలో ఏ ఒక్క భారత స్థావరం దెబ్బతిన్నా.. పాక్ స్థావరాల్ని పూర్తిగా తుడిచిపెట్టేందుకు సిద్ధమయ్యామని నాటి సన్నద్ధతను వివరించారు.

అభినందన్‌ను వదిలేయటానికి మరో ప్రత్యేక కారణం ఉంది. ఆయనకు ఏమైనా అయితే దాని పరిణామాలు తీవ్రంగా ఉంటాయని రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్(రా) చీఫ్ అనిల్ ధస్మనా పాక్‌ను గట్టిగా హెచ్చరించారు. ప్రధాని మోదీ సూచనల మేరకు.. ఐఎస్ఐ కౌంటర్ పార్ట్ లెఫ్టినెంట్ గవర్నర్






భారత మాజీ దౌత్యవేత్త అజయ్ బిసారియా

సయ్యద్ అసిమ్ మునీర్ అహ్మద్ షాకు రేర్ ఫోన్ కాల్, రహస్య లేఖ ద్వారా ఈ హెచ్చరికలు చేశారు. అనంతరం చోటు చేసుకున్న మరికొన్ని పరిణామాలతో పాక్ వెనక్కు తగ్గి అభినందన్‌ను వదిలిపెట్టడానికి నిశ్చయించుకుంది.

**అభినందన్ మనోనిబ్బరం**

ఏడాదిన్నర క్రితం వచ్చిన 'సీతారామం' సినిమా చూసిన వారు అందులోని రామ్ పాత్ర దేశభక్తిని గమనించే ఉంటారు. ప్రాణాలు పోగొట్టుకోవడానికి అయినా సిద్దపడతాడు కానీ దేశ రహస్యాలు పెదవి దాటనివ్వడు రామ్. ఇది ఐదేళ్ల క్రితం నిజంగా ఇలాంటి ఘటనే జరిగింది. అభినందన్ భారత్ రహస్యం పాక్ చేతులలో పడకూడదనే ఉద్దేశంతో తనదగ్గరున్న పత్రాలను నమిలి మింగేశాడు. పాకిస్తానీలు అభినందన్ మీద దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఆ తర్వాతే సైన్యానికి అప్పగించారు. మొత్తం పాక్ నిర్బంధంలో 60 గంటల పాటు ఉన్నారు. పాకిస్తాన్ అధికారులు విచారించినప్పుడూ ఆయన ఎంతో నిబ్బరంగా సమాధానమిచ్చారు. అవసరమైనంత వరకే జవాబిచ్చి రహస్యాలను దాట వేశాడు. ఆ వీడియో అప్పట్లో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పాక్ అధికారి అభినందన్‌ను అడిగిన ప్రశ్నలివే...

**పాక్ అధికారి:** నీ పేరు ఏంటి?

**అభినందన్:** అభినందన్.

**పాక్ అధికారి:** నీకు ఈ రోజు బాగా గడిచిందని అనుకుంటున్నాను.

**అభినందన్:** అవును... నేను స్టేట్‌మెంట్ రికార్డ్ చేస్తున్నాను. నేను నా దేశానికి వెళ్లినా కూడా ఇది మారదు. పాక్ ఆర్మీ అధికారులు నన్ను బాగా చూసుకున్నారు. నన్ను స్థానిక మూకల నుంచి పాక్ కెప్టెన్ ఒకరు రక్షించారు. పాక్ ఆర్మీని చూసి చాలా ఇంప్రెస్ అయ్యాను.

**పాక్ అధికారి:** అయితే నువ్వు వింగ్ కమాండర్‌వా? ఇండియాలో ఎక్కడి వాడివి?

**అభినందన్:** క్షమించండి... నేను చెప్పలేను... దక్షిణ భారతావనికి చెందిన వాడిని.

**పాక్ అధికారి:** నువ్వు దక్షిణ భారతానికి చెందిన వ్యక్తివా? సరే... నీకు పెళ్లయిందా?

**అభినందన్:** అవును, అయింది.

పాక్ అధికారి: నీకు మేమిచ్చిన టీ నచ్చినట్లుంది.

**అభినందన్:** టీ చాలా బాగుంది... కృతజ్ఞతలు.

**పాక్ అధికారి:** నువ్వు ఏ విమానాలు నడపగలవు?

**అభినందన్:** క్షమించండి... ఈ విషయాన్ని నేను చెప్పలేను.

**పాక్ అధికారి:** నీ కార్యక్రమం ఏమిటి?

**అభినందన్:** నేను చెప్పలేను.

**పాక్ అధికారి:** ఓకే థ్యాంక్యూ...

అభినందన్ తండ్రి రిటైర్డ్ ఎయిర్ మార్షల్. తల్లి డాక్టర్. అభినందన్ ఎన్‌డీఏ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి 2004లో ఫ్లయింగ్ ఆఫీసర్‌గా ఎంపిక య్యారు. ఇంతకుముందు సుఖోయ్-30 స్క్వాడ్రన్‌కు పైలట్‌గా పనిచేశారు. ఆ తర్వాత మిగ్-21 స్క్వాడ్రన్‌లో చేరారు.

అభినందన్ పాకిస్తాన్ నుండి తిరిగి వచ్చాక పదోన్నతి పొంది గ్రూప్ కెప్టెన్‌గా బాధ్యతలు స్వీకరించారు. 2021 నవంబర్‌లో అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నుంచి వీర చక్ర అవార్డు అందుకున్నారు. శత్రువు చేతికి చిక్కి ప్రాణాలతో బయటపడిన భారతీయ వీరులు బహు అరుదు. అందునా పాకిస్తాన్ సగౌరవంగా అభినందన్‌ను అప్పగించడంతో భారత్ శక్తి ప్రపంచానికి అర్థమైంది.

**వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్**

## కథ

# చిరంజీవి గంగా

'రాత్రి రెండవ జాము జరుగుతోంది. శాస్త్రి ఉలిక్కిపడి లేచాడు. ఎదురుగా– గురువు గారు– జగన్నాథుని గది చీకటిగా ఉంది. వెళ్లాడు. అతని వెనగ్గా వచ్చింది భార్య సుభాషిణి. నడవాలోని దీపం తెచ్చి జగన్నాథుని గదిలో మలిగిన దీపాన్ని వెలిగించింది. జగన్నాథుడు గది పైకప్పుని చూస్తూ పడుకుని ఉన్నాడు. కళ్లు ఎర్రబడి విచ్చుకుని అగ్నిగోళాల్లా ఉన్నాయి. భార్యాభర్తలకు మనసులో చాలా బాధనిపించింది. జగన్నాథుడు మానసికంగా నిస్పృహలో ఉన్నాడు. ఈవేళ పాదుషా సమావేశం ఆయనకి ఒక అశనిపాతం. శాస్త్రికీ, సుభాషిణికీ తెలుసు.



ఔరంగజేబు పాదుషా మాటలు గురువు గారి గుండెకు శూలాల్లా గుచ్చుకున్నాయి!

సుభాషిణి పెదవి కదల్చబోయేటంతలో – జగన్నాథుడే–నిశ్చేష్టతతోనే– "కన్ను మూసినా, తెరచినా–దారావారి శిరస్సే కనిపిస్తున్నది శాస్త్రీ" అన్నాడు. కళ్లల్లో నీరు చిప్పిల్లి స్వరం గద్గదికమైంది. 'ఆ ఖండిత శిరస్సు ఛిద్రమై విచ్చాయ తిరిగిన మోము, తెగీతెగని మెడపై వేలాడుతున్న హారాలూ, పగిలి ఛిద్రుపలైన పగ్రీ రూపు–ఎలా మరపునకు వస్తుంది?

.........13. 6-1659న ఢిల్లీలో పట్టాభిషిక్తుడైనాడు ఔరంగజేబు. దారామీద కక్షతో, షాజహాన్ పాదుషాపై ప్రతీకారేచ్ఛతో ఔరంగజేబు దారాని ముసలి ఏనుగు మీద నగరవీధులలో ఊరేగించి, ప్రజల్ని భయభ్రాంతుల్ని చేశాడు. ఆ దృశ్యం చూసిన దారా మిత్రులూ, అభిమానులూ తన ముందు రోదనతో ఘూర్ణిల్లారు. ఆ తర్వాత, ఏకంగా దారా తల నరికించి కసికొద్దీ బల్లెంతో దాన్ని ఛిద్రం చేయించి, ప్రజల ముందు ప్రదర్శించి, పాశవిక ఆనందాన్ని పొందాడు. ఈ దారుణాలన్నీ చూసి తన మనసు వికలమైపోయింది.

కవి, పండితుడు, విద్వాంసుడు, సర్వమత సౌభ్రాతృత్వాన్ని అణువణువునా జీర్ణించుకున్న ఉత్తముడైన దారా మరణం తన జవసత్వాల్ని నీరుకార్చింది. నిస్సహాయతతో విలపించాడు. పిచ్చివాడిలా దుఃఖించాడు.

గొంతు పెకల్చుకుని అన్నాడు శాస్త్రి, "అవును. ఏ మానవ మాత్రుడికీ జరుగరాని ఘోరం–మన దారా వారికి జరగటం నిజంగా దుర్భరమూ, దుస్సహమే" నిశ్శబ్దంలో క్షణాలు గడిచాయి. "మీరు వెళ్లి పడుకోండి" అని గోడవైపు తిరిగాడు జగన్నాథుడు. భార్యాభర్తలు మొహామొహాలు చూసుకుంటూ బయటికి కదిలారు.


కళ్లు మూసుకున్న జగన్నాథుని మనోయవనికపై ఔరంగజేబు పాదుషా రూపం ప్రత్యక్షమైంది. ఆయన

మాటలు చెవుల్లో గింగురు మనసాగాయి.

కవి, పండిత సమావేశానికి రమ్మని ఆజ్ఞ!... వెళ్లాడు. చాలామంది కవులూ, పండితులూ చేరారు. పాదుషా గురువు ముల్లా సలేహ్ కూడా ఉన్నాడు. సంక్షిప్తంగా పరిచయాలు అయినై.

ఔరంగజేబు ముల్లా సలేహ్‌పై చాలా అభియోగాల్ని తీవ్రమైన పదజాలంతో చెప్పాడు. “మీరు నాకు ప్రపంచంలోని ఇతర దేశాల ప్రభుత్వ రూపం గురించీ, వారి బలాలూ బలహీనతల గురించీ, వారి యుద్ధ సామర్థ్యం వ్యూహాలూ పద్ధతుల గురించీ, ఏమి చెప్పారు? చరిత్ర అధ్యయనం

- విహారి



చేశారా మీరు? లేదు. నాకేం చెబుతారు? అంతెందుకూ-మనదేశంలో ఏయే సంస్థానాలూ, రాజ్యాలూ ఏయే రీతుల్లో పాలింపబడుతున్నాయో, ప్రజల జీవన విధానం ఏమిటో తెలిపారా? లేదు. భౌగోళిక శాస్త్రం తెలియని రాజు రాజ్యపాలనేం చేస్తాడు?” అని ఆగి తలవంచి, ఓరకంటితో పండితరాయల వంక చూస్తూ “ఏమి పండితరాయల వారూ చెప్పండి. మీ దారాకి మీరేం నేర్పారు? ఉపనిషత్తులూ, యోగవాసిష్టమూ, భగవద్గీతా? దేనికి అవన్నీ? వారు తమ కొత్త మతాన్ని కనిపెట్టుకోవటానికా? చివరికేం జరిగింది? సమూఘర్ చేరే సైన్యానికి ఆయన సరియైన పథనిర్దేశం చేయలేక పోయాడు. అక్కడే గదా మీరు గురుకులం పెట్టించింది?” అని అడిగాడు.

మందిరమంతా గాలి బిగదీసినట్లున్నది. కూర్చున్నవారు స్తంభీభూతులైనారు. తాను నేలచూపులతో నిస్సహాయశ్రోత అయినాడు. కన్నీళ్లని రెప్పల మాటున బిగబట్టాడు.

కొద్ది విరామం తర్వాత మళ్లీ అందుకున్నాడు పాదుషా, “పండిట్ జీ... మీరు చెప్పండి... షాజహాన్ వారు కళాపోషకులు కావచ్చు. కానీ, వారు చేసిన సన్మానాలూ, సత్కారాల ఖర్చు ఎంత?– ఒక్కరికోసం అందరి సొమ్మూనా? అందరికోసం అందరి సొమ్మూనా? పాలకుడు ఏ విధానాన్ని అనుసరించాలి” అని “ఒక్కటే మాట. ఇకనుంచీ ఇవేమీ సాగనివ్వము. అయితే మా కారుణ్యం వలన మీకు జీవనభృతి లోటు చేయము. మీ శిష్యులకు భవిష్యత్తుకు ఉపయోగపడే విద్యల్ని బోధించటం ప్రారంభించండి” అంటూ దివాన్ రఘునాథరాయ్ వైపు చూశాడు. ఇక చాలు నడవవండన్న సూచన! నోరు కట్టేసినట్లయింది. కదిలాడు.

అయితే, ‘తాను చదివిన చదువూ, శాస్త్రాలూ, సాహిత్యం, వేదవేదాంత తర్క మీమాంస వ్యాకరణాది వాఙ్మయం–సర్వమూ అర్థరహితమైనవేనా? ఎన్నో భాషల నుండి తాను నేర్చుకున్న దాని సంగతి సరే, శిష్యులకు నేర్పినదీ వ్యర్థపద వ్యాయామ

**వాకాటి పాండురంగరావు స్మారక దీపావళి కథల పోటీలో విశిష్ట బహుమతి పొందిన రచన**

క్రియయేనా? పండితరాయ పదవిలో ధర్మ నిర్ణయం చేస్తూ, న్యాయమార్గాన్ని సూచిస్తూ క్లిష్ట సమయాల్లో పాదుషా వారిని ఆదుకోలేదా? ప్రజలంతా ఆ నిర్ణయాల్నీ, మార్గాల్ని ఔననన్నారు కదా!’ ప్రశ్నలు భూతాల్లా నిలిచాయి.

కేవలం శాస్త్రాలూ, సాహిత్యమూ చదివి, సిద్ధాంత ప్రవచనాలతో సరిపెట్టుకున్నాడా తాను? లేదే. చేసిన ప్రతి పనిలోనూ– సామాజికత– సమన్వాయం, వసుధైక కుటుంబ భావనల్ని ఆచరణాత్మకం చేసి మరీ కర్మిష్టిగా అంతో ఇంతో పేరు తెచ్చుకున్నాడే! జంతుబలి మూఢాచారాన్ని నిరసించటం, ముస్లిం బాలునికి వేదాలు చెప్పటం, ముస్లిం యువతీ యువకులకు స్త్రీ స్వేచ్ఛా స్వావలంబనల ప్రాధాన్యతని బోధించటం, చివరికి ప్రయాణాల్లో కూడా మత ఘర్షణల్ని వారించటం – ఇవన్నీ తన ప్రమేయంతో అంతో ఇంతో సాంఘిక మార్పుకి అదనపు చేర్పులూ, కూర్పులే కదా?

అయితే, ఇలా సమాధానపడితే, అది ఏ వ్యక్తిత్వానికి చిహ్నమౌతుంది? ఈ పాదుషా నీడన కొలువు సాగిస్తే అది ఏ నైతిక విలువలకి తార్కాణమవుతుంది? తన ఆత్మగౌరవ దాసోహానికి నిదర్శనం కాబోదూ?

ఒక్కసారిగా ఉలిక్కిపడినట్లు దేహమంతా కంపించింది.

ఉన్నట్టుండి ఆగ్రా కోట కనుల ముందుకొచ్చింది. అందులో షా బురుజు ఖైదు! అక్కడి నుంచీ షాజహాన్ చూపులు దీనంగా తాజమహలును చూస్తున్నాయి. చక్రవర్తి దీనముఖం! దయనీయమైన దృశ్యం!

జగన్నాథుని మేధ ఒక ఉన్మత్తస్థితిలో యోచనాయోచనల సంధిలో కొట్టుమిట్టాడ సాగింది.

* * *

అన్ని ఆలోచనల తర్వాత శాస్త్రిని, సుభాషిణిని కాశీకి పంపించేశాడు జగన్నాథుడు. తాను మిగిలాడు! –ఈవేళ పగలంతా తన ఉనికీ, మనుగడల గురించి ఆలోచిస్తూనే ఉన్నాడు. ఢిల్లీలో ఉండే అవకాశం లేదు. అవసరమూ లేదు. మరి, తర్వాతి మజిలీ?

ఎప్పుడో చదరంగం ఆడే సమయంలో షాజహాన్ ప్రసక్తానుప్రసక్తంగా ప్రాణనారాయణుని గురించి ప్రస్తావించారు. కామరూపం తలపుల్లోకి వచ్చింది. అదే తన భవిష్యత్ మజిలీయా?

జగదాభరణం కావ్యాన్ని తీశాడు. మార్పులూ, చేర్పులూ కొన్ని చేసి, గ్రంథనామాన్ని 'ప్రాణాభరణం' అన్నాడు.

నిద్ర ప్రయత్నం ఫలించలేదు జగన్నాథుడికి. మంచం మీద పొర్లటమే మిగిలింది. బుర్ర అనేక ద్వంద్వాల మధ్య గిరికీలు కొడుతోంది. ప్రాణ నారాయణుని ప్రాపు కోరటం. షాజహాన్ పేరు ఆ పాలకుని ముందు తనకు ఆపన్న ప్రసన్న హస్తం కావచ్చు. కానీ 'ఢిల్లీశ్వరోవా...!" అన్న అంతటి దీమసాన్నీ పాతరేయటమేనా? 'ఆకాశంబున నుండి...' గంగావతరణం దృశ్యం కళ్లకు కట్టింది! ఎక్కడో దూరంగా తీతువు కూసింది. లేచి పడక మధ్యగా కూర్చున్నాడు. నీళ్లు తాగాడు. తలగడ పక్కగా 'ప్రాణాభరణం' కనిపించింది. చేతిలోకి తీసుకున్నాడు. పేరే వెక్కిరించింది. ఏమిటి–తాను చేసింది? 'రసగంగాధరం' మొదట్లో చేసిన బాస ఏమిటి? మరి ఇప్పుడు పూనుకున్న ఈ చర్య 'కక్కుర్తి' కాదూ? ఎంగిలి పదాలు కాదూ ఈ గ్రంథంలో కూరినవి? 'ఎందుకూ–మనసు వంకరగీతలు గీస్తోంది? ఎందుకూ బుద్ధి ఇంకా ఏవో భూములేలాలను కుంటున్నది? దేనికోసం? రేపోమాపో కాబోయే ఊపిరి లేని కట్టెకోసమా?'

హఠాత్తుగా భగవానువాచ 'అక్షర' ప్రబోధనం పెదవులపై జాలువారింది. 'సకల శాస్త్ర నిగమాగమ సారం' ఏదో దీపకళికలా కనులముందు నిలబడింది. గట్టిగా ఊపిరి పీల్చుకున్నాడు. ఒక్కసారిగా మనసు నంతా వింత హాయి కమ్ముకుంది. గ్రంథాన్ని పక్కన పడేసి రక్కున లేచి గబగబా ఆవరణలోకి వచ్చేశాడు.

చల్లగాలి వీచింది. కర్తవ్య స్పృహలో ఇంతటి మహత్వం ఉన్నదా? అనిపించింది. చిరునవ్వు విరిసింది. ఆనందంతో చుట్టూ చూశాడు... ఇప్పుడు కాశీ గంగా తీర ప్రభాతరేఖలే స్వాగతమంటున్న ట్లయింది!

"గురువుగారూ మేము 60 మందిమి. కన్నడ దేశం మైసూరు నుండి వస్తున్నాం. రుక్ శాఖీయులం. మీ వద్ద వేదాధ్యయనం చేయటానికి వచ్చాము. మా గురువు బాల సుబ్రహ్మణ్యభట్టు గారికి జగత్సింహ మహారాజు గారి ఆస్థానంలోని కవిపండితులు–విశ్వనాథ వైద్యా గారు గురువులట. వారు మీ ప్రతిభా విద్వత్తు గురించి చెప్పటం వలన– మీ శిష్యరికానికి పంపారు. మీరు అనుగ్రహించాలి"



జగన్నాథుడు కాశీ వచ్చేశాడు. పూర్వ విద్యార్థి చక్రపాణి ఆనందం అనిర్వచనీయమైంది. అతని భార్య రమాదేవికి భర్త ఆనందమే తన ఆనందం. ముగ్గురు పిల్లల్నీ పరిచయం చేశాడు. నాలుగు రోజుల్లోనే వారూ వీరూ బాగా కలిసిపోయారు. మనసులూ కలిసిపోయాయి.

చక్రపాణికీ, గురుకులంలోని శిష్యులందరికీ పండితరాయలవారి బోధన ఒక వరమయింది. 'మనోరమా ఖండనమ్'నీ, 'రసగంగాధరం'నీ–పూర్తి చేయటం, 'భామినీ విలాసం'లో చివరి భాగాన్ని సరిచేయటం– ఇవీ మిగిలిన పనులు. ఆ పనుల్లో పడ్డాడు పండితరాయలు.

* * *

గంగాతీరం! సూర్యాస్తమయ కిరణాలు గంగా స్వాదుతరంగాలపై వింతవింత వర్ణాల్ని ప్రసరిస్తున్నాయి. నదిలో నావలు... నావల్లో సందర్శకులు. ఘాట్ అంతా కోలాహలంగా ఉంది. ఘాట్–పైమెట్టు మీద సమితి వారి వేదికలు. వాటిపై నగర ప్రముఖులు కొలువుతీరి ఉన్నారు.

చేతిలో పూలదండలతో ఎదురొచ్చారు కార్యకర్తలు. 'పండిత్ రాజ్‌కి జయహో' అంటే 'జయహో' అంటూ నినాదాలతో జనం మూగారు. అధ్యక్ష కార్యదర్శ లిరువురూ జగన్నాథుని వేదిక మీదికి తీసుకువెళ్లి కూర్చోబెట్టి పుష్పమాలాంకృతుని చేశారు. చక్రపాణి బృందానికీ సాదర స్వాగతం.

అధ్యక్షుడు నిలబడి, "మహాజనులారా – భక్తులారా... ఈరోజు మన అందరికీ ఒక ప్రత్యేక శుభదినం. ప్రతిరోజూ గంగాహారతి సందర్భంలో మనం పాడుతూ పరవశిస్తున్న 'గంగాలహరి' శ్లోకాల కర్త జగన్నాథ పండితరాజ్ వారు ఈ మహానుభావులే! గంగాహారతి చరిత్రలో ఇదొక మహత్తరమైన రోజు" అంటూ అందరికీ పండితరాయల్ని చూపించాడు. అందరూ ఆనందంతో కరతాళధ్వనులు చేశారు. జగన్నాథుడు లేచి ముకుళిత హస్తాలతో శుభాకాంక్షలూ, ధన్యవాదాలూ చెప్పాడు.

ముందు గంగాస్తోత్రంతో హారతి మొదలైంది. తర్వాత 'గంగాలహరి' నుండి ఐదు శ్లోకాలు పఠించారు అపూర్వమైన దృశ్యం. దివ్యమైన అనుభూతి. అర్ధనిమీలిత నేత్రాలతో, భక్తి పారవశ్యంతో తన్మయుడైనాడు జగన్నాథుడు. అక్కడున్న వారంతా–ఏదో తెలియరాని ఆత్మ చేతనత్వంతో పులకరించిపోయారు.

హారతి అయిపోయింది. ప్రసాద వితరణ జరిగింది. ప్రసాదాల్నీ, సేవా సమితి జ్ఞాపికనీ, విశ్వనాథ రూపునీ, ఇతర కానుకల్నీ ఇచ్చి వీరికి వీడ్కోలు పలికారు – సమితి అధ్యక్షుడూ, కార్యదర్శులూ.

గురుకులానికి చేరారు. "గురువుగారూ! మీరు ఢిల్లీ వెళ్లిన తర్వాత జరిగిన అపూర్వమైన శుభ పరిణామం ఇది. చాలా ఏళ్ల నుంచీ జరుగుతున్న నిత్య కార్యక్రమం ఇది. తెలుగు వారిగా మనకందరికీ ఇది గర్వకారణం.

'గంగాలహరి' పుణ్య గంగానదీ తీరంలో నిత్యం స్మరింపబడటం కన్నా మహద్భాగ్యం ఏమున్నది? మీరు పుణ్యులు. మన 'తెలుగువారంతా ధన్యులం' అని కైమోడ్చాడు చక్రపాణి.

జగన్నాథుని అంతర్ముఖీనతని భౌతిక స్థితికి లాగుతూ, బిలబిలమంటూ చాలా పెద్ద సమూహం గురుకులంలోకి ప్రవేశించింది. వారికి నాయకుని వంటి యువకుడు చెప్పాడు. "గురువుగారూ మేము 60 మందిమి. కన్నడ దేశం మైసూరు నుండి వస్తున్నాం. రుక్ శాఖీయులం. మీ వద్ద వేదాధ్యయనం చేయటానికి వచ్చాము. మా గురువు బాల సుబ్రహ్మణ్యభట్టు గారికి జగత్సింహ మహారాజు గారి ఆస్థానంలోని కవిపండితులు–విశ్వనాథ వైద్యా గారు గురువులట. వారు మీ ప్రతిభా విద్వత్తు గురించి చెప్పటం వలన– మీ శిష్యరికానికి పంపారు. మీరు అనుగ్రహించాలి"

జగన్నాథుడు మారుపలికేలోగానే చక్రపాణి "ఇది దైవసంకల్పం. చాలా సంతోషం" అన్నాడు. జగన్నాథుడు చిరునవ్వుతో తల పంకించాడు. ఆలోచనా క్రమం అంతర్వీక్షణంగా సాగింది.

అవును. ఎక్కడి నుండీ ఎక్కడి వరకూ సాగిందీ తన జీవన ప్రస్థానం–? ఎక్కడ ముంగండ? ఎక్కడ కాశీ, జయపురం, ఢిల్లీ, ఆగ్రా?! మజిలీలన్నీ దాటుకుని మళ్లీ కాశీ చేరడం! గంగా హారతి– గంగాలహరి!

నిన్న–నేడు ఎన్నో పరిణామాలు? ఎన్నెన్నో విపరిణామాలు? సరి, మరి–రేపు?

'కానున్నది–రానున్నది' ఎవరికెరుక? ఆ వెంటనే 'బ్రహ్మ వేదాప్నోతిపరమ్' (ఆత్మజ్ఞానంతో బ్రహ్మైకత్వం సాధించటమే అమరత్వం) అన్నది మననస్థితి! సంతృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు. తెమ్మెర తనువుని చల్లగా తాకింది! అది 'గంగాలహరి' శాశ్వత స్పర్శ!!

**వచ్చేవారం కథ**

**సుమిత్ర – ఎం. హనుమంతరావు**

మేధో క్రీడ చదరంగంలో భారత్ విశ్వశక్తిగా రూపుదిద్దుకొంది. నలుగురు యువగ్రాండ్ మాస్టర్లతో ప్రపంచ చదరంగ జైత్రయాత్రకు శ్రీకారం చుట్టింది. ఇతిహాస క్రీడచదరంగంలో భారత్ యువరక్తంతో ఎగసిపడుతోంది. చదరంగ క్రీడను శాసిస్తున్న రష్యా, ఉక్రెయిన్, చైనా, నార్వేలకు సవాలు విసురుతూ సరికొత్త శక్తిగా భారత్ అవతరించింది. పురుషుల విభాగంలో మాత్రమే కాదు..మహిళల విభాగంలోనూ భారత్ విశ్వ చదరంగాన్నే శాసించే స్థితికి చేరుకొంది.



# విశ్వ చదరంగ 'మహాశక్తి' భారత్!

భారత చదరంగం అంటే కేవలం విశ్వనాథన్ ఆనంద్ మాత్రమే అనుకొనే రోజులు పోయాయి. ఆనంద్ స్ఫూర్తి, ప్రేరణతో భారత చదరంగంలో ఓ విప్లవమే వచ్చింది. 1970 దశకంలో ఆనంద్ లాంటి ఒకరిద్దరు గ్రాండ్ మాస్టర్లతో మొదలైన భారత చదరంగ ప్రస్థానం ప్రస్తుతం 84 మందికి చేరింది. ప్రస్తుత ప్రపంచ చెస్‌లో అత్యధిక గ్రాండ్‌మాస్టర్లు కలిగిన దేశాలలో ఒకటిగా భారత్ కొనసాగుతోంది. 2600కు పైగా ఎలో రేటింగ్ సాధించిన గ్రాండ్ మాస్టర్లు డజనుకు పైనే ఉన్నారు.

ప్రపంచ చదరంగ సమాఖ్య ఇటీవలే వెల్లడించిన తాజా రేటింగ్స్ ప్రకారం సూపర్ గ్రాండ్ మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్‌ను 'పిల్ల' గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద్ మించిపోయాడు. అతను 2748.3 పాయింట్లతో ప్రపంచ ర్యాంకింగ్ జాబితా 11వ స్థానంలో ఉన్నాడు. విశ్వనాథన్ ఆనంద్ 2748 పాయింట్లతో 12వ స్థానంలో సాగుతున్నాడు.

2024 టాటా స్టీల్ మాస్టర్స్ అంతర్జాతీయ చెస్ టోర్నీ నాలుగో రౌండ్‌లో ప్రపంచ చాంపియన్, చైనా సూపర్ గ్రాండ్ మాస్టర్ డింగ్ లిరెన్‌ను ఓడించడం ద్వారా ప్రజ్ఞానంద్ రేటింగ్స్‌లో తన ఆరాధ్య దైవం ఆనంద్‌నే మించిపోయాడు. అంతేకాదు.. విశ్వనాథన్ ఆనంద్ తర్వాత.. క్లాసికల్ చెస్ విభాగంలో ఓ ప్రపంచ విజేతను ఓడించిన రెండో భారతీయుడిగా నిలిచాడు.



క్రీడా కృష్ణ, 84668 64969
సీనియర్ జర్నలిస్ట్

**అహో! తమ్ముడు..ఒహో అక్క...**

ప్రపంచ ఆధునిక చదరంగ చరిత్రలోనే ఒకే కుటుంబం నుంచి వచ్చిన గ్రాండ్ మాస్టర్లుగా ప్రజ్ఞానంద్, వైశాలి సరికొత్త రికార్డు నెలకొల్పారు. భారత తొలి గ్రాండ్‌మాస్టర్‌గా నిలిచిన ఘనత విశ్వనాథన్ ఆనంద్‌ది కాగా..ఆ తరువాత మరో ముగ్గురు మహిళలు సహా మొత్తం 84 మంది గ్రాండ్‌మాస్టర్లుగా నిలువగలిగారు.

అంతర్జాతీయంగా జరిగే పలు రకాల చదరంగ పోటీలలో పాల్గొంటూ సాధించిన విజయాలకు ప్రపంచ చెస్ సమాఖ్య రేటింగ్ పాయింట్లు ఇస్తుంది. తొలిదశలో ఇంటర్నేషనల్ మాస్టర్ హోదా సాధించిన క్రీడాకారులు 2500 ఎలో రేటింగ్ పాయింట్లు సాధించగలిగితే గ్రాండ్ మాస్టం హోదా దక్కుతుంది. చదరంగ క్రీడాకారులకు గ్రాండ్ మాస్టర్ హోదా సాధించడం అంటే ఓ తపస్సు చేయడం లాంటిదే.

**ఆనంద్ నుంచి వైశాలి వరకూ...**

భారత చదరంగ చరిత్రలో ఐదుసార్లు విశ్వవిజేత విశ్వనాథన్ ఆనంద్‌తో మొదలైన గ్రాండ్ మాస్టర్ల పరంపర వైశాలి వరకూ వచ్చింది. మొత్తం 84 మంది గ్రాండ్ మాస్టర్లలో ముగ్గురు మాత్రమే మహిళలు కావడం విశేషం.

భారత మహిళా చెస్ లో గ్రాండ్ మాస్టర్ హోదా సాధించిన మూడో మహిళగా వైశాలి రికార్డుల్లో చేరింది. వైశాలి కంటే ముందే ఇదే ఘనతను సాధించిన వారిలో తెలుగుతేజాలు గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి, గ్రాండ్ మాస్టర్ ద్రోణవల్లి హారిక మాత్రమే ఉన్నారు. తాజాగా ఈ ఇద్దరి సరసన వచ్చి వైశాలి సైతం చేరింది.

**ఒక్కరు కాదు...నలుగురు!**

విశ్వచదరంగ విజేతలతో పోటీకి అర్హతగా జరిగే 2024 ప్రపంచ క్యాండిడేట్స్ చెస్ పురుషుల, మహిళల విభాగాలలో నలుగురు భారత గ్రాండ్ మాస్టర్లు తొలిసారిగా అర్హత సంపాదించారు. ప్రపంచ చెస్ పురుషుల విజేత, చైనా గ్రాండ్ మాస్టర్ డింగ్ లిరెన్ తో తలపడే మొనగాడు ఎవరో తేల్చడానికి టొరాంటో వేదికగా నిర్వహించే 2024 క్యాండిడేట్స్ టోర్నీలో తలపడే మొత్తం 8 మందిలో ముగ్గురు భారత గ్రాండ్‌మాస్టర్లే ఉన్నారు. వీరిలో 2023 ప్రపంచకప్ రన్నరప్ ప్రజ్ఞానంద్, స్విస్ గ్రాండ్ మాస్టర్ టోర్నీ విన్నర్ విదిత్ గుజరాతీ, ఫిడే సర్క్యూట్ విన్నర్ గుకేశ్ ఉన్నారు. భారత చదరంగ చరిత్రలో ఒకేసారి ముగ్గురు గ్రాండ్ మాస్టర్లు ప్రపంచ క్యాండిడేట్స్ టోర్నీ ఫైనల్స్‌కు అర్హత సాధించడం ఇదే మొదటిసారి. మిగిలిన ఐదుగురు విదేశీ గ్రాండ్ మాస్టర్లలో ఇయాన్ నెపోమినియాచ్చీ, ప్రపంచకప్‌లో మూడో స్థానంలో నిలిచిన ఫేబియానో కరూనా, 4వ స్థానం సాధించిన నిజత్ అబ్బోస్వ్, గ్రాండ్ స్విస్ టోర్నీ రన్నరప్ హికారు నకామురా, బెస్ట్ రేటింగ్ ప్లేయర్ అలీరెజా ఫిరోజా ఉన్నారు. 2024 ప్రపంచ చెస్ టైటిల్ పోరు ఏప్రిల్ లో జరుగనుంది. మహిళల క్యాండిడేట్స్ ఫైనల్స్‌కు అర్హత సాధించిన వారిలో భారత మహిళా గ్రాండ్‌మాస్టర్ వైశాలీ రమేశ్ బాబు సైతం ఉంది. సీనియర్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపికి సైతం రేటింగ్ ప్రకారం పోటీపడే అవకాశం లేకపోలేదు.

మొత్తం మీద..పురుషుల, మహిళల విభాగాలలో భారత్ కు చెందిన నలుగురు యువ గ్రాండ మాస్టర్లు ప్రపంచ క్యాండిడేట్స్ పురుషుల, మహిళల టోర్నీలలో తమ అదృష్టం పరీక్షించుకోబోతున్నారు.

ప్రపంచ చదరంగంలో గత దశాబ్దకాలం వరకూ ఓ వెలుగు వెలిగిన రష్యా, సోవియెట్ మాజీ రిపబ్లిక్ దేశాలు వెలవెలపోతుంటే ఆ స్థానాన్ని భర్తీ చేయటానికి సరికొత్త శక్తిగా భారత్ ముందుకు వచ్చింది. రానున్న కాలంలో ప్రపంచ చదరంగంలో భారత యువ గ్రాండ్‌మాస్టర్ల ఆధిపత్యమే కొనసాగుతుందనడంలో ఏమాత్రం సందేహం లేదు. ★

# గిరిజనుల నుంచి ఎంతో నేర్చుకోవాలి





**విశాఖ:** ప్రపంచం అంతా ఆమోదిస్తున్న, గౌరవంగా చూస్తున్న భారతీయ సంస్కృతి ఇక్కడి ఆదివాసీ సంస్కృతి నుంచే వచ్చిందని వనవాసీ కల్యాణ్ ఆశ్రమ్ జాతీయ కార్యదర్శి పి సోమయాజులు అన్నారు. రాష్ట్ర వనవాసీ కళ్యాణ్ ఆశ్రమ్ విజయ నగరం కేంద్రీయ విశ్వవిద్యాలయంతో కలసి నిర్వహించిన తూర్పు కనుమల గిరిజన సాంస్కృతిక యాత్ర ముగింపు సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజర య్యారు.

ఫిబ్రవరి 4, 2024న విశాఖ ఆంధ్ర విశ్వవిద్యాలయం కన్వెన్షన్ హాలులో జరిగిన ముగింపు సభలో మాట్లాడుతూ మన సంస్కృతి, సభ్యత, సంప్రదాయాలు అరణ్యం నుంచే వచ్చాయని, సమాజానికి మార్గదర్శకులైన రుషులు, మునులు అక్కడే ఉండేవారని అన్నారు. చెట్ల మాదిరి జీవనం సాగించడం ద్వారా గిరిజనులు సాటి సమాజానికి ఆదర్శంగా నిలచారని, చెట్లు ఎండను తాము భరించి కింద ఉండే వారికి నీడనిస్తాయని చెప్పారు. ప్రకృతిని భగవంతుడి స్వరూపంగా భావించే గిరిజనులను ఆదర్శంగా తీసుకోవాలని, వారు అడవిలో చెట్టును నరకాల్సి వచ్చినప్పుడు దానికి నమస్కారం చేస్తారని వివరించారు. భారత్‌కు బ్రిటిష్ వారు రాకముందు అడవులు ఆరోగ్యంగా ఉండి దేశాన్ని రక్షించాయని, అటవీ ఫల సాయాన్ని బ్రిటిష్ వారు వ్యాపారంగా మార్చి అడవుల విస్తీర్ణాన్ని తగ్గించారని అన్నారు.

గిరిజనహక్కుల పరిరక్షణ సంస్థ హితరక్షా జాతీయ కార్యదర్శి గిరీష్ కుబేర్ మాట్లాడుతూ,గిరిజనులను అభివృద్ధి చేయాలంటే ముందుగా గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, భాషలను అర్థం చేసుకోవాలని సూచించారు. దేశంలోని విశ్వవిద్యాలయాలు ఆ పనిచేసి సూచనలివ్వాలని అప్పుడు అటవీ హక్కులచట్టం, కమ్యూనిటీ హక్కులు, పీసా చట్టం పరిపూర్ణంగా అమలు అవుతాయని అభిప్రాయపడ్డారు. గిరిజనులకు నమ్మకం కలిగించి వారిని కలుపుకోగలిగే విధానాన్ని రూపొందించాల్సిన అవసరముందని అన్నారు. విజయ నగరం గిరిజన విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య కట్టు మణి మాట్లాడుతూ, మంచి విద్యను గిరిజనులకు అందించడం ద్వారా మాత్రమే వారి అభివద్ధి సాధ్యమవుతుందని చెప్పారు.గిరిజనులు ఏ పనిచేసినా, ఎన్ని పంటలు పండించినా విద్య లేకపోవడం వల్ల నష్టపోతున్నారని అవేదన వ్యక్తం చేశారు. గిరిజన పిల్లలు మధ్యలో చదువు మానేయకుండా ఉన్నత విద్య అభ్యసించాలని సూచించారు.

సభకు అధ్యక్షత వహించిన కల్యాణ్ ఆశ్రమ్ రాష్ట్ర అధ్యక్షుడు చెడ్డా గోపీనాథ్ మాట్లాడుతూ, 11 రోజుల పాటు జరిగిన యాత్రకు మంచి స్పందన లభించిం దని, 22 ప్రాంతాలలో సభలు జరిగాయని అన్నారు. గిరజనేతరులలో గిరిజనుల పట్ల ఉన్న అపోహలను తొలగించి వారిలో సోదరభావం కల్పించడంలో యాత్ర విజయం సాధించిందని అన్నారు. ఈ సందర్భంగా యాత్రలో క్రియాశీలకంగా వ్యవహరించిన శక్తి సంస్థ నిర్వహకుడు డాక్టర్ పిరాట్ల శివరామకృష్ణ “గిరుల ఆరోగ్యమే పల్లపు ప్రాంతాల సౌభాగ్యం” పేరిట రాసిన తెలుగు, ఇంగ్లీషు పుస్తకాలను ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ప్రసాద రెడ్డి, గిరిజన విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య కట్టుమణి ఆవిష్కరించారు. ఆశ్రమ్ జాతీయనాయకుడు హెచ్ కే నాగు ఈ పుస్తకాలను పరిచయం చేశారు. ఆ సం దర్భంగా శివరామకృష్ణను సన్మానించారు. జైపూర్ రాజమాత మయాంక్ కుమారి దేవ్, రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు పాల్గొన్నారు. విమానం ఆలస్య మైన కారణంగా రాలేకపోయిన కేంద్ర గిరిజన శాఖామంత్రి అర్జున్ ముండా వీడియోద్వారా సందేశాన్ని వినిపించారు. గిరిజనుల ధింసా నృత్యంతో కార్యక్రమం ప్రారంభమైంది.




## కేశవ స్మృతి సంవర్ధన సమితి ఉచిత కార్ డ్రైవింగ్ శిక్షణ

**భాగ్యనగర్:** జనవరి 30, 2024న భాగ్యనగర్‌లోని లింగంపల్లి ఎలైట్ డ్రైవింగ్‌స్కూల్‌లో 7వ బ్యాచ్ 22మందితో మాజీ ఎమ్ఎల్ఏ విఠల్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు పెద్దిరెడ్డి కృష్ణారెడ్డి, కార్యదర్శి కొప్పరపు బాలయ్య, కోశాధికారి రొద్ద రామచందర్, సభ్యులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# భాగ్యనగర్‌లో దివ్యాంగ సమ్మేళనం







**భాగ్యనగర్:** సక్షమ్ ఆధ్వర్యంలో తెలంగాణ దివ్యాంగ సమ్మేళనం జనవరి 28వ తేదీన భాగ్యనగర్‌లోని కేశవమెమోరియల్ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రాంతంలోని 11జిల్లాల నుండి 1350 మంది దివ్యాంగులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సమస్యల గురించి చర్చించి ఒక సమగ్ర నివేదికను తయారుచేసి ప్రభుత్వ సోషల్‌వెల్‌ఫేర్, ఉమెన్ ఎంపవర్‌మెంట్, దివ్యాంగ శాఖకు సంబంధించిన ప్రభుత్వ కార్యదర్శికి అందజేశారు. దివ్యాంగ పిల్లలకు ఆటలపోటీలు నిర్వహించి బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్త్రీ శిశు, దివ్యాంగశాఖ, వృద్ధుల శాఖ ప్రభుత్వ కార్యదర్శి వాకాటి కరుణ, సక్షమ్ తెలంగాణ ప్రాంత అధ్యక్షులు డా॥ వేదప్రకాశ్, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ హాస్పిటల్ చైర్‌పర్సన్ ఎస్.వి.రావు, సక్షమ్ అఖిల భారతీయ సంయుక్త కార్యదర్శి ఉమేశ్ అంధేరే, ప్రాంత ఉపాధ్యక్షులు దయాకర్, ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ ప్రాంత కార్యవాహ కాచం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.






**నెల్లూరు :** ఫిబ్రవరి4, 2024న బస్తీ సప్తాహం ముగింపు సందర్భంగా నెల్లూరు విఆర్ కళాశాల మైదానంలో 41 బస్తీల స్వయంసేవకులతో సాంఘిక్ జరిగింది. మొత్తం ఉపబస్తీలు:186 పాల్గొన్న ఉపబస్తీలు:155, సాంఘీక్‌లో 2096 మంది స్వయంసేవకులు పాల్గొన్నారు. ముఖ్యవక్తగా ప్రాంత ప్రచార ప్రముఖ్ భయ్యా వాసు పాల్గొని ప్రసంగించారు.

వేదికపై ముఖ్యఅతిథిగా వ్యాపారవేత్త కేశవరామ్, ప్రాంత సంఘచాలక్ హరికుమార్‌రెడ్డి, విభాగ్‌సంఘచాలక్ రామదండు, నగర సంఘచాలక్ డా॥ సి.వి.సుబ్రహ్మణ్యం.



## యువతకు సర్టిఫికెట్ల పంపిణీ



**పార్వతీపురం :** ఫిబ్రవరి 4వ తేదీన పార్వతీపురం, భామిని మండలంలోని ఘనసర గ్రామంలో గ్రామీణవికాస సంఘం ద్వారా కంప్యూటర్ సెంటర్‌లో శిక్షణ పొందిన 8 గ్రామాల నుండి 60మంది యువతీయువకులకు సర్టిఫికెట్‌లను అందజేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, కొత్తూరు రవికుమార్, అతిథిగా గుడ్ల సత్యారావు హాజరైనారు.

# బాల జాగృతి

## తెలుసుకుందాం — రుద్రేశ్వరాలయం- అస్సోం



అస్సోం రాజధాని గౌహతిలో గల బ్రహ్మపుత్ర నదికి ఉత్తర ఒడ్డున గల రుద్రేశ్వర్ గ్రామంలో శివునికి అంకితం ఇచ్చిన దేవాలయమిది. 1749లో అహోం రాజు ప్రమత్త సింఘా తన తండ్రి స్వర్గదేయో రుద్ర సింహ జ్ఞాపకార్థం దీనిని నిర్మించి, రుద్రేశ్వర దేవాలయం అని పేరు పెట్టాడు. అందుకే ఆలయాన్ని నిర్మించిన గ్రామాన్ని రుద్రేశ్వర్ అని కూడా అంటారు.

## కథ — కోతి-తోడేలు



అనగనగా ఒక అడవిలో ఒక తోడేలు ఉండేది. అడవిలోని జంతువులను చంపి తిని ఆకలి తీర్చుకునేది. ఒక్కోసారి మాత్రం ఎంత వెదికినా దానికి ఆహారం దొరికేది కాదు. అటువంటప్పుడు అది రాత్రిపూట అందరూ నిద్రపోయే సమయంలో అడవికి దగ్గరలో ఉన్న గ్రామానికి వెళ్లి మేకలను చంపి అడవికి తెచ్చుకొని తింటూ ఉండేది.

తోడేలు చేసే పనుల్ని అడవిలో ఉండే ఒక కోతి చాలా కుతూహలంగా గమనించింది. విషయం తెలుసుకున్న తోడేలు చాలా తెలివిగా తాను చేస్తున్న పని గురించి కోతికి గొప్పగా చెప్తుండేది. యజమానులకు తెలియకుండా మేకలను ఎలా చంపుతోందో కోతికి వర్ణించి చెప్పేది. ఆ మాటలు విన్న కోతికి తోడేలు వాళ్ల కళ్లు కప్పి మేకల్ని ఏ విధంగా పట్టుకుంటోందో చూడాలనిపించేది.

ఒకరోజు కోతి "గ్రామానికి వెళ్లేటప్పుడు నన్ను కూడా తీసుకెళ్లావా? నీ పనితనం చూడాలనుంది" అని తోడేలును అడిగింది. అప్పుడు తోడేలు "ఈ రోజు రాత్రికే నిన్ను తీసుకెళతాను. సిద్ధంగా ఉండు" అని చెప్పింది. తన ముచ్చట తీరబోతున్నందుకు కోతి చాలా మురిసిపోయింది.

తమ ఊరిలో మేకలు మాయం అవుతుండటం ఊరివారు గమనించారు. సంగతి ఏంటో తెలుసుకోవాలని కొందరు యువకులు

## పద్యము

**సరివారిలోన నేర్పున**
**దిరిగెడు వారలకుగాక తెరవాటులలో**
**నరయుచు మెలగెడి వారికి**
**బరువేటికి గీడె యనుభవంబు కుమారా!**

**భావం :** ఓ కుమారా! తనతో సమానమైన వారితో నేర్పున నడుచుకొనిన గౌరవము, కీర్తి లభించును. అంతేకాక దుష్టులతోనూ, దొంగలతోనూ స్నేహం చేసిన యెడల గౌరవము చెడి కీడు జరుగును.

## శ్లోకము

**అన్నదానం పరం దానం**

**'అన్నదానం పరం దానం**
**విద్యాదాన మతఃపరమ్**
**అన్నే క్షణికాతృప్తిః**
**యావజ్జీవంచ విద్యయా'**

**భావం :** అన్నదానం గొప్పదే. విద్యాదానం ఇంకా ఉన్నతమైనది. భోజనం ఇచ్చే తృప్తి క్షణకాలం మాత్రమే. విద్య జీవితాన్ని ఇస్తుంది.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| ఆఫ్ఘనిస్తాన్ | - వెల్లింగ్టన్ |
| బంగ్లాదేశ్ | - ఓస్లో |
| నార్వే | - బెర్లిన్ |
| న్యూజిలాండ్ | - కాబూల్ |
| క్యూబా | - ఢాకా |
| జర్మనీ | - హవానా |

జవాబులు : ఆఫ్ఘనిస్తాన్-కాబూల్; బంగ్లాదేశ్-ఢాకా; నార్వే-ఓస్లో; న్యూజిలాండ్-వెల్లింగ్టన్; క్యూబా-హవానా; జర్మనీ-బెర్లిన్

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### తారకేశ్వరి సిన్హా




ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు. 26 డిసెంబరు 1926న జన్మించారు. బిహార్ రాష్ట్రానికి చెందిన రాజకీయ నాయకురాలు, పార్లమెంట్ మాజీ సభ్యురాలు. క్విట్ ఇండియా ఉద్యమంలో చురుకైన పాత్రను పోషించారు. ఉద్యమంలో భాగంగా అరెస్ట్ కూడా అయ్యారు. స్వాతంత్ర్యానంతరం రాజకీయాల్లో చేరారు. 14 ఆగస్టు 2007న మరణించారు.

## జనరల్ నాలెడ్జ్

1. భారత గణతంత్ర దినోత్సవాలకు ముఖ్య అతిథిగా వచ్చిన ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ ఏ దేశానికి అధ్యక్షుడు?
2. అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ ఏ రోజున జరిగింది?
3. ఇటీవల ఏ రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రవేశపెట్టారు?

సమాధానాలు 1. ఫ్రాన్స్, 2. జనవరి 22, 2024 3. తెలంగాణ



కాపలా కాయసాగారు. విషయం తెలియని తోడేలు కోతితో కలిసి ఊరిలో ప్రవేశించింది. మేకలను తినడానికి వాటి దగ్గరకు తోడేలు వెళ్లడాన్ని యువకులు గమనించారు. మేకలు ఎలా మాయమవుతున్నాయో వారికి అర్థం అయింది. వెంటనే తోడేలుపై దాడి చేశారు. దానితో ఉన్న కోతిని కూడా కొట్టసాగారు. ఆ దెబ్బలకు తట్టుకోలేక కోతి, "మీ మేకల్ని తినటానికి వచ్చింది తోడేలు. నేను కాదు కదా! నన్నెందుకు కొడుతున్నారు! వదిలేయండి" అని అడిగింది.

"తోడేలుకి సహాయంగా వచ్చావు. నిన్ను మాత్రం ఎలా విడిచి పెడతాం!" అంటూ కొట్టసాగారు. చివరకు ఎలాగోలా అక్కడి నుంచి తప్పించుకొని 'బతుకు జీవుడా' అనుకుంటూ అడవికి చేరుకుంది. ★

## మెదడుకు మేత

ముళ్ల పొదల్లో మిఠాయి పొట్లం.. అది దక్కించుకోవాలంటే చేయాల్సిన యుద్ధం.. ఏమిటది?

జవాబు : తేనెతుట్టలో తేనె

## మంచిమాట

గమ్యాన్ని చేరేందుకు
రెండే రెండు మార్గాలు..
ఒక్కటి స్వశక్తి..
రెండోది పట్టుదల..



# వారఫలాలు

12-18 ఫిబ్రవరి, 2024



సింహంభట్ల సుబ్బారావు
6300674054

**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

వ్యతిరేక పరిస్థితులను అనుకూలంగా మార్చుకుంటారు. సమాజంలో విశేష గౌరవం పెరుగుతుంది. విద్యార్థులు ఆశించిన అవకాశాలు పొందుతారు. పలుకుబడి కలిగినవారు పరిచయాలు ఏర్పడవచ్చు. వాహనాలు, ఆభరణాలు కొంటారు. నూతన వ్యక్తుల పరిచయాలు. వ్యాపారులకు లాభాలు దక్కుతాయి. ఉద్యోగులకు సంతోషకరమైన సమాచారం. క్రీడాకారులకు కొంత ఊరట. 17,18 తేదీల్లో శారీరక రుగ్మతలు. శివాష్టకం పఠించండి..

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

కొత్త కార్యక్రమాలు చేపట్టి సజావుగా సాగుతాయి. రాబడి విషయంలో గందరగోళం తొలగుతుంది. విద్య, ఉద్యోగయత్నాలు అనుకూలిస్తాయి. వాహనాలు, భూములు కొంటారు. కొన్ని వివాదాలు తేలిగ్గా పరిష్కరించుకుంటారు. కొత్త కాంట్రాక్టులు లభిస్తాయి. ఉద్యోగులకు మార్పులు ఉండవచ్చు. రాజకీయవేత్తలు, రచయితలకు ఆశ్చర్యకరమైన ఫలితాలు ఉంటాయి. 14,15 తేదీల్లో దూరప్రయాణాలు. కనకధారా స్తోత్రాలు పఠించండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

కొన్ని కార్యక్రమాలు నెమ్మదిగా సాగుతాయి. భూములు, వాహనాలు కొంటారు. కోర్టు కేసులు పరిష్కారమవుతాయి. వ్యతిరేకులు అనుకూలురుగా మారతారు. నిర్ణయాలలో మార్పులు చేసుకుంటారు. వ్యాపారులకు ప్రోత్సాహకరం. ఉద్యోగులకు ప్రశంసలు అందుతాయి. క్రీడాకారులు, రచయితలకు శుభవార్తలు. 12,13 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. శివపంచాక్షరి పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

చేపట్టిన కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు. సమాజసేవలో భాగస్వాములమవుతారు. నిరుద్యోగులకు శుభవార్తలు. భూములు, వాహనాలు కొంటారు. వ్యాపారులకు తగినంత లాభాలు దక్కుతాయి. ఉద్యోగులకు ఒత్తిడులు క్రమేపీ తొలగుతాయి. పారిశ్రామికవేత్తల యత్నాలు సఫలం. రచయితలు, క్రీడాకారులకు అనుకున్న లక్ష్యాలు సాధిస్తారు. 12,13తేదీల్లో వృథా ఖర్చులు. శారీరక రుగ్మతలు. విష్ణుధ్యానం చేయండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

ప్రత్యర్థులను సైతం అనుకూలంగా మార్చుకుంటారు. సేవాకార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటారు. ఆలయాలు సందర్శిస్తారు. అదనపు ఆదాయం సమకూరి అవసరాలు తీరతాయి. ముఖ్య నిర్ణయాలకు తగిన సమయం. సోదరులు, స్నేహితులతో విభేదాలు పరిష్కరించుకుంటారు. ఉద్యోగులకు విధుల్లో అనుకూలమైన వాతావరణం నెలకొంటుంది. 16,17 తేదీల్లో స్వల్ప అనారోగ్యం. కనకధారా స్తోత్రాలు పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

కొన్ని వ్యవహారాలు సాఫీగా సాగుతాయి. కొన్ని సమస్యలు ఎదురైనా నేర్పుగా పరిష్కరించుకుంటారు. ఆదాయం ఆశాజనకంగా ఉంటుంది. ఆస్తుల కొనుగోలులో ఆటంకాలు తొలగుతాయి. గృహ నిర్మాణాలకు శ్రీకారం చుడతారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. పారిశ్రామిక, రాజకీయ వేత్తలకు కృషి ఫలిస్తుంది. 17,18 తేదీల్లో శారీరక రుగ్మతలు. ఆంజనేయ దండకం పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

ముఖ్యకార్యక్రమాలలో ముందడుగు పడుతుంది. విద్యార్థుల్లో ఉత్సాహం పెరుగుతుంది. బంధువులు మీపై మరింత అభిమానం పెంచుకుంటారు. ఆదాయం ఆశాజకనంగా ఉంటుంది. వ్యాపారులు ఉత్సాహంతో ముందుకు సాగుతారు. రాజకీయవేత్తలు, కళాకారులకు అనుకూలం. రచయితలకు కొత్త ఆలోచనలు వస్తాయి. 12,13 తేదీల్లో వృథా ఖర్చులు. గాయత్రీ ధ్యానం చేయండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

మధ్యమధ్యలో కొన్ని సమస్యలు ఎదురైనా అధిగమించి ముందుకు సాగుతారు. ఆదాయం గతం కంటే మెరుగ్గా ఉంటుంది. ఇతరులకు ఇచ్చిన హామీలు నిలుపుకుంటారు. వాహనాలు, భూములు కొంటారు. వేడుకల్లో చురుగ్గా పాల్గొంటారు. వ్యాపారులు లాభాల దిశగా నడుస్తారు. ఉద్యోగులకు అవాంతరాలు తొలగుతాయి. 14,15 తేదీల్లో ఆరోగ్యసమస్యలు. సూర్యారాధన చేయండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

రాబడి మీ అంచనాలకు తగినట్లుగా ఉంటుంది. అనుకున్న కార్యక్రమాలలో పురోగతి సాధిస్తారు. విద్యార్థులు కొత్త ఆశలతో ముందడుగు వేస్తారు. ఊహించని కాంట్రాక్టులు లభిస్తాయి. దేవాలయాలు సందర్శిస్తారు. వ్యాపారులకు విస్తరణ కార్యక్రమాలు అనుకూలిస్తాయి. రాజకీయ, పారిశ్రామికవేత్తల యత్నాలు సఫలం. 13,14 తేదీల్లో ఖర్చులు అధికం. శ్రీరామరక్షాస్తోత్రాలు పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

అనుకున్న కార్యక్రమాలలో ఆటంకాలు ఎదురవుతాయి. శారీరక రుగ్మతలు కొంత బాధిస్తాయి. స్నేహితులతో అకారణంగా విభేదాలు నెలకొంటాయి. ఆస్తులపై ఒప్పందాలలో మార్పులు ఉద్యోగాయత్నాలు నిరాశ పరుస్తాయి. మంచికి వెళితే చెడుగా మారే సూచనలు. కళాకారులు, పారిశ్రామిక వేత్తలకు, క్రీడాకారులకు గందరగోళపరిస్థితి. 14,15 లల్లో వాహనసౌఖ్యం. శుభవార్తలు. విష్ణుధ్యానం చేయండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

పరపతి కలిగిన వారితో పరిచయాలు ఏర్పడతాయి. కీలక సమాచారం అందుతుంది. అదనపు ఆదాయం సమకూరి అవసరాలు తీరతాయి. ఇంతకాలంపడిన కష్టంఫలిస్తుంది. స్థిరాస్తి విషయంలో సోదరులతో ఒప్పందాలు చేసుకుంటారు. దైవకార్యక్రమాలలో పాల్గొంటారు. కళాకారులు, రచయితలకు నూతనోత్సాహం. 17,18లలో వృథా ఖర్చులు. దక్షిణామూర్తి స్తోత్రాలు పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

కొన్ని వివాదాలు ఎదురైనా నేర్పుగా పరిష్కరించుకుంటారు. దైవకార్యాలలో పాల్గొంటారు. అదనపు రాబడి ఉంటుంది. చిన్ననాటి మిత్రులను కలుసుకుని ఉల్లాసంగా గడుపుతారు. వాహనాలు, భూములు కొనుగోలు చేస్తారు. ఆవ్యాపారులకు కొత్త పెటుబడులు సమకూరతాయి. ఉద్యోగులకు పరిస్థితులు అనుకూలిస్తాయి. రచయితలకు ఉత్సాహవంతంగా ఉంటుంది. 12,13 లలో ఆకస్మిక ప్రయాణాలు. సూర్యారాధన చేయండి.

# పదరసం-451

## ఆధారాలు

**అడ్డం**

1) అయోధ్యవిమానాశ్రయానికి ఈ మహర్షి పేరు పెట్టారు (3)
4) పూజ, ఉపాసన (4)
6) కోరిక,విషయం,సల్లాపం తిరగబడింది(3)
7) ఒక పట్టాన తెగని చిక్కు, మోసం (5)
8) అటునించి వచ్చిన పూదేనె (4)
10) నిద్ర పుచ్చునప్పుడు వాడే పదం (1)
11) పరాకాష్ట, రసపట్టు (5)
15) చెట్టు.మందుతో కూడా చెప్పడం రివాజు (2)
16) పాలమీద, పెరుగుమీద ఉండేది తిరగబడింది (3)
17) భాగం (2)
18) 14 నిలువు సరిగాలేదు (3)
21) తిరగబడ్డ సంతానం (2)
23) పెద్ద సూది (3)
24) సందేహంతో ముందు వెనకలాడు (6)
25) తిరగబడ్డ గొడవ (3)
26) మనదేశంలోని ఎడారి (2)

**నిలువు**

1) జీర్ణం, జీర్ణం బిబి జీర్ణం అనడం రివాజు (3)
2) ఇరుకుతో కష్టంగా ఉంటే వాడుక భాషలో ఇలా అంటారు (5)
3) అబద్ధం, అసత్యం (3)
4) పసి పిల్లల తలలకు రాసే నూనె (3)
5) పిసుకుట, తెలుగులో మాలిష్ (పైకి) (3)
9) వ్యవహార దక్షత, కథ తరువాత రివాజుగా అనేది చెదరిపోయింది (4)
12) కలసి ఉండటం (4)
13) అప్పడం తోటి చిన్నది పైకొచ్చింది (3)
14) స్త్రీ (3)
19) దీనిలో భోజనంచేస్తే ఆరోగ్యం (4)
20) ఆ మధ్య అల్లర్లు జరిగిన ఈశాన్య రాష్ట్రం (4)
21) తలపైధరించునగ (3)
22) గాలింపు (2)
23) గంటలు చేసే లోహం (2)
24) శిరస్సు (2)

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | 3 | | 4 | | | 5 |
| | | | | 6 | | | | | |
| 7 | | | | | | 8 | | 9 | |
| | | | | | 10 | | | | |
| 11 | 12 | | | 13 | | 14 | | 15 | |
| | | | | | | 16 | | | |
| | 17 | | | 18 | 19 | | | | 20 |
| 21 | | | 22 | | | | 23 | | |
| | | 24 | | | | | | | |
| 25 | | | | | | | | 26 | |

## పదరసం - 450 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| వై[1] | కుం | ఠ[2] | పా | ళి[3] | | | వె[4] | గ | టు |
| తా | | స్తం | | బో[5] | జ్జ | | న్నె | | |
| ళి[6] | ట | కం | | ట్టు | | నే[7] | ల | మ | ట్టం[8] |
| కు | | | ఏ[9] | తా | వా | తా | | | ప |
| డు[10] | ము[11] | వ్వు | లు | | | జీ[12] | వి[13] | | న |
| | ప్పే | | ట[14] | డా | యి[15] | | త్రి[16] | త | పా |
| పి[17] | ట | ము[18] | డి | | తా | | యం | | |
| నా | | సా | | వి[19] | క | ట | క | వి[20] | |
| సి[21] | పా | యి | ల | | ఆ | | | షా[22] | ని |
| | | దా | | తే[23] | | ఆ[24] | మో | దం | |




అరుణ

# సీక్వెల్స్ సందడి మొదలవుతోంది!

గతంలో తెలుగులో సీక్వెల్ మూవీ తీయాలంటే దర్శక నిర్మాతలు భయపడేవాళ్లు. విజయవంతమైన సినిమాకు కొనసాగింపుగా మరో సినిమా తీసి, ప్రేక్షకుల అంచనాలు అందుకోకపోతే అభాసుపాలు అవుతామనే భయం ఉండేది. అయితే... 'బాహుబలి'తో భారీ చిత్రాలను రెండు భాగాలుగా తీసి కొద్ది నెలల వ్యవధిలో విడుదల చేయడం మొదలైన తర్వాత సీక్వెల్, ఫ్రాంచైజ్ ట్రెండ్ ఊపందుకుంది. ఈ యేడాది కూడా అది 'యాత్ర-2'తో మొదలు అవుతోంది.




సరిగ్గా ఐదేళ్ల క్రితం 2019 ఫిబ్రవరి 8వ తేదీ మహి వి రాఘవ 'యాత్ర' పేరుతో ఓ సినిమా తీసి విడుదల చేశారు. వై.యస్. రాజశేఖర్ రెడ్డి చేసిన పాదయాత్ర నేపథ్యంలో తెరకెక్కిన ఆ సినిమా అప్పటి అసెంబ్లీ ఎన్నికల్లో వై.యస్.ఆర్.సి.పి.కి బాగానే ఉపయోగపడింది. ఎమ్మెల్యే క్యాండిడేట్స్ ఆ సినిమా థియేటర్లకు జనాలను ఉచితంగా తరలించి, వైయస్ఆర్ ఇమేజ్‌ను ఓట్ల రూపంలో మలుచుకున్నారు. విశేషం ఏమంటే...

సరిగ్గా ఐదేళ్ల తర్వాత 2024 ఫిబ్రవరి 8వ తేదీనే మహి వి రాఘవ తీసిన 'యాత్ర -2' వస్తోంది. ఇది వైయస్ఆర్ మరణానంతరం జగన్ చేసిన ఓదార్పు యాత్ర నేపథ్యంలో తెరకెక్కడం విశేషం. ఇవాళ ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న జగన్ పట్ల ప్రజలలో ఉన్న వ్యతిరేకతను ఏమేరకు ఈ సినిమా తగ్గిస్తుందో తెలియదు కానీ ప్రేక్షకులను ఓ మాదిరిగా అయినా ప్రభావితం చేస్తుందనే ఆశతో మేకర్స్ ఉన్నారు. 'యాత్ర'లో మలయాళ సీనియర్ స్టార్ హీరో మమ్ముట్టి వైయస్ రాజశేఖరరెడ్డి పాత్రను పోషించగా, 'యాత్ర-2'లో తమిళ యువ కథానాయకుడు జీవా వైయస్ జగన్‌గా నటించాడు.

ఈ నెలలోనే రాబోతున్న మరో సీక్వెల్ మూవీ 'భామాకలాపం-2'. ప్రియమణి ప్రధాన పాత్ర పోషించిన 'భామాకలాపం' సినిమా రెండేళ్ల క్రితం ఆహాలో ఫిబ్రవరి 11న స్ట్రీమింగ్ అయ్యింది. మధ్యతరగతి మహిళ, యూ ట్యూబర్ అనుపమ మోహన్ అనుకోకుండా ఓ హత్యలో ఇరుక్కుని దాని నుండి బయట పడటానికి ఎలాంటి తిప్పలు పడిందనే నేపథ్యంలో అప్పటి 'భామాకలాపం'ను తీశారు. ఆ చిత్రానికి చక్కని ఆదరణ లభించడంతో ఈసారి ఈ సీక్వెల్‌లో థియేటర్లలో విడుదల చేయాలని అనుకున్నారు. కానీ చివరి నిమిషంలో మనసు మార్చుకుని ఇప్పుడు కూడా ఓటీటీలోనే స్ట్రీమింగ్ చేయడానికి సిద్ధపడ్డారు. ఇటీవల విడుదలై 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్'లో నటించి, చక్కని పేరు తెచ్చుకున్న శరణ్య ప్రదీప్ 'భామాకలాపం-2'లోనూ ప్రియమణితో పాటు కలిసి నటించింది. మొదటి భాగాన్ని తెరకెక్కించిన అభిమన్యు తాడిమేటి దీనినీ డైరెక్ట్ చేశారు. ఐదేళ్ల క్రితం జులై 18న వచ్చిన రామ్ - పూరి జగన్నాథ్ 'ఇస్మార్ట్ శంకర్'కు కూడా ఇప్పుడు సీక్వెల్ రాబోతోంది. అదే 'డబుల్ ఇస్మార్ట్'. శివరాత్రి కానుకగా ఈ సినిమాను మార్చి 8న విడుదల చేస్తామని దర్శక నిర్మాత పూరి జగన్నాథ్ చెబుతున్నాడు. ఈ మూవీ తర్వాత పూరి జగన్నాథ్ చేసిన 'లైగర్', రామ్ నటించిన 'రెడ్, ది వారియర్, స్కంద' చిత్రాలు ఆశించిన స్థాయిలో ఆడలేదు. దాంతో వీరిద్దరూ ఇప్పుడు 'డబుల్ ఇస్మార్ట్' మూవీ విజయంపైనే ఆశలు పెట్టుకున్నారు. మార్చిలోనే రాబోతున్న మరో సీక్వెల్ మూవీ 'టిల్లు స్క్వేర్'. సిద్ధూ జొన్నలగడ్డ నటించిన 'డీజే టిల్లు' సినిమా 2022 ఫిబ్రవరి 12న విడుదలై చక్కని విజయాన్ని అందుకుంది. దాంతో అప్పట్లోనే దానికి సీక్వెల్ తీస్తున్నట్టు దర్శక నిర్మాతలు విమల్ కృష్ణ, సూర్యదేవర నాగవంశీ ప్రకటించారు. అయితే... సీక్వెల్ సెట్స్ పైకి వెళ్లే సరికీ దర్శకుడు విమల్ కృష్ణ స్థానంలోకి మల్లిక్ రామ్ వచ్చాడు. అలానే హీరోయిన్ నేహా శెట్టి ప్లేస్ లోకి అనుపమా పరమేశ్వరన్ వచ్చింది. వివిధ కారణాల వల్ల అనేక సార్లు వాయిదా పడిన ఈ సినిమా ఎట్టకేలకు మార్చి 29న జనం ముందుకు వస్తోంది.

అంజలి కథానాయికగా తెరకెక్కిన 'గీతాంజలి' మూవీ 2014 ఆగస్ట్‌లో విడుదలైంది. సరిగ్గా పదేళ్ల తర్వాత ఆ సినిమాకు సీక్వెల్‌గా 'గీతాంజలి మళ్లీ వచ్చింది' సినిమా రూపుదిద్దుకుంది. 'గీతాంజలి' సినిమాను కోన వెంకట్ సమర్పణలో ఎం.వి.వి.సత్యనారాయణ నిర్మించారు. ఇప్పుడూ వాళ్లిద్దరే దీనిని నిర్మిస్తున్నారు. అప్పటి 'గీతాంజలి'ని రాజ్ కిరణ్ తెరకెక్కించగా, ఇప్పుడీ సీక్వెల్‌ను కొరియోగ్రాఫర్ శివ తుర్లపాటి రూపొందించారు. అంజలి నటించిన 50వ చిత్రం 'గీతాంజలి మళ్లీ వచ్చింది'లో మలయాళ నటుడు రాహుల్ మాధవ్ కీలక పాత్ర పోషించాడు. అతి త్వరలోనే ఈ సినిమా విడుదల కానుంది. మూడేళ్ల క్రితం డిసెంబర్ 17న విడుదలైంది అల్లు అర్జున్ నటించిన 'పుష్ప' చిత్రం. ఈ సినిమా విడుదల సమయానికి దీనిని రెండు భాగాలుగా తీస్తున్నట్టు దర్శకుడు సుకుమార్ ప్రకటించారు. ఈ సినిమా అనూహ్య విజయాన్ని సాధించడంతో సీక్వెల్ మీద భారీ అంచనాలు ఏర్పడ్డాయి.

'పుష్ప'తో ఉత్తరాదిన విజయకేతనం ఎగరేసిన అల్లు అర్జున్ జాతీయ స్థాయిలో ఉత్తమ నటుడిగానూ అవార్డును అందుకున్నాడు. 'పుష్ప-2' సినిమా ఆగస్ట్ 15న విడుదల చేయబోతున్నట్టు ఈ చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ప్రకటించింది. అడివి శేష్ నటించిన 'గూఢచారి' సినిమా 2018 ఆగస్ట్‌లో విడుదలైంది.

శశికిరణ్ తిక్క దర్శకత్వం వహించిన ఈ సినిమాకు ఇప్పుడు సీక్వెల్ వస్తోంది. 'జి2' పేరుతో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాకు వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకత్వం వహిస్తుండగా, శేష్ సరసన నాయికగా బనిత సంధు నటిస్తోంది. ఈ సినిమా కూడా ఇదే యేడాది విడుదల కానుంది.

డబ్బింగ్ సీక్వెల్స్ విషయానికి వస్తే... కమల్ హాసన్, దర్శకుడు ఎస్. శంకర్ కాంబినేషన్‌లో 1996లో వచ్చిన 'ఇండియన్' (భారతీయుడు)కు సీక్వెల్ ప్రస్తుతం సెట్స్ పై ఉంది. ఆ సినిమా త్వరలోనే విడుదల కానుంది. సందీప్ కిషన్ నటించిన తమిళ చిత్రం 'మాయవన్'కు సీక్వెల్ తో పాటు కన్నడ చిత్రాలు 'కాంతార, కబ్జా'కు సీక్వెల్స్ రాబోతున్నాయి. సో... సీక్వెల్స్, ఫ్రాంచైజ్ మూవీస్‌కు రాబోయే రోజుల్లో కొరత ఉండదు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

# గ్రామీలతో భారతీయుల సందడి




మనసుకు ఆహ్లాదాన్ని కలిగించే కళల్లో సంగీత, సాహిత్యాలు ప్రధానమైనవి. కాలానికి తగ్గట్టుగా వాటిల్లో వచ్చిన మార్పులను అందిపుచ్చుకున్నప్పుడే దానికి ప్రజలలో ఆదరణ ఉంటుంది. మన సంగీతకళాకారులు సరిగ్గా అదే చేసి, అంతర్జాతీయ వేదికపై తమ ప్రతిభకు తగిన సత్కారాన్ని అందుకున్నారు. సంగీతానికి సంబంధించి ప్రతి ఏటా ఇచ్చే గ్రామీ అవార్డును భారతీయ సంగీతకారులు శంకర్ మహదేవ్, జాకీర్ హుస్సేన్‌లకు చెందిన ఫ్యూజన్ బాండ్ 'శక్తి' గెలుచుకుంది. వారు తాజాగా విడుదల చేసిన 'దిస్ మువెంట్' అన్న ఆల్బమ్ ఉత్తమ గ్లోబల్ మ్యూజిక్ ఆల్బమ్ అవార్డును గెలుచుకుంది. గత ఏడాది జూన్ 30న విడుదల చేసిన 'దిస్ మువెంట్' ఆల్బమ్‌లో ఎనిమిది పాటలున్నాయి. ఇందులో జాన్ మెక్‌లాలిన్ (గిటార్ సింథసిస్ట్), జాకీర్ హుస్సేన్ (తబ్లా), శంకర్ మహదేవ్ (వోకలిస్ట్), వి. సెల్వగణేశ్ (పెర్కషనిస్ట్), గణేశ్ రాజగోపాలన్ (వయోలనిస్ట్) కలిసి ఎనిమిది పాటలను సృష్టించారు. ఇతర కళాకారులైన సుసానా బకా, బోకాంటే, బర్నా బాయ్, డేవిడోలతో కలిపి వారిని కూడా నామినేట్ చేశారు. జాకీర్ హుస్సేన్ ఉత్తమ గ్లోబల్ మ్యూజిక్ పెర్ఫార్మెన్స్‌కు గ్రామీని పొందారు. బెలాఫ్లెక్, ఎడ్గర్ మేయర్, రాకేష్ చౌరాసియాలతో పాటు పష్తోకు ఆయన దోహదం చేశారు. హుస్సేన్ ఒకరాత్రిలో మూడు అవార్డులు అందుకోగా, చౌరాసియా రెండు అందుకున్నారు.





From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com


Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 76 Issue : 14



# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు

















| వెల : ₹.220/- | వెల : ₹.200/- | వెల : ₹.390/- | వెల : ₹.250/- | వెల : ₹.250/- |
|---|---|---|---|---|




















| వెల : ₹.360/- | వెల : ₹.90/- | వెల : ₹.200/- | వెల : ₹.100/- | వెల : ₹.150/- |
|---|---|---|---|---|




| వెల : ₹.799/- | వెల : ₹.499/- | వెల :₹.495/- | వెల : ₹.799/- | వెల : ₹.549/- |
|---|---|---|---|---|

ఎన్టీఆర్ స్టేడియంలో ఫిబ్రవరి 9 నుండి 19 వరకు జరుగనున్న పుస్తక మహోత్సవంలో 177,178 స్టాళ్లలో,
మరియు 303 లో ఉన్న సాహిత్య నికేతన్, నవయుగ భారతి విక్రయ కేంద్రాలను దర్శించండి.

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!
సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.
040-27563236, 9290127329
సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ - 2, దూరవాణి : 8333812687